

పేదలకు తీపికబురు

కార్డుదారులకు రేషన్ షాపుల ద్వారా మరిన్ని సరుకులు

వచ్చేనెల నుంచి కందిపప్పు

వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిన జొన్నలూ పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన నిత్యావసరాల ధరలతో తల్లడిల్లుతున్న పేదలకు ఊరటనిచ్చే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తీసుకుంది. రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, జొన్నలు కూడా ఇవ్వనుంది. వచ్చేనెల కోటా నుంచే అమలు చేయనుంది. దీనివలన జిల్లాలోని 6.70 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. గత టీడీపీ హయాం(2014-19)లో రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు పౌష్టికాహారాన్నిచ్చే జొన్నలు, రాగులు పంపిణీ చేశారు. ఆమేరకు బియ్యాన్ని మినహాయించారు. అలా ఐదేళ్లు కొనసాగించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. కొన్ని నెలలకే రాగులు, జొన్నల పంపిణీని నిలిపివేసింది. కొంతకాలం తర్వాత పంచదారకు

మిగతా 8వ పేజీలో...



కల్తీపాల తయారీ ఇలా..

గతంలో పాలల్లో నీళ్లు కలిపి కల్తీ చేసేవారు. ఆతర్వాత అధికపాల ఉత్పత్తి కోసం పశువులకు ఇంజక్షన్‌లు ఇవ్వడం ప్రారంభించారు. ఇప్పుడు ఏకంగా ప్రాణాలను హరించే పదార్థాలతో కల్తీ చేస్తున్నారు. కల్తీ పాలు తెల్లగా ఉండేందుకు పాలపొడి, లేదా పచ్చికొబ్బరిని ఉపయోగిస్తున్నారు. జిగురు వచ్చేందుకు సన్‌ఫ్లవర్, పామాయిల్‌ను మిక్స్ చేస్తున్నారు. నురుగు కోసం యూరియా, సల్ఫర్, ఇతరత్రా పలు రసాయనాలను కలుపుతున్నారు. ఇలా రూ. 100 ఖర్చుతో పది లీటర్ల కల్తీ పాలు తయారు చేస్తున్నారు.



దర్శిలో కల్తీ పాలను పారబోస్తున్న అధికారులు (ఫైల్)

'పాల'కూట విషం

దర్శి ప్రాంతంలో కల్తీ పాల తయారీ విచ్చలవిడిగా సాగుతోంది. కుటీర పరిశ్రమలా నడుస్తోంది. అడ్డగోలుగా సంపాదించాలన్న అత్యాశతో కొందరు వ్యక్తులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అత్యంత ప్రమాదకరమైన యూరియా, సల్ఫర్ ఇతరత్రా పలు రసాయనాలతో కల్తీపాలు తయారు చేస్తున్నారు. వాటిని సాధారణ పాలలో కలుపుతున్నారు. అసలుకు, కల్తీకి తేడా తెలుసుకోలేని విధంగా కనికట్టు చేస్తున్నారు. కొందరు ప్రైవేటు డెయిరీలకు పోస్తుండగా, మరికొందరు నేరుగా ప్రజలకు విక్రయించి వారిని అనారోగ్యం 'పాలు' చేస్తున్నారు. ఫిర్యాదులు అందినప్పుడు ఆహార భద్రత అధికారులు నామమాత్రం దాడులు చేస్తున్నారే తప్ప కట్టడికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు.



దర్శి ప్రాంతంలో విచ్చలవిడిగా కల్తీపాల తయారీ

యూరియా, సల్ఫర్ వంటి ప్రమాదకర రసాయనాల వినియోగం

లీటరు పాల నుంచి 10 లీటర్లు

ఇటు డెయిరీలు, అటు ప్రజలకు విక్రయం

ప్రాణాలతో అక్రమార్కుల చెలగాటం

అరకొర దాడులకే అధికారుల పరిమితం

దర్శి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతకు నిదర్శనంగా చెప్పుకునే పాలు విషపూరితమవుతున్నాయి. కొందరు రకరకాల పద్ధతుల్లో కల్తీ పాలను తయారు చేస్తున్నారు. వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని అనేక చోట్ల ఈ వ్యవహారం సాగుతున్నప్పటికీ దర్శి నియోజకవర్గంలో అత్యధిక గ్రామాల్లో ఎక్కువ మంది దీన్ని వ్యాపారంగా మార్చుకొని విషం చిమ్ముతున్నారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో కల్తీ పాల తయారీ ముమ్మరంగా జరుగుతోంది. దర్శి పట్టణంలో అనేక పాల విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ప్రజలు నిత్యం వందలాది లీటర్ల పాలు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు కల్తీ పాలను తయారుచేసి విక్రయ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. సేకరించిన పాలు నాణ్యమైనవా, కాదా అన్న విషయాన్ని పాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. నాణ్యతను తెలుసుకునేందుకు వారి వద్ద అవసరమైన పరికరాలు లేవు. దీంతో వచ్చిన పాలు వచ్చినట్లు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. నకిలీ పాల తయారీపై నిఘా లేకపోవడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది.

రెండేళ్లలో 20 కేసుల నమోదు

ఒక్క దర్శి నియోజకవర్గంలోనే రెండేళ్లలో నకిలీ పాల తయారీకి సంబంధించి 20 కేసులు నమోదయ్యాయి. దర్శి-కురిచేడు రోడ్డులోని ఓ పాల శీతల కేంద్రానికి నకిలీ పాలు కొనుగోలు చేసిన కేసులో అధికారులు రూ.50 వేల జరిమానా విధించారు. కల్తీ పాలను పరీక్షించే ప్రభుత్వ కార్యాలయం ఇప్పటికీ హైదరాబాద్‌లోనే ఉంది. ఇక్కడి అధికారులు తనిఖీలు చేసి పంపిన శాంపిల్స్‌ను పరీక్షించి నివేదికలు పంపడానికి నెలల తరబడి జాప్యం జరుగుతోంది. దీంతో కల్తీ పాల తయారీదారులకు భయం లేకుండా పోయింది. ఒకవేళ పట్టుకుని నేరం రుజువయినప్పటికీ జరిమానాలు మాత్రమే వేస్తున్నారు. ఫలితంగా, నకిలీ పాల తయారీదారులు పుట్టగొడుగుల్లా పెరుగుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్న కల్తీ పాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం వందల లీటర్ల కల్తీపాలు తయారీ

దర్శిలో కొంతకాలం క్రితం 600 లీటర్ల కల్తీ పాలను ఆహార భద్రతశాఖ అధికారులు పట్టుకున్నారు. అంతకుముందు లంకోజనపల్లిలో పాల విక్రయ కేంద్రం నిర్వాహకుడి వద్ద నకిలీ పాలు గుర్తించారు. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ కల్తీ పాలు పట్టుబడుతున్నాయంటే ఇక్కడ ఏస్థాయిలో అవి తయారవుతున్నాయో అర్థమవుతుంది. కొంతమంది అక్రమార్కులు నిత్యం వందలాది లీటర్ల కల్తీ పాలను తయారు చేసి కొన్ని పాల శీతల కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. లాభాపేక్షే ధ్యేయంగా పనిచేస్తున్న ఆ పాలశీతల కేంద్రాల నిర్వాహకులు వచ్చిన పాలను తనిఖీ చేయకుండా కొనుగోలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి పాల శీతల కేంద్రంలో లాక్టోమీటరు ద్వారా పాలను తనిఖీ చేసి స్వచ్ఛమైనవిగా నిర్ధారించుకున్న తరువాతే కొనుగోలు చేయాలి. అలాచేస్తే పాల రాబడి తగ్గి ఆదాయం పడిపోతుందన్న ఉద్దేశపూర్వకంగానే కల్తీ పాలను కొనుగోలు చేస్తున్నారు.



లంపీ వైరస్ కలకలం

కురిచేడు మండలంలో ఆవులకు వ్యాప్తి

ఆందోళనలో పశుపోషకులు

మెయిన్‌లో

దడపుట్టిస్తున్న నారు ధర

మూట రూ.4వేలకు పైనే..

గతం కన్నా రెట్టింపు

దక్షిణాదిలో ముమ్మరంగా పొగాకు నాట్లు

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు ఈ ఏడాది సాగు ఆరంభంలోనే బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా నారు ధర దడపుట్టిస్తోంది. మూట రూ.4వేలకుపైనే పలుకుతోంది. సాధారణంగా ఈ సమయంలో పొగాకు నారు బాగానే అందుబాటులో ఉంటుంది. మూట గరిష్ఠంగా రూ.1,500కు లభిస్తుంది. కాస్త డిమాండ్ ఉంటే రూ.2వేల వరకూ పలుకుతుంది. అయితే ఈ ఏడాది మూట నారు రూ.3వేల నుంచి ప్రారంభమై ప్రస్తుతం రూ.4వేలకు చేరింది. గడిచిన రెండు సీజన్లలో పొగాకుకు భారీ డిమాండ్ ఏర్పడి మంచి ధరలు లభించాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో సాగుకు రైతులు సిద్ధమయ్యారు. సాధారణంగా సెప్టెంబరు ఆఖరు నుంచి తేలిక నేలలు, ఎర్రనేలలు ఉండే ఎస్ఎల్ఎస్ రీజియన్‌లోని వేలం కేంద్రాల పరిధిలో, అక్టోబరులో ఎస్‌బీఎస్ రీజియన్‌లోని ఎగువ ప్రాంతంలో నాట్లు వేస్తారు. ఈఏడాది సెప్టెంబరులో బెట్ట వాతావరణంతో నాట్లు కాస్త ఆలస్యమయ్యాయి. ఈనెల

మిగతా 8వ పేజీలో...





కొండపిలో వారం రోజులక్రితం పెట్టిన నారుమడి

రేపు వెలిగొండకు ముగ్గురు మంత్రులు

నిమ్మల నేతృత్వంలో ప్రాజెక్టును సందర్శించనున్న డాక్టర్ స్వామి, గొట్టిపాటి

జిల్లాలో సాగునీటి రంగంపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్మాణంలో ఉన్న కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు వద్దకు మంగళవారం ముగ్గురు మంత్రులు రానున్నారు. జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నేతృత్వంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులైన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్ ప్రాజెక్టును సందర్శించనున్నారు. మంగళవారం ఉదయం దోర్నాల చేరుకొనే మంత్రులు తొలుత టన్నెళ్లు, వెలిగొండ కాలువలు, ఇతరత్రా పనులను పరిశీలిస్తారు. అనంతరం వెలిగొండ ప్రాజెక్టుతోపాటు గుండ్లకమ్మ, జిల్లాలోని ఇతర సాగునీటి వనరుల పరిస్థితి, అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై వెలిగొండ ప్రాజెక్టు సైట్ సమీపంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సాగునీటి శాఖలోని అన్ని విభాగాల కీలక అధికారులు, ఇతర శాఖ జిల్లా అధికారులు హాజరుకానున్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం గురించి వైసీపీ ఐదేళ్ల పాలనలో పెద్దగా పట్టించుకున్న పరిస్థితి లేదు. కృష్ణా నది నుంచి రెండేళ్ల క్రితమే వెలిగొండకు నీరు తీసుకొనే అవకాశం ఉన్నా నిర్వాసితుల తరలింపు, ప్రాజెక్టులకు సంబంధించిన పలు పనుల పూర్తి విషయంలో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో నీటిని తీసుకోలేకపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో

మిగతా 8వ పేజీలో...



వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్ ముఖ ద్వారం

కొండపి గురుకుల ప్రిన్సిపాల్‌పై మంత్రి అసహనం

పనిచేసే ఇనిస్టిట్యూట్‌పై శ్రద్ధ ఉండాలమ్మా అంటూ చురకలు

కొండపిలోని బాలికల గురుకులాన్ని సందర్శించిన డోలా

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ లోపించడం పట్ల ఆగ్రహం

8



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి



ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింట్లో అందాలు..

పర్యాటకులను కనువిందు చేస్తున్న నల్లమల

8



మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

చదువుల గుడిలో వజ్రోత్సవం


తర్లుపాడు జడ్పీహెచ్ఎస్‌లో అపూర్వ సమ్మేళనం

8

30న ఒంగోలులో కూటమి పార్టీల భేటీ

హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం

4న యథావిధిగా సమీక్షా సమావేశం



ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికార కూటమిలోని మూడు పార్టీల జిల్లాస్థాయి నేతల సంయుక్త సమావేశం ఈనెల 30న ఒంగోలులో ఏర్పాటు చేశారు. స్థానిక భాగ్యనగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇది జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త సమావేశాలను కొనసాగించాలని ఆ పార్టీల అధిష్ఠానాలు నిర్ణయించాయి. రాష్ట్రస్థాయిలో అలాంటి సమావేశాలు జరుగుతుండగా జిల్లా స్థాయిల్లో కూడా నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలు, ఇతరత్రా అంశాలలో క్షేత్రస్థాయిలో కలిసి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాయి. ఇన్‌చార్జి మంత్రుల నియామకాలు చేపట్టిన అనంతరం వారి ఆధ్వర్యంలో

మిగతా 8వ పేజీలో...

ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింట్లో అందాలు..



ఎకోటూరిజం ముఖద్వారం



గదిలో ఏర్పాటు చేసిన పెద్దపులి బొమ్మ

అడుగుకో చెట్టు. ఆ చెట్ల చిటారు కొమ్మలు సుయ్‌మంటూ ఉయ్యాలలా ఊగుతూ ఉండే సంగీత స్వరాలు... ఆ ఊయలపై నుంచి పక్షుల వినుసొంపైన కిలకిలరావాలు.. నేలంతా పచ్చని చాప పరిచినట్లు కనువిందు చేసే పచ్చికతో ఆకట్టుకుంటున్న సుందరమైన నల్లమల పర్యాటకులను రా... రమ్మని పిలుస్తోంది. ఆ అరణ్యంలో అడపాదడపా తారసపడే వన్యమృగాలు కనువిందు చేస్తాయి. అక్కడక్కడా చెంగుచెంగున ఎగురుతూ కనిపించే జింకల సొగసు కళాత్మకంగా అనిపిస్తుంది. ఇలా ఎన్నెన్నో అందాలు.. ఏవేవో అనుభూతులు పర్యాటకులకు అందిస్తోన్న ఆ అరణ్యంలో పర్యాటకులకు సందర్శించే అవకాశం వచ్చింది. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎకోటూరిజం ఈ సౌకర్యాలు కల్పిస్తోంది.

- పెద్ద దోర్నాల, (ఆంధ్రజ్యోతి)

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న నల్లమల సుందర వనం
- ఎకోటూరిజం ఆధ్వర్యంలో సందర్శకులకు సౌకర్యాలు
- ప్రత్యేక వాహనంలో అరణ్యంలోకి 14 కిలోమీటర్ల ప్రయాణం
- ఒక్కొక్కరికి రూ.500 రుసుంతో సందర్శనకు అవకాశం

అటవీ సంపద పరిరక్షణ అందరి బాధ్యత



అటవీ సంపద పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలి. ముందు తరాల వారికి మనమిచ్చే గొప్ప ఆస్తి అటవీ సంపద. ఈ నేపథ్యంలో అందరికీ అవగాహన కలిగేలా ఎకోటూరిజం ఏర్పాటు చేశాం. ప్రధానంగా పర్యాటకులు ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను అటవీ ప్రాంతంలో వేయకూడదు. కోతులకు రోడ్ల వెంట ఆహార పదార్థాలు వేయడం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ. పర్యాటకులను ఆకర్షించేందుకు జంగిల్ సఫారీని అభివృద్ధి చేస్తాం.

- జీవన్‌కుమార్, రేంజ్ అధికారి, దోర్నాల

పులుల అభయారణ్యం సందర్శన గొప్ప అనుభూతి



ఎకోటూరిజం సందర్శన గొప్ప అనుభూతి నిచ్చింది. నాగార్జున సాగర్-శ్రీశైలం అభయారణ్యంలో ఇటీవల జంగిల్ సఫారీ ద్వారా విద్యార్థులు రకరకాల మొక్కలు, పక్షులు, వన్యప్రాణులు, పులి సంచరించిన పాదముద్రలు, నెమళ్లను చూశారు. అక్కడ గైడ్ జీవ వైవిధ్యం, ఆహారపు అలవాట్లు, పర్యావరణ పరిరక్షణలో పెద్దపులి పాత్రను బాగా వివరించారు.

- కొవుల సుబ్బారెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు

ప్రయాణమిలా..

దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మండల పరిధిలోని తుమ్మలబయలు సమీపంలో ఎకోటూరిజం ఏర్పాటు చేశారు. అక్కడ ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ఆరుగురు పర్యాటకులకు కలిపి రూ.3 వేలు చెల్లిస్తే ప్రత్యేక వాహనం ఏర్పాటు చేస్తారు. ఆ వాహనంలో అక్కడి నుంచి 14 కిలోమీటర్లు నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలో తీసుకెళతారు. పులి చెరువు వరకు వెళ్లి తిరిగి ఎకోటూరిజం ముఖద్వారం వద్దకు తీసుకొస్తారు. అక్కడ అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తారు. లీటరు వాటర్ బాటిల్ అందజేసి, ఇద్దరు ఫారెస్టు గార్డులను కేటాయిస్తారు. పోయే మార్గంలో వన్యప్రాణులు కనువిందు చేస్తాయి.

ఆకట్టుకుంటున్న అందాల వనం

- అటవీ శాఖ అధికారులు మండల పరిధిలోని తుమ్మల బయలు వద్ద ఎకోటూరిజాన్ని ఏర్పాటు చేశారు. సందర్శకుల కోసం ప్రత్యేకంగా వాహనాన్ని కేటాయించారు.
- సహజత్వాన్ని ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ముఖద్వారం కలపతో చేసినట్లు కళాత్మకంగా ఉండి సందర్శకులకు ఆహ్వానం పలుకుతుంది.
- ఆ పక్కనే నిర్మించిన ఆడిటోరియంలో నల్లమల అటవీ ప్రాముఖ్యతనూ, వన్యప్రాణుల జీవన సరళినీ వివరించేందుకు ఫొటో గ్యాలరీ ఉంటుంది.
- మరో గదిలో పెద్దపులి ఆకృతిలో అదే సైజులో ఏర్పాటు చేసిన బొమ్మకు గర్జన శబ్దం వచ్చేలా మిషనరీ అమర్చడంతో నిజంగా మచ్చలపులిని దగ్గరుండి చూసిన అనుభూతి కలుగుతుంది.
- ఆ గర్జన.. పులి గాండ్రింపుగా ఉండటంతో ఆ గదిలోకి వెళ్తే ఎవరైనా తొలుత ఉలికిపాటుకు గురి అవుతారు. చిన్నపిల్లలు జంకుతారు.
- ఇంకో గదిలో కిచకిచలు.. కిలకిలరావాలు అందించే పక్షులు, జింకల బొమ్మలు 'రండి.. రండి.. రండి.. దయ చేయండి' అంటూ పిలుస్తాయి.



ఫొటో గ్యాలరీ



గదిలో ఏర్పాటు చేసిన జింకల బొమ్మలు

నల్లమలలో మదినిదోచే ఎన్నో స్మృతులు. ప్రయాణమంతా ఆహ్లాదకరంగా సాగుతుంది. వనం తనువంతా తడుముతూ... పాముల్లా వంపులు తిరుగుతూ హొయలుపోయే రహదారులు దర్శనమిస్తాయి. ఆ దారుల పక్కనే ఆకాశాన్ని తాకుతున్నట్లు ఏపుగా పెరిగిన వెదురు గుబుర్లు ఆహ్లాదంగా అనిపిస్తాయి. వాటిని ఒకదానిని మరొకటి అల్లుకుపోయిన తీగలతో వనానికి తోరణాలు కట్టినట్టు

మదిని దోచే ప్రకృతి

అనిపిస్తుంది. తివాచీ పరిచినట్లుగా నేలంతా పచ్చికబయళ్లను చూసి పరవశించిపోతారు. కుహూ.. కుహూ.. మంటూ వినసొంపుగా ఉండే రావాలు, విమానాల్లా రెక్కలు విప్పుకుని ఒకచెట్టు మీద నుంచి మరో చెట్టు మీదకు వాలిపోయే నెమళ్లతో భూలోకం నుంచి వనలోకంలోకి అడుగుపెట్టినట్టు ప్రయాణికుల మదిలో పదికాలాల పాటు నిలిచిపోయేలా ప్రయాణం సాగుతుంది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

చదువుల గుడిలో వజ్రోత్సవం

తర్లుపాడు జడ్పీహెచ్‌ఎస్‌లో అపూర్వ సమ్మేళనం
బ్యాచ్‌ల వారీగా ఏర్పడి ఆత్మీయ పలకరింపులు
ముఖ్యఅతిథులుగా ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కందుల

తర్లుపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతివ్యక్తి జీవితంలో పూర్వ విద్యార్థుల కలయిక అమోఘం, అపూర్వం అని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 75వ వసంతోత్సవాల వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేయాల్సిన పనులు పూర్వపు విద్యార్థులు కలిసికట్టుగా పూర్తి చేసి తర్లుపాడును ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడం అద్భుతం అన్నారు. ఇక తర్లుపాడులోని రైల్వేస్టేషన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలో ఉన్న గేటుకు ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ తర్లుపాడు జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి సహకరించి వచ్చే సంవత్సరం జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మార్కాపురం నుంచి తాడివారిపల్లెకు డబుల్ రోడ్డు వేయిస్తామన్నారు. తర్లుపాడు పాఠశాలను ఆదర్శ పాఠశాలగా చేసేందుకు కృషి చేసిన పూర్వపు విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. వెలిగొండ ప్రాజెక్టును రెండు రోజుల్లో మంత్రుల బృందం సందర్శిస్తుందన్నారు. ప్రాజెక్టును ఎప్పటిలోపు పూర్తి చేసేది స్పష్టత ఇస్తామని పేర్కొన్నారు. వజ్రోత్సవ వేడుకలకు సుమారు 500 మంది పూర్వపు విద్యార్థులు హాజరయ్యారు. 50 ఏళ్ల క్రితం చదువుకున్న రోజుల్లో వారు చేసిన అల్లర్లు తన స్నేహితులతో కలిసి స్మరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాసేపు బాల్యంలోకి వెళ్లిపోయారు. 1949వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పాఠశాల నుంచి వెళ్లిన విద్యార్థులు అందరూ బ్యాచ్‌ల వారీగా డివైడ్ అయి ఒకరితో ఒకరు స్నేహబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో ఆనందోత్సవాలతో మునిగిపోయారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. పలువురు పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ ప్రస్తుతం రూ.54లక్షలతో పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇక మీదట కూడా రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా చేసేందుకు కృషి చేస్తామన్నారు. పాఠశాలలో పనిచేసిన పూర్వపు గురువులను పూర్వపు విద్యార్థులు శాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కాపురం జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, జెడ్పీటీసీ సభ్యుడు వెన్నా ఇందిరా, ఎంపీపీ నూరెడ్డి భూలక్ష్మీ, గ్రామ సర్పంచ్ పల్లెపోగు వరాలు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నాం



యాభై ఏళ్ల క్రితం పాఠశాలలో చదువుకున్న చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నాం. 1975-76 సంవత్సరం పదో తరగతి పాసయ్యాం. పాఠశాల రుణం తీర్చుకునేందుకు పాఠశాల అభివృద్ధికి మా మిత్రబృదం శాయశక్తుల కృషి చేస్తోంది.

- మూర్తి సత్యనారాయణ (పూర్వ విద్యార్థి)

దేవాలయంగా తీర్చిదిద్దుతున్నాం



పాఠశాలలో చదువుకుని ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డాం. మాతృభూమి రుణం తీర్చుకునేందుకు పాఠశాలలో పలు అభివృద్ధి కార్యాక్రమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో కూడా పూర్వపు విద్యార్థుల సహకారంతో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

- కశ్శెట్టి జగన్ బాబు (పూర్వ విద్యార్థి)



హాజరైన పూర్వ విద్యార్థులు

కొండపి గురుకుల ప్రిన్సిపాల్‌పై
మంత్రి అసహనం



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న స్వామి

కొండపి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : 'పనిచేస్తున్న ఇనిస్టిట్యూట్‌పై కొంత శ్రద్ధ ఉండాలమ్మా... స్కూల్‌లో పనులు ఏమి జరుగుతున్నాయి.. ఏమైనా లోపాలు ఉన్నాయా అని ప్రిన్సిపాల్ స్థానంలో ఉండి పరిశీలించకోకపోతే ఎలా? అని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కొండపిలోని బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల ప్రిన్సిపాల్ అరుణపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రి ఆదివారం మధ్యాహ్నం స్కూల్‌లో దాదాపు 13 లక్షల రూపాయలతో జరుగుతున్న టాయిలెట్లు, బాత్‌రూంలు, ఇతర నిర్మాణ పనులను పరిశీలించారు. స్కూల్‌పై ప్రత్యేక శ్రద్ధతో మంత్రి ఇటీవల నిధులు మంజూరు చేశారు. ఆ పనులు సవ్యంగా జరగడం లేదని గ్రహించిన మంత్రి స్వయంగా పనులను పరిశీలించి, అక్కడ కూలీలతో మాట్లాడారు. బాత్ రూంల్లో ఐదడుగుల వరకు గోడలకు టైల్స్ వేయాలని సూచించారు. విద్యార్థులు దుస్తులు ఉతుక్కునే ప్రదేశాన్ని, టాయిలెట్‌లు ఏర్పాటు చేయాల్సిన విధానం, బాలికలు స్నానాలు చేసే గదులు, వృథా నీరు పోయే కాల్వలను మంత్రి పరిశీలించారు. పనుల్లో తేడాలను గుర్తించి మార్పి చేయాలని, వెంటనే జేఈ తనను కలవాలని అక్కడ నుంచే మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. అదేవిధంగా స్టాఫ్ కోసం ఏర్పాటు చేస్తున్న సెప్టిక్ ట్యాంక్‌లు మెయిన్ భవనాన్ని పక్కనే ఎందుకు నిర్మిస్తున్నారని పనిచేస్తున్న మేస్త్రిని మంత్రి అడిగారు. ఇక్కడే కట్టమన్నారని మేస్త్రి చెప్పడంతో మంత్రి స్వామి అసహనం వ్యక్తం చేశారు. మెయిన్ భవనం వద్ద తాగునీటి పైపులైన్లు వచ్చే అవకాశం ఉంది. ఇక్కడే సెప్టిక్ ట్యాంకు పైపులు వస్తే ఇబ్బంది కదా? అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. వెంటనే సెప్టిక్ ట్యాంకు కోసం తీస్తున్న గోతులను పూడ్చాలని ఆదేశించారు. కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని మంత్రికి విద్యార్థులు ఫిర్యాదు చేశారు. స్కూల్‌లో జంగిల్ క్లియరెన్స్‌కు, సిమెంటు రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి అన్నారు. ఏడాదిక్రితం గురుకులంలో వేసిన రోడ్లు వెడల్పు లేకపోవడాన్ని మంత్రి ప్రశ్నించారు. కనీసం కార్లు, ఇతర వాహనాలన్నా తిరగాలి కదా? ఇలా సిమెంటు రోడ్లు ఎలా వేస్తారు అని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామయ్య చౌదరి పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ఏపీఅండ్‌ఆర్‌పీఏ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి డిమాండ్

ఒంగోలుకలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని 75 లక్షలకు పైగా ఉన్న ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ పెన్షనర్స్ అండ్‌రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (ఏపీఅండ్‌ఆర్‌పీఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఏ.శాస్త్రి డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యల పట్ల రీజనల్ కార్యాలయాల్లో ఉన్న ఈపీఎఫ్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండించారు. పెన్షనర్ల చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితి మారకపోతే భవిష్యత్‌లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం హయ్యర్ ఆప్షన్‌ను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండున్నర లక్షల మంది ఈపీఎఫ్ పెన్షనర్లు కనీసం పెన్షన్ వెయ్యి రూపాయాలు కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. నవంబరు 16న పెన్షనర్స్ విద్రోహదినంగా నిర్వహించాలని, డిసెంబరు 17న పెన్షనర్స్ డేగా, వచ్చేఏడాది జనవరిలో విజయవాడలో పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ బలపర్చిన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మద్దతు ప్రకటించారు. సమావేశంలో కమిటీ సభ్యులు జి.శేషయ్య, సీహెచ్.రాంబాబు, చంద్రమౌళి, ఎస్ఎన్.రెడ్డి, కేపీ.కుమార్, ఎన్.రామకృష్ణారెడ్డి, ఎం.ఆదినారాయణమూర్తి, జీవీ.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న ఒంగోలులో కూటమి పార్టీల సంయుక్త భేటీ

(7వ పేజీ తరువాయి)

ఈ సమావేశాలను ఇప్పటికే పలు జిల్లాల్లో నిర్వహించారు. అందులో భాగంగా ఈనెల 30న ఒంగోలులో సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి టీడీపీకి చెందిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు, కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీల నుంచి ఆ పార్టీల జిల్లా అధ్యక్షులు, ఇద్దరు ముగ్గురు ముఖ్యనేతలు పాల్గొంటారని సమాచారం. సమావేశం ఏర్పాటుపై మంత్రి డాక్టర్ స్వామితో ఆదివారం సాయంత్రం ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడినట్లు సమాచారం. ఇదిలా ఉండగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లాస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం వచ్చేనెల 4న యధావిధిగా జరగనుంది.

దడపుట్టిస్తున్న పొగాకు నారు

(7వ పేజీ తరువాయి)



పొగనాట్లలో కూలీలు

రెండో వారం నుంచి దాదాపు పదిరోజులపాటు తెరపిలేకుండా వర్షాలు కురవడంతో మరికొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం వర్షాలు వెలిసి పొలాలకు ఆరడంతో ముమ్మరంగా రైతులు పొగాకు నాట్లు వేస్తున్నారు.

ఇప్పటికే 20వేల ఎకరాల్లో నాట్లు

పొదిలి, కనిగిరి, కొండపి, కందుకూరు వేలం కేంద్రాల పరిధిలోని అనేక గ్రామాలతోపాటు ఒంగోలు-1, వెల్లంపల్లి కేంద్రాల పరిధిలోని ఎగువ ప్రాంతాల్లో రైతులు మొక్కలు నాటుతున్నారు. ఇప్పటికే దాదాపు 20వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. రానున్న వారం రోజుల్లో మరింత ముమ్మరం కానున్నాయి. అలా ఒక్కసారిగా నారుకు డిమాండ్ ఏర్పడింది. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లోని నారుమడులు దెబ్బతిన్నాయి. జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు మండలాల్లో పాలేరు, ముసి నదుల సమీప గ్రామాల్లోని ఇసుక, తేలిక నేలల్లో నారుమడులు అధికంగా ఉంటాయి. అలాగే పొదిలి, కందుకూరు ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో బోర్ల కింద వేస్తారు. అలా స్థానికంగానే నారు దొరుకుతుంది. డిమాండ్ ఎక్కువ ఉన్నప్పుడు రాజమండ్రి ప్రాంతం నుంచి రైతులు తెస్తుంటారు. అయితే ఇటీవల వర్షాలతో చాలా చోట్ల నారుమడులు దెబ్బతిన్నాయి. వర్షం వెలిశాక మళ్లీ మడులు పెట్టినా నెల తర్వాతనే అవి నాట్లు వేసే దశకు వస్తాయి. దీంతో ప్రస్తుతం నారుకు డిమాండ్ ఏర్పడటంతో ఒక్కసారిగా ధరలు రెట్టింపు పలుకుతున్నాయి.

పెరిగిన కూలి ఖర్చులు

సాధారణంగా ఎకరాకు ఒకటిన్నర మూట నారు (9వేల మొక్కలు) అవసరం. అయితే ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉండటంతో ఒక్కో మూటలో ఐదువేల మొక్కలు మించి ఉండటం లేదు. దీంతో ఎకరాకు రెండు మూటలు రైతులు కొనాల్సి వస్తోంది. కొన్నిచోట్ల నారు నాణ్యత దెబ్బతినడంతో గ్రేడ్ చేసి బాగా లేనివి తీసేసి వేయాల్సి వస్తోంది. దీని వలన మరింత అవసరమవుతోంది. అలా ఒక వైపు నారు ధర అధికంగా పెట్టి, మరోవైపు మూటన్నర బదులు రెండు మూటలకుపైగా కొనాల్సి వచ్చి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇదేసమయంలో నాట్ల కూలి కూడా గణనీయంగా పెరిగినట్లు రైతులు చెప్తున్నారు. గతంలో ఎకరా నాట్లు వేసేందుకు ఐదు వేల రూపాయాలు సరిపోతే ప్రస్తుతం రూ.12వేల నుంచి రూ.15వేల వరకూ ఖర్చవుతున్నదని రైతులు చెప్తున్నారు. మున్ముందు నారు ధర మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

రేపు వెలిగొండకు
ముగ్గురు మంత్రులు

(7వ పేజీ తరువాయి)

టీడీపీ అధినేతగా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన సందర్భంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వెలిగొండకు నీరిస్తామని ప్రకటించారు. ఎన్నికల్లో పశ్చిమప్రాంతంలోనూ టీడీపీకి మంచి ఫలితాలే వచ్చాయి.

వెలిగొండపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వెలిగొండపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాధాన్యత ప్రాజెక్టుగా ప్రకటించింది. తదనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టింది. జిల్లాలోని ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతప్రజాప్రతినిధులు పలు సార్లు వెలిగొండ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం అమరావతిలో సమావేశమైన ఉమ్మడి జిల్లా టీడీపీ ముఖ్యనేతలు ఈ అంశంపై ప్రధానంగా చర్చించారు. మంత్రి నిమ్మలతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముగ్గురు మంత్రులు వెలిగొండకు వస్తున్నారు. దీంతో ప్రాజెక్టు పనులు, నిర్వాసితుల పునరావాస చర్యలలో కదలిక వచ్చే అవకాశం ఉంది.

కార్డుదారులకు తీపికబురు

(7వ పేజీ తరువాయి)

కూడా స్వస్తి చెప్పింది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు నుంచి కందిపప్పును కూడా ఆపేసింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు వాటిని కొనలేక పేదలు అల్లాడిపోయారు.

గోడౌన్‌లకు చేరిన అన్ని సరుకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌరసరఫరాల శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం బియ్యం, పంచదారకే పరిమితం కాకుండా ముందుగా కందిపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. వచ్చే నెల నుంచి దీన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడంతోపాటు జొన్నలు కూడా ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే బియ్యం, కందిపప్పు, జొన్నలు, పంచదార జిల్లాలోని గోడౌన్లకు చేరాయి. రేషన్‌షాపుల ద్వారా నవంబరు 1వతేదీ నుంచి ఆయా సరుకుల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు.



అడితిబజారు ఎదరు రోడ్డుపై భారీగా దర్శనమిస్తున్న గుంతలు

వామ్మో.. ట్రంకురోడ్డు

● వైసీపీ ఐదేళ్లపాలనలో మరమ్మతులు కరువు ● ఇటీవల వర్షాలకు మరింత ఛిద్రం ● గుంతలతో ప్రజల అవస్థలు

సింగరాయకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మండలంలోని పలురోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. సింగరాయకొండలోని ప్రధాన రహదారి అయిన ట్రంకురోడ్డు గుంతలమయమైంది. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దారుణంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం రోడ్ల నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఛిద్రమైన రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహనచోదకులు హడలిపోతున్నారు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రమైన సింగరాయకొండకు రోజూ ప్రజా రవాణాతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితోడు స్థానికంగా రైల్వేస్టేషన్ ఉండటంతో కొండపి, కనిగిరి, కందుకూరు నియోజకవర్గాల ప్రజల తాకిడి కూడా ఎక్కువగానే ఉంటోంది. స్థానిక పాకల రోడ్డు నుంచి ప్రశాంతి థియేటర్ సెంటర్ వరకూ ట్రంకు రోడ్డుకు ఇరువైపులా అడుగడుగునా గుంతలు పడ్డాయి. వాటిలో గులకరాళ్లు పైకి లేవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. డివైడర్‌కు ఇరువైపులా ఉన్న మార్జిన్లు దాదాపు దెబ్బతిన్నాయి. వర్షపు నీరు గుంతల్లో చేరిన సమయాల్లో వీటి లోతు తెలియక ద్విచక్రదారులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



ట్రంకురోడ్డుపై పైకిలేచిన కంకరరాళ్లు

కాలువల ఆక్రమణతో సమస్య

ట్రంకురోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. వీటిపై దుకాణాలు, బంకులు ఏర్పాటు చేశారు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వర్షాలు కురిసినప్పుడు కాలువల్లోని నీరు రోడ్లపై పారుతోంది. దీంతో రోడ్లు పూర్తిగా గుల్లవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులకు మంత్రి స్వామి ఆదేశం

అధ్వానంగా మారిన ట్రంకురోడ్డును ఈనెల 7న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్వయంగా పరిశీలించారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆర్అండ్‌బీ ఏఈ మాధవరావును ఆదేశించారు. రెండు రోజుల తరువాత అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టిని తొలగించారు. అనంతరం పనులు నిలిచిపోయాయి. దీనిపై ఏఈ మాధవరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇటీవల కురిసిన వర్షాల ధాటికి రోడ్డు మరమ్మతుల పనులు నిలిచిపోయాయని తెలిపారు. సోమవారం నుంచి మరలా ప్రారంభించి శరవేగంగా మరమ్మతులను పూర్తిచేస్తామని వివరించారు.



మార్కెట్ సమీపంలో ఛిద్రమైనరోడ్డు



పొలానికి ఎరువు చల్లుతున్న రైతు



పొలాన్ని గొర్రు తోలుతున్న ట్రాక్టర్

సాగు పనులు ముమ్మరం

కొండపి ప్రాంతంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. వర్షాలు తెరపివ్వడంతో రైతులు పొలాల్లో ఎరువులు చల్లి, గొర్రు తోలుతున్నారు. ఎర్రరేగడి నేలలు ప్రస్తుతం ఆరిపోతున్నాయి. వీటిలో రైతులు పొగాకు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. నల్లరేగడి నేలలు మరో పది రోజులకు గాని ఆరుదలకు రాని పరిస్థితి. నల్లరేగడి నేలల్లో ప్రస్తుతం గడ్డి ఉండటంతో దాని నివారణకు రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు. వీటిలో పొగాకు, శనగ సాగుకు మరో పది రోజులు పడుతుందని రైతులు అంటున్నారు. ఎర్రనేలల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

- కొండపి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి)

సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా

● జిల్లాను వెనుకబడిన జాబితాలో చేర్చడంలో సఫలీకృతుడినయ్యా
● నా విధులు కూడా ఒంగోలు నుంచి ప్రారంభిస్తా..
● 20 సూత్రాల పథకం అమలు చైర్మన్ లంకా దినకర్
● ఘనంగా ఆత్మీయ సమావేశం



లంకా దినకర్‌ను సన్మానిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర 20 సూత్రాల పథకం అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఎ1 కన్వెన్షన్ హాలులో ఆదివారం లంకా దినకర్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో దినకర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఏ విధంగా పాలకుల నిర్లక్ష్యానికి గురైందో, జిల్లా సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, వెనుకబడిన జిల్లాల జాబితాలో చేరాల్సిన అవశ్యకతపై తయారుచేసిన విజన్‌ప్రకాశం డాక్యుమెంటరీ ఎన్‌డీఏ అధికారంలోకి రాకముందే రాష్ట్ర బీజేపీ నాయకుల సహకారంతో కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మల సీతారామన్ ఎదుట ఉంచినట్లు తెలిపారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రప్రభుత్వం ప్రకాశం జిల్లాను వెనుకబడిన జాబితాలో చేర్చడమే కాకుండా జిల్లా సమగ్ర అభివృద్ధికి తగిన నిధులు కేటాయించడంతో తన తొలి విజయం ప్రారంభమైందన్నారు. దీనివల్ల కనిగిరి ప్రాంతంలో నిమ్జ్, దొనకొండ కారిడార్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైల్వే లైన్ల అనుసంధానం పనులకు శ్రీకారం చుట్టినట్లు అయిందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, క్విస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ దినకర్‌లోని సూక్ష్మబుద్ధి, లోతైన ఆలోచన తీరు, ఆలోచలను అమలులో పెట్టే వ్యక్తి అని కొనియాడారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో శరవేగంగా పని చేస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి మాట్లాడుతూ మంచి పట్టున్న నాయకులకు బీజేపీలో ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందన్నారు. అనంతరం లంకా దినకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాపట్ల బీజేపీ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ యోగయ్యయాదవ్, డాక్టర్ శ్రీమన్నారాయణ, రవిప్రియా మాల్ అధినేత కంది రవిశంకర్, న్యాయవాది నాగిశెట్టి మోహన్‌దాస్, ఆడిటర్ కే ప్రముఖ పారిశ్రామికవేత్త శిద్దా హనుమంతరావు, నాయకులు డాక్టర్ కొమ్మి నరసింగరావు, శాసనాల సరోజనమ్మ, బొద్దులూరి ఆంజనేయులు, కొఠారి నాగేశ్వరరావు, అనంతమ్మ, కపిల్‌బాషా, హర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బందరు రోడ్డులో..



కొండమెట్ట వద్ద



మామిడిపాలెంలో

కాలువల్లో తాగునీటి పైపులు

● ప్రమాదంలో ప్రజారోగ్యం

ఆరోగ్యం బాగుండాలంటే స్వచ్ఛమైన తాగునీరు తాగాలి. అయితే ఒంగోలు నగరంలో తాగునీటి సరఫరా అందరిలోనూ ఆందోళన కలిగిస్తుంది. ఒకవైపు తాగునీటి కలుషితంతో దాచేపల్లి మునిసిపాలిటీలో ప్రజలు డయేరియా బారిన విషయం తెలిసిందే. అయితే ఒంగోలులోనూ ఇదే తరహాలో కాలువల్లో కొళాయిలు ఉండటం చూస్తుంటే నగరానికి ప్రమాదం పొంచి ఉందనే విషయం తెలుస్తున్నది. ముఖ్యంగా గత కొన్నేళ్ళుగా కొళాయిల్లో తాగునీటి పైపులైనులు మురుగునీరు పారే డ్రైయిన్‌లలో ఉండటంతో, కొద్దిపాటి లీకు ఏర్పడినా, వర్షాలకు నీరు కాలువల్లో పారినపుడు ఆ నీరు కొళాయిల్లోకి చేరి ఇళ్ళకు చేరుతుంది. దీంతో ఆ నీరు అలాగే వినియోగించడంతో రోగాల బారినపడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి తాగునీటి పైపులైన్‌లను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నిలిచిన నిర్మాణాలు

● ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు
● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కంభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికారుల ఉదాసీనత, పాలకుల నిర్లక్ష్యం వెరసి మదర్‌థెరిస్సా కాలనీలో పక్కా ఇళ్ల నిర్మాణం తీరని కలగానే మిలిగింది. 19 ఏళ్ల క్రితం ఇక్కడ ఇళ్ల పట్టాలు మంజూరైనా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా నేటికీ ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడం విశేషం.

కందులాపురం పంచాయతీలో 2007-08లో ఎస్సీ, ఎస్టీలు 226 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అయితే రోడ్డు నిర్మాణాలు, నీటిసౌకర్యం కల్పించలేదు. దీంతో కేవలం 36 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. వీటిలో ఎనిమిది ఇళ్లు పూర్తి కాగా మిగిలినవి పునాది దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం కాలనీకి వెళ్లేందుకు రైల్వేస్థలాన్ని వినియోగించుకుంటున్నారు. దీనిపై ఆ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ విషయంపై గతంలో పలుసంఘాల నాయకులు బాధితుల పక్షాన రెవెన్యూ అధికారులకు సమస్యలు తెలియజేశారు. అప్పటి తహసీల్దార్ హుస్సేన్‌పీరా మార్కెట్‌యార్డు పక్క నుంచి కాలనీకి వెళ్లేందుకు రోడ్డుమార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వేయర్లతో కొలతలు వేయించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన తరువాత ఇప్పటికీ 15 మంది తహసీల్దార్లు మారినా దాని ఊసే మరచిపోయారు. కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లాలోనే మొదటిసారిగా ఐపీడీపీ పథకం కింద రూ.15.73 లక్షలతో 30వేల లీటర్ల నీటిసామర్థ్యం ఉన్న మంచినీటి పథకాన్ని పూర్తి చేశారు. ట్యాంక్ నిర్మాణం పూర్తయి కాలనీలో సగభాగం పైపు లైన్ కూడా పూర్తి చేశారు. తరువాత నిధులు చాలకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. దీంతో నీరు లేక గృహనిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గృహనిర్మాణానికి సంబంధించిన ఉపకరణా లు తీసుకెళ్లేందుకు కూడా దారి లేకుండా పోయింది. ఈ రోడ్డు ఎప్పుడు వేస్తారోనని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఊరి చివర ఉన్న కాలనీలో జనసంచారం పెద్దగా లేకపోవడంతో అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రెండేళ్లక్రితం 10 కుటుంబాల వారు కాలనీలో నిర్మించుకున్న గృహాల్లో నివసిస్తున్నారు. వారికి నీటిసౌకర్యం లేకపోవడంతో కందులాపురం పంచాయతీ వారు వారానికి ఒకసారి ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేసేవారు. అయితే అక్కడే నివాసం ఉంటున్న లబ్ధిదారుల అభ్యర్థన మేరకు రోడ్డు పక్కన కొలాయిలను ఏర్పాటు చేసి రెండురోజులకొకసారి నీటిని వదులుతున్నారు. కరెంటు సౌకర్యం లేకపోవడంతో విషపురుగులు వస్తున్నాయని, రాత్రిపూట బిక్కు బిక్కు మంటూ నివసిస్తున్నామని కాలనీ వాసులు దానమ్మ, సుగుణమ్మ తెలిపారు. అధికారులు స్పందించి కాలనీకి నీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



కాలనీలో నిలిచిన నిర్మాణాలు

వెలిగొండకు నిధులు కేటాయించాలి

● సాధన సమితి నాయకుల డిమాండ్



వెలిగొండ టనెల్‌వద్ద నాయకుల నినాదాలు

పెద్ద దోర్నాల, అక్టో బరు 27 (ఆంధ్రజ్యోతి): లక్షల ఎకరాల భూమిని సస్యశ్యామలం చేసి ప్రజ ల గొంతులు తడిపేం దుకు తలపెట్టిన వెలి గొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి తగిన నిధులు కేటాయించాలని వెలి గొండ సాధన సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలోని కీలక భాగాలైన రెండవ టన్నెల్ పనులను ఉదయగిరి ప్రాంతం వెలిగొండ ప్రాజెక్టు సాధన సమితి నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ క్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జ్ రాంబాబును పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాధన సమితి నాయకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ వర్షాధారంపై ఆధారపడి సాగు చేసే భూములు సస్యశ్యామలం చేసేందుకు నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉన్నాయన్నారు. ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువైందన్నారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకే రెండేళ్ల సమయం పడుతుందంటే వాస్తవరూపంలో నాలుగేళ్లకు పైమాటేనన్నారు. అది కూడా బడ్జెట్టులో ఏటా 2వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. ముంపు బాధితుల సమస్యలు పెండింగులోనే ఉన్నాయన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ప్రాజెక్టును సందర్శించాలని డిమాండ్ చేశారు. త్వరితగతి నిర్మాణం పనులు ప్రారంభించాలని లేని పక్షంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రాజెక్టు పూర్తికి ఉద్యమం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, కాకుల వెంగలరావు, రైతు సంఘం నాయకులు వెంకటయ్య, దస్తగిరి, మండల సీపీఐ నాయకులు తిరుమలరావు, న్యూ డెమొక్రసీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


గుంతలమయమైన రోడ్డు

చదలవాడ రోడ్డు గోతులమయం

నాగులుప్పలపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చదలవాడ రామన్న చెరువు కట్ట తెగి వరద నీరు జాతీయ రహదారి-216పై చేరింది. దాంతో వాహనాల రాకపోకలను గ్రామంలోని పాతరోడ్డు మీదుగా మళ్లించారు. భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాల రాకపోకల ధాటికి ఆ రోడ్డు కొంతమేర గుంతలమయంగా మారింది. ఆ గుంతలలోకి వాన నీరు చేరి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోకుంటే ప్రమాదమే..

- మట్టిగుంటలో ప్రమాదకరంగా విద్యుత్‌వైర్లు
- పట్టించుకోని అధికారులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. మండలంలో పలు చోట్ల విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండి ప్రజలు భయాందోళనలో జీవనం సాగిస్తున్నారు. ముఖ్యంగా మట్టిగుంట గ్రామంలో సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. అక్కడ నలుగురు కాంట్రాక్ట్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జ్ లైన్‌మెన్‌గా ఒకరు పనిచేస్తున్నారు. అయితే ఆ గ్రామంలో విద్యుత్‌సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోక గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎస్సీకాలనీ సమీపంలోని చెరువు కట్ట వద్దకు వెళ్లే వీధులలో కరెంటు తీగలు కిందికి వంగి చేతులు ఎత్తితే అందేంతగా ఉండటంతో ఉన్నాయి. దీంతో నిత్యం ఆ ప్రాంత ప్రజలు భయంతో గడుపుతున్నారు. అయితే విద్యుత్ తీగలను సరిచేసేందుకు ఆ శాఖ అధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఈ విషయాన్ని సర్పంచ్ పాలేరు అనీలాకుమారి అనేకమార్లు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏమాత్రం స్పందిన దాఖలాలు లేవు. గ్రామంలోని వీధిలైట్లకు సంబంధించిన జంపర్ల సమస్యతో రాత్రిళ్లు లైట్లు వెలగక చీకట్లో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలిపినా ఏమాత్రం స్పందించలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ లైన్‌మెన్ కావడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇక ఎస్సీకాలనీలో లోవోల్టేజీ సమస్య వేధిస్తున్నా పరిష్కారం చూపలేదన్న విమర్శలున్నాయి. ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో, ఇటీవల ఉప్పుగుండూరులో జరిగిన విద్యుత్ మెగా లోక్ అదాలత్‌లోను మట్టిగుంట గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై వినతులు అందించినా పరిష్కారం చూపలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


చేతికి అందే ఎత్తులో ఉన్న కరెంటు తీగలు

డీఈవోకు అభినందనలు

ఒంగోలు విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన అత్తోటి కిరణ్‌కుమార్‌ను ఆదివారం స్థానిక డీఈవో కార్యాలయంలో ఏపీటీఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌కు బొకే ఇచ్చి సత్కరించారు. ఇటీవల విజయనగరంలో జరిగిన 80 సంవత్సరాల ఓక్ మహాసభలో ఆవిష్కరించిన సావనీర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కేవీజీకీర్తి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, జిల్లాప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్, జిల్లా కార్యదర్శులు కె.పెద్దన్న, ఎం.సురేష్‌బాబు, ఐపీయా కౌన్సిలర్ పీవీసుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం ఉప విద్యాధికారులు సామా సుబ్బారావు, చంద్రమౌళీశ్వరరావులను కలిసి సావనీర్‌లను వారు అందజేశారు.

210 మందికి వైద్య పరీక్షలు

నాగులుప్పలపాడు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్టార్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉప్పుగుండూరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 210మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు కేఎల్.నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.లతారెడ్డి, దుర్గాప్రసాద్, స్వాతి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ అంటే గౌరవం..

బాలినేనిపై మాత్రం పోరాటం

మీడియా సమావేశంలో తెలుగు తమ్ముళ్లు స్పష్టం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అంటే తమకు అభిమానమని, ఆయన సిద్ధాంతాలను గౌరవిస్తామని, అయితే తమ పోరాటం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డిలపైనే అని టీడీపీ నాయకుడు ఎద్దు శశికాంత్‌భూషణ్ వెల్లడించారు. ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్‌భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత శుక్రవారం జరిగిన ఒంగోలు నియోజకవర్గం టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో తాను చేసిన వాఖ్యలపై జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ స్పందించిన తీరు సరికాదన్నారు. తాము జనసేన పార్టీని గాని, పవన్‌కల్యాణ్ సిద్ధాంతాలను వ్యతిరేకించలేదని చెప్పారు. అయితే బాలినేని వైసీపీలో మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉంటూ టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టి చేసిన అరాచకాలను తెలుగుదేశం పార్టీ శ్రేణులు మరిచిపోరన్నారు. టీడీపీ వారిపైనే దాడి చేసి, బాధితులపైనే కేసులు పెట్టిన బాలినేని, ఆయన తనయుడు నాడు అధికార వైసీపీని అడ్డుపెట్టుకుని చాలా చేశారని చెప్పారు. అయితే చేసిన తప్పులు కాపాడుకునేందుకు నేడు టీడీపీ కూటమిలో భాగస్వామి జనసేనలో చేరితే తప్పులు ఒప్పులు కావన్నారు. అందులో భాగంగానే తాము మాట్లాడినట్లు వివరించారు. వాస్తవాలు గుర్తించకుండా రియాజ్ మాట్లాడటం సరికాదన్నారు. పొత్తు ధర్మం పాటిస్తునే ఉన్నామని, కానీ పొత్తులో ఉన్నప్పటికీ బాలినేనిపై మాత్రం తమ పోరాటం ఆగదన్నారు. నాడు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి, నేడు జనసేనలో చేరితే బాలినేని సచ్చీలురవుతారా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని గుర్తించాలని తెలిపారు. అపార్థం చేసుకోవడం కాకుండా, అర్థం చేసుకుంటే టీడీపీ శ్రేణుల ఆవేదన అర్థం అవుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తెలుగు యువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాపులను కించ పరిచేలా

మాట్లాడితే చూస్తూ ఊరుకోం

టీడీపీ నాయకుడు శశికాంత్‌భూషణ్‌కు కాపు సంఘం నాయకుల హెచ్చరిక


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాపులకు ఇచ్చే నామినేటెడ్ పదవులపై టీడీపీ నాయకుడు శశికాంత్‌భూషణ్ మరోసారి కించపరిచేలా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని కాపు సంఘం నాయకులు హెచ్చరించారు. స్థానిక కాపు సంఘం కార్యాలయంలో ఆదివారం వనభోజన మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలోనే ఎద్దు శశికాంత్‌భూషణ్ కాపులపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కాపులపై మరోసారి ఇష్టారీతిన మాట్లాడితే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తోందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటు కోసం కాపులు 90శాతం మంది ఓట్లు వేసి రాష్ట్రంలో, ఒంగోలులో గెలుపు కోసం కృషి చేశారన్నారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి తన కోసం కష్టపడి పనిచేసిన కాపు కులానికి చెందిన సింగరాజు వెంకట్రావు కుటుంబానికి ఒడా ఛైర్మన్ పదవి ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దామచర్ల కూడా ఆలోచించి మీకోసం కష్టపడి ఎవరు పనిచేశారో వారికి కూటమిలో ఉన్న ఏ కాపుకైనా ఛైర్మన్ పదవిని ఇవ్వాలని కాపు సంఘం నాయకులు కోరారు. కాపు వనభోజన మహోత్సవానికి 36 మందితో తొమ్మిదిబృందాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్, టి.శ్రీనివాసమూర్తి, కె.శ్రీనివాసరావు, నరహరి సాంబయ్య, తోటకూర చినవెంకట్రావు, పూల శ్రీను, మిరియాల శ్రీనివాసరావు, చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, ఆలూరి శ్రీహరి, కోడె నాగరాజు, శేఖర్, రాయళ్ల వెంకట్రావు, దూడల బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ సఖ్యతతో పనిచేస్తున్నారు..

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు సమన్వయంతో కలిసి పనిచేస్తున్నారని, కానీ ఒంగోలులో అందుకు భిన్నంగా ఉండటం తగదని జనసేన పార్టీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడ బాలనాగేంద్రయాదవ్ పేర్కొన్నారు. స్థానిక డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో ఆదివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాలకు అనుగుణంగా అందరూ పని చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మద్దిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొట్టడంతో కొష్టాలులోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. స్థానిక కొష్టాలు సెంటర్ సమీపంలోని పెట్రోలు బంకు వద్ద గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళుతుండగా ఓ వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ పత్రాలను అందజేస్తున్న ఝాన్సీ

నాగులుప్పలపాడు అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును మండల మహిళా అధ్యక్షురాలు గూడూరి ఝాన్సీ ఆధ్వర్యంలో ఆదివారం నాగులుప్పలపాడులో ప్రారంభించారు. పలువురికి సభ్యత్వ నమోదులను అందించారు. సభ్యత్వం తీసుకొన్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందుతుందని చెప్పారు. పార్టీ శ్రేణులు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చుండూరి నాగేశ్వరరావు, ఉప్పుటూరి హరినాథ్, గొల్లపూడి పెదసుబ్బయ్య, పొనకల ఆంజనేయులు, పోలినేని శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న రుత్విక్కులు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సుదర్శన హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త ఆలూరు వెంకట రమణారావు జయంతి సందర్భంగా ప్రముఖ ఆగమ వేదపండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో స్వామివారికి సువర్ణ అష్టదళ పద్మ పాదార్చన జరిగింది. కార్యక్రమంలో దేవస్థాన ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తలు ఆలూరు జైశంకర్, ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, లక్ష్మీకుమారి, పలు రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలూరు వెంకట రమణారావు చిత్రపటానికి పూలమాల సమర్పించి ధార్మిక, సామాజిక సేవారంగాలలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.

శాస్త్ర విజ్ఞానమే సమాజ అభివృద్ధికి పునాది

- జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు జవహర్


విజేతలకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న జేవీవీ నాయకులు

చీమకుర్తి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర విజ్ఞానమే సమాజ అభివృద్ధికి పునాది అని జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ తెలిపారు. జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను చీమకుర్తి పట్టణంలోని చీమకుర్తి పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. పరీక్షలో విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో డాక్టర్ జవహర్, రెసిడెన్షియల్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ జయ ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి చందలూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు, ద్వితీయ బహుమతి పీసీపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, తృతీయ బహుమతి గిద్దలూరు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతిని చీమకుర్తి పబ్లిక్ స్కూల్, ద్వితీయ బహుమతి వెలిగండ్ల కేవీఎస్ఎల్ హైస్కూల్, తృతీయ బహుమతి ఉప్పుగుండూరుకు చెందిన ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరీనారాయణ, చలువాది రమేష్, పూనాటి వెంకట్రావు, నాయకులు యు.భాస్కర్, కె.సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి రమేష్, సీహెచ్.జయప్రకాష్, ఎం.శ్రీనివాసులు, ఖాజా హుస్సేన్, శరత్, నల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(రూరల్), అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈనెల 29 వతేదీన ఒంగోలు వస్తారని ఎంపీ కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. అదేరోజున వెలుగొండ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ఇరిగేషన్‌శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి పరిశీలిస్తారు. 30వతేది ఉదయం నుంచి 10గంటలవరకు ఒంగోలులోని తన కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కూటమి నాయకులతో జరిగే సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.

120 మందికి వైద్యసేవలు


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న చిరంజీవి

మద్దిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దొడ్డవరప్పాడు గ్రామ సచివాలయ ఆవరణంలో టీడీపీ నాయకుడు గోరంట్ల చిరంజీవి ఆధ్వర్యంలో ఒంగోలు స్మార్ట్ విజన్ కంటి ఆస్పత్రి వారు ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 120మందికి ఉచితంగా కంప్యూటర్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రానైట్ లారీలు పట్టివేత

ఒంగోలు క్రైం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా అక్రమంగా గెలాక్సీ పాలిష్డ్ రాళ్లు తరలిస్తున్న రెండు లారీలను శనివారం రాత్రి పట్టుకున్నట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక లారీని పొదిలి, మరో లారీని చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లలో ఉంచామన్నారు. రెండు లారీలు ఎలాంటి బిల్లులు లేకుండా హైదరాబాద్ వైపు తరలిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రానైట్ ముడి రాయికి రాయల్టీ చెల్లించకుండా తరలిస్తుండగా మద్దిపాడు వద్ద పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించామని పేర్కొన్నారు.

డీఏపీ కావాలంటే వారి ఉత్పత్తులు కొనాల్సిందే

- మన గ్రోమోర్ సిబ్బంది తీరుపై రైతుల అసహనం


ఉప్పుగుండూరులోని గ్రోమోర్ దుకాణం

నాగులుప్పలపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉప్పుగుండూరులోని మన గ్రోమోర్ దుకాణంలో ఎరువులు కొనుగోలు చేసేందుకు వెళుతున్న రైతులకు అక్కడి సిబ్బంది వ్యవహార శైలితో రైతులు ఖంగుతింటున్నారు. డీఏపీ కొనుగోలు చేసేందుకు వెళ్లిన రైతులకు తమ కంపెనీకి చెందిన పురుగుమందులు, దుబ్బ గుళికలు గాని ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేస్తేనే డీఏపీ బస్తాలు ఇస్తామని చెప్పడంతో రైతులు వెనుదిరగాల్సి వస్తుంది. మీరు మా గ్రోమోర్ వినియోగదారులు కాదు నిత్యం గ్రామంలోని సొసైటీలోనే ఎరువులు కొనుగోలు చేస్తుంటారు కాబట్టి డీఏపీ బస్తాలు అక్కడే తెచ్చుకోండని సలహా ఇస్తున్నారని రాపర్ల గ్రామానికి చెందిన రాంబాబు, మట్టిగుంటకు చెందిన పాలేరు నాగేశ్వరరావు, స్థానికంగా నివశించే రాయపూడి సుదర్శనం, పెంట్యాల శ్రీనివాసరావుతో పాటు పలువురు రైతులు గ్రోమోర్ సిబ్బంది తీరుతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రోమోర్ దుకాణం సిబ్బందిపై చర్యలు తీసుకొని రైతులకు ఎరువులు అందించేలా చూడాలని వారు కోరుతున్నారు.

నేడు టీడీపీ కొండపి నియోజవర్గ సమావేశం

టంగుటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కొండపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం జాతీయ రహదారిలోని ఐఓసీ ఎదురు మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య కార్యాలయంలో జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ తెలిపారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశానికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

హిందూ ధర్మ పరిరక్షణే వీహెచ్‌పీ లక్ష్యం


సభ్యులకు శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

మద్దిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) పనిచేస్తుందని పరిషత్ దక్షిణాంధ్ర సత్సంగ వర్గ ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడు మండలం మల్లవరంలోని ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన వీహెచ్‌పీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడాలని కోరారు. దేవాలయాలు, దేవతామూర్తులకు చేసే సేవలు, యజ్ఞం, ఉత్సవాల నిర్వహణ మొదలైన వాటిపై పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో క్షేత్ర సత్సంగ ప్రముఖ్ పండరీనాథ్, యక్కలి రాఘవులు, సోమా సుబ్బారావు, పర్రె కోటేశ్వరరావు, శివశంకర్, చిన్మయానంద మిషన్ స్వాత్మానంద స్వామీజీ, మహా విద్యానంద గిరి మాతాజీ, తూనుగుంట మల్లిఖార్జునరావు, పలు ప్రాంతాల నుంచి వచ్చిన సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన మాధవరావు


కిషన్‌రెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న మాధవరావు

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): స్థానిక శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దాలి మాధవరావు ఆదివారం కేంద్రమంత్రి ఎన్.కిషన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా గత 25 సంవత్సరాలుగా తాను ప్రకాశం జిల్లాలో చేస్తున్న సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలతో రూపొందించిన పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం కేంద్రమంత్రి, మాధవరావును అభినందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రామచందర్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు పెద్దచెరువు భద్రతపట్టదా?

- కట్టపై పగుళ్లు
- ఏపుగా పెరిగిన చిల్లచెట్లు


చెరువు కట్టపై వచ్చిన పగుళ్లు, పెరిగిన చిల్లచెట్లు

సంతనూతలపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో పెద్ద చెరువు కట్ట భద్రత గాలిలో దీపంలా మారింది. దాదాపు 150 ఎకరాలకుపైగా ఉన్న ఈచెరువు ప్రజల తాగునీటికోసం దీనిని ఏర్పాటు చేశారు. అయితే ఈచెరువు సంతనూతలపాడు ప్రజలను దాహార్తిని తీర్చే గంగమ్మతల్లి లాంటి చెరువు. కానీ ఈచెరువు భద్రతపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై సంతనూతలపాడు వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులో ఈ చెరువు కర్నూల్ రోడ్డుహైవేకు ఆనుకుని ఉంటుంది. నిత్యం ఈచెరువు మీదుగానే జిల్లా స్థాయి అధికారులు, మంత్రులు, పాలకులు వాహనాల్లో వెళ్తుంటారు. ఈ చెరువు కట్టపై ఒకటిన్నర కిలోమీటరు మేర ముళ్లచెట్లు, పిచ్చి చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో చెరువు కట్ట నాణ్యత దెబ్బతినే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం వశాత్తు చెట్లు ఏపుగా పెరిగి లీకేజీలు ఏర్పడే ప్రమాదముందని, తద్వారా కట్టకే ప్రమాదముందని సంబంధం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

30శాతం ఐఆర్ ప్రకటించాలి : బీటీఏ

ఒంగోలు విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు డిమాండ్ చేశారు. ఒంగోలులో ఆదివారం జరిగిన అసోసియేషన్ డివిజన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాలరామయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మాధవరావు, కర్ర దేవసహాయం, జగన్నాథం ప్రసాదరావు, మిరియాల వెలుగొండయ్య, ఏల్చూరి భాగ్యం, జి.శ్రీనివాసులు, కృపాజయం, భాస్కరావు, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మిర్యాల వెలుగొండయ్య, అధ్యక్షులుగా పల్లె తిరుపస్వామి, ప్రధానకార్యదర్శిగా కె.ప్రభాకర్, నగర గౌరవాధ్యక్షులుగా అధ్యక్షులుగా కృపజయం, అధ్యక్షులుగా పావళ్ళ రాచయ్య, ప్రధానకార్యదర్శిగా నూకతోటికుమార్ స్వామి, కోశాధికారిగా మిరియాల విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

రక్తదాన శిబిరానికి విశేషస్పందన



రక్తదానం చేస్తున్న పోలీసులు

కంభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో పోలీసుల చేసే త్యాగాలు మరువలేనివని మార్కాపురం డీఎస్పీ నాగరాజు తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం కంభం పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్పీ నాగరాజు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన పలువురు యువకులను అభినందించారు. రక్తదాన శిబిరంలో వివిధ వర్గాల ప్రజలు, పోలీసులు సుమారు 130 మంది రక్తదానం చేశారు. కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, కంభం సీఐ మల్లికార్జున, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల ఎస్సైలు నరసింహారావు, రవీంద్రరెడ్డి, సుదర్శన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

పొదిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాలుగేళ్లగా 104 సిబ్బంది ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏ శ్రీనివాస రావు అన్నారు. స్థానిక ఎన్‌జీవో హోంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గని మాట్లాడారు. నాలుగేళ్లగా సిబ్బంది పడుతున్న ఇబ్బందులను పట్టించు కోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం మారిన తరువాత 104 ఉద్యోగుల భవిష్యత్తు కార్యచరణ, ఉద్యోగ భద్రత, అరబిందో కంపెనీ బకాయిలపై చర్చించామన్నారు. సమస్యలపై రాష్ట్ర కమిటీ తీసుకొనే నిర్ణయాల అమలుకు అందరు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కే.రవివర్మ, కోశాధికారి పి.శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ జి.నరేంద్ర, 104 డీఈవోస్, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మలచెరువు దర్గాలో విశేష పూజలు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలచెరువులో కొలువైన చిన్నకాశీంస్వామి, పెద్ద కాశీంస్వాములను ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గతంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కూడా స్వామివారిని దర్శించుకున్నట్లు ఎంపీ తెలిపారు. ఈ సందర్భంగా ముజావర్లు స్వామివారి దారాలను ఎంపీ, ఎమ్మెల్యే చేతులకు కట్టి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాయి బాసాపతిరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం త్రిపురాంతకేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి కుంకుమార్చలను చేశారు. పూజల అనంతరం ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, అర్చకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు అందజేసి, ఆశీర్వదించారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

పొదిలి, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల మండలశాఖ యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వివేకానంద జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సభకు ముఖ్యఅతిథిగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 సంవత్స రాలైన సందర్భంగా మండల సభలు జరుగుతున్నాయన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేయడం వలన అప్రంటీస్, కౌన్సెలింగ్, ఆటోమేటిక్ అడ్వాన్స్‌స్కీం, రీగ్రూపింగ్ స్కేల్ మొదలైన అంశాలు సాధించినట్లు తెలిపారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నూతన కమిటీని ఎన్నుకొని వారితో ప్రమాణం చేయించారు.



అథ్లెటిక్స్ పోటీలలో దోర్నాల విద్యార్థి ప్రతిభ



పోటీలకు ఎంపికైన విద్యార్థి

పెద్ద దోర్నాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన యు. మౌర్యచంద్ర సిద్ధార్థ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-17 విభాగంలో నిర్వహించిన హైజంప్ పోటీల్లో మౌర్య పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. దీంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రస్థాయిలో నవంబరు 3, 4వ తేదీల్లో శ్రీకాకుళంలో జరగనున్న పోటీల్లో పాల్గొని అక్కడ కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు రామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల క్షేత్రస్థాయి సందర్శన



క్షేత్రస్థాయిలో ల్యాబ్ సందర్శనకు వచ్చిన విద్యార్థులు

మార్కాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామంలోని ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థులు ఆదివారం స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో క్షేత్రస్థాయి సందర్శనలో పాల్గొన్నారు. మోడల్ స్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులు ప్రిన్సిపల్ వేణుగోపాల్, అధ్యాపకుల ఆధ్వర్యంలో కళాశాలలోని లాబొరేటరీలను పరిశీలించారు. సాంకేతిక అంశాలను గురించి ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తే వారి అభ్యసన స్థాయి మరింత మెరుగవుతుందనే ఉద్దేశ్యంతో క్షేత్రస్థాయి సందర్శనలు చేయిస్తున్నట్లు ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో గౌస్ మోహిద్దీన్, బి.మోహన్, ఉస్మాన్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

గిద్దలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచారామ దేవస్థానాల సందర్శన కోసం గిద్దలూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. కార్తీక మాసంలో ఒకేరోజు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలలోని పంచారామాల దర్శనం కోసం ప్రత్యేకంగా బస్సు సర్వీసులు నడుపనున్నట్లు తెలిపారు. కార్తీక మాసం ప్రతి ఆదివారం రాత్రి 10గంటలకు గిద్దలూరు నుంచి ప్రత్యేక బస్సులు బయలు దేరుతుందన్నారు. సోమవారం రోజు మొత్తం పంచారామాల దేవస్థానాల దర్శనం చేయించి మంగళవారం తెల్లవారుజాముకు గిద్దలూరు చేరుస్తామని పేర్కొన్నారు. ఎక్స్‌ప్రెస్‌కు 1700, అల్ట్రాడీలక్స్‌కు 2100, సూపర్ లగ్జరీకి 2200 రూపాయల చార్జీ ఉంటుందన్నారు. ముందుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే కార్తీక మాసంలో అరుణాచలం, శ్రీశైలం, మహానంది, యాగంటి, అహోబిలం, ఓంకారం, భైరవకోన, బ్రహ్మంగారి మఠం లాంటి పుణ్యక్షేత్రాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు సమకూరుస్తామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.







ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మికసంఘం అధ్యక్షుడు నారాయణ

గిద్దలూరు, అక్టోబరు 27 : ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలన్నింటిని కొనసాగించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కె.నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయం ఆవరణలో గిద్దలూరు మండల భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇసుక లేకపోవడంతో నిర్మాణ పనులు లేక భవన నిర్మాణ కార్మికులందరూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నారాయణ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేసి ఉచితంగా ఇసుకను ఇవ్వాలని కోరారు.

నూతన కార్యవర్గం

గిద్దలూరు మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులుగా కె.నారాయణ, ఉపాధ్యక్షులుగా షేక్ మహమ్మద్‌గౌస్, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, సి.హెచ్.రాంబాబు, మద్దులేటి, కమిటీ సభ్యులుగా నరసింహులు, ఆవులయ్య, మహమ్మద్ బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిలిచిన ఇళ్ల నిర్మాణాలు

- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కంభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికారుల ఉదాసీనత, పాలకుల నిర్లక్ష్యం వెరసి మదర్‌థెరిస్సా కాలనీలో పక్కా ఇళ్ల నిర్మాణం తీరని కలగానే మిలిగింది. 19 ఏళ్ల క్రితం ఇక్కడ ఇళ్ల పట్టాలు మంజూరైనా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా నేటికీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడం విశేషం.

కందులాపురం పంచాయతీలో 2007-08లో ఎస్సీ, ఎస్టీలు 226 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. అయితే రోడ్డు నిర్మాణాలు, నీటిసౌకర్యం కల్పించలేదు. దీంతో కేవలం 36 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. వీటిలో ఎనిమిది ఇళ్లు పూర్తి కాగా మిగిలినవి పునాది దశలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం కాలనీకి వెళ్లేందుకు రైల్వేస్థలాన్ని వినియోగించుకుంటున్నారు. దీనిపై ఆ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో లబ్దిదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ విషయంపై గతంలో పలు సంఘాల నాయకులు బాధితుల పక్షాన రెవెన్యూ అధికారులకు సమస్యలు తెలియజేశారు. అప్పటి తహసీల్దార్ హుస్సేన్‌పీరా మార్కెట్‌యార్డు పక్క నుంచి కాలనీకి వెళ్లేందుకు రోడ్డుమార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వేయర్లతో కొలతలు వేయించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన తరువాత ఇప్పటికీ 15 మంది తహసీల్దార్లు మారినా దాని ఊసే మరచిపోయారు. కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లాలోనే మొదటి సారిగా ఐపీడీపీ పథకం కింద రూ.15.73 లక్షలతో 30వేల లీటర్ల నీటిసామర్థ్యం ఉన్న మంచినీటి పథకాన్ని పూర్తి చేశారు. ట్యాంక్ నిర్మాణం పూర్తయి కాలనీలో సగ భాగం పైపు లైన్ కూడా పూర్తి చేశారు. తరువాత నిధులు చాలకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయి. దీంతో నీరు లేక గృహనిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గృహనిర్మాణానికి సంబంధించిన ఉపకరణాలు తీసుకెళ్లేందుకు కూడా దారి లేకుండా పోయింది. ఈ రోడ్డు ఎప్పుడు వేస్తారోనని లబ్దిదారులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఊరి చివర ఉన్న కాలనీలో జనసంచారం పెద్దగా లేకపోవడంతో అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రెండేళ్లక్రితం 10 కుటుంబాల వారు కాలనీలో నిర్మించుకున్న గృహాల్లో నివసిస్తున్నారు. వారికి నీటిసౌకర్యం లేకపోవడంతో కందులాపురం పంచాయతీ వారు వారానికి ఒకసారి ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేసేవారు. అయితే అక్కడే నివాసం ఉంటున్న లబ్దిదారుల అభ్యర్థన మేరకు రోడ్డు పక్కన కొలాయిలను ఏర్పాటు చేసి రెండురోజులకొకసారి నీటిని వదులుతున్నారు. కరెంటు సౌకర్యం లేకపోవడంతో విషపురుగులు వస్తున్నాయని, రాత్రిపూట బిక్కుబిక్కు మంటూ నివసిస్తున్నామని కాలనీ వాసులు దానమ్మ, సుగుణమ్మ తెలిపారు. అధికారులు స్పందించి కాలనీకి నీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.



కాలనీలో నిలిచిన నిర్మాణాలు

మా పోరాట ఫలితంగానే స్థలాలు



గతంలో చేసిన మా పోరాట ఫలితంగా రైల్వేస్టేషన్ సమీపంలో ఎస్సీ, ఎస్టీలకు స్థలాలు మంజూరు చేశారు. 2008లో గృహాలు కూడా మంజూరు చేశారు. కాలనీకి వెళ్లేందుకు దారికూడా లేకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రెవెన్యూ అధికారులు స్పందించి కాలనీకి దారి చూపించాలి. **పానుగంటి షాలెంరాజు**

దారి లేకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి



కాలనీకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో కేవలం కొద్దిమంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. మిగిలిన వారు అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం 35 కుటుంబాల వారు నివసిస్తూ అసౌకర్యాల నడుమ జీవిస్తున్నారు. కాలనీకి రహదారి, నీటి సౌకర్యం కల్పించి పేదల సమస్యలు పరిష్కరించాలి. **- నేదురపల్లి జయరాజ్**

టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

పొదిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పొదిలిలో విశేష స్పందన లభించింది. పట్టణంలోని 1, 2, 3 వార్డులో శనివారం మండలాధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి లక్ష్యమన్నారు. అందుకు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. వంద రూపాయలు చెల్లించిన సభ్యత్వం తీసుకోవాలన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ప్రమాదబీమా వర్తిసుందన్నారు. కార్యక్రమంలో, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్ జిల్లా ముస్లింమైనారిటీ నాయకులు రసూల్, మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, రైతుసంఘ నాయకులు ఆవులూరి యలమంద, గౌస్, షబ్బీర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం : కంభం, కందులాపురం, అర్బన్‌కాలనీలో ఆదివారం రెండవరోజు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని టీడీపీ మైనారిటీ విభాగం మండల నాయకులు జేడీ.బాబు, షేక్ అక్తర్‌హుస్సేన్, ఎన్ఆర్ఐ సయ్యద్ రఫీ తెలిపారు. ఆదివారం కంభం అర్బన్ కాలనీలో 100కు పైగా టీడీపీ సభ్యత్వాలు చేశారు. టీడీపీ బీమా సభ్యత్వ నమోదు కార్యకర్తల జీవితానికి భరోసా అని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీడీపీ సీనియర్ నేత సయ్యద్ నూరుల్లాఖాద్రి, జిల్లా మైనారిటీ కార్యదర్శి సయ్యద్ అనీస్ అహమ్మద్, షేక్ దీనావలి, పెద్దపిచ్చయ్య, దూదేకుల కాశయ్య, రజాక్ బాషా, అస్లామ్‌బేగ్ పాల్గొన్నారు.



పొదిలిలో టీడీపీ సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నిక ఏకగ్రీవం



ఎర్రగొండపాలెం నూతనంగా ఎన్నికైన రెడ్డి సేవా సంఘం

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):ఎర్రగొండపాలెం రెడ్డి సంక్షేమ సేవాసంఘం ఎన్నిక ఏక్రీవంగా నిర్వహించారు. ఆదివారం ఎర్రగొండపాలెంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీనీ ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా బిజ్జం రమణారెడ్డి, ఉపాధ్యాక్షుడిగా ఆవుల రమణారెడ్డి, కోశాధికారిగా కొల్లి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులుగా నాసర్‌రెడ్డి, నందిరెడ్డి, కందుల నారాయణరెడ్డిలను ఎన్నుకున్నారు. ఎన్నికైనా నూతన కమిటీకీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మోర్తాల సుబ్బారెడ్డి, ఒంగోలు మూర్తిరెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

మార్కాపురం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధిక వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని మిట్టమీదిపల్లి, తిప్పాయపాలెం గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు రాయితీపై శనగలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై రైతులకు విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ కందుల మాట్లాడుతూ రైతులు సాగుచేస్తున్న ప్రతి పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలను జరిగిన పంట నష్టాన్ని అదికారులు అంచనాలు తయారు చేస్తున్నారని తెలిపారు. త్వరలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రితో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఉన్నత స్థాయి అధికారులు వెలుగొండ ప్రాజెక్టును సందర్శించి పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఏడీఏ బాలాజి నాయక్, ఏవో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, జవ్వాజి రామాంజులరెడ్డి, దూదేకుల మస్తాన్, గొలమారి నాసర్‌రెడ్డి, కటకం పోలిరెడ్డి, గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న నారాయణరెడ్డి

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వెలిగొండకు నిధులు కేటాయించాలి

- సాధన సమితి నాయకుల డిమాండ్



టన్నెల్ వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

పెద్ద దోర్నాల, అక్టో బరు 27 (ఆంధ్రజ్యోతి): లక్షల ఎకరాల భూమిని సస్యశ్యామలం చేసి ప్రజ ల గొంతులు తడిపేం దుకు తలపెట్టిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి తగిన నిధులు కేటాయించాలని వెలిగొండ సాధన సమితి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలోని కీలక భాగాలైన రెండవ టన్నెల్ పనులను ఉదయగిరి ప్రాంతం వెలిగొండ ప్రాజెక్టు సాధన సమితి నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ క్రమంలో ప్రాజెక్టు ఇన్‌చార్జ్ రాంబాబును పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాధన సమితి నాయకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ వర్షాధారంపై ఆధారపడి సాగు చేసే భూములు సస్యశ్యామలం చేసేందుకు నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులు ఏళ్ల తరబడి సాగుతూనే ఉన్నాయన్నారు. ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కరువైందన్నారు. అధికారులు తెలిపిన సమాచారం మేరకే రెండేళ్ల సమయం పడుతుందంటే వాస్తవరూపంలో నాలుగేళ్లకు పైమాటేనన్నారు. అది కూడా బడ్జెట్టులో ఏటా 2వేల కోట్లు నిధులు కేటాయించాలన్నారు. ముంపు బాధితుల సమస్యలు పెండింగులోనే ఉన్నాయన్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ప్రాజెక్టును సందర్శించాలని డిమాండ్ చేశారు. త్వరితగతి నిర్మాణం పనులు ప్రారంభించాలని లేని పక్షంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రాజెక్టు పూర్తికి ఉద్యమం చేపడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, కాకుల వెంగలరావు, రైతు సంఘం నాయకులు వెంకటయ్య, దస్తగిరి, మండల సీపీఐ నాయకులు తిరుమలరావు, న్యూ డెమొక్రసీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బాణసంచా నిల్వలు స్వాధీనం

కంభం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కందులాపురంలోని జాతీయ రహదారి పక్కన ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4 లక్షల విలువైన బాణసంచాను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కంభం ఎస్సై నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం, ఓ గృహంలో బాణసంచా అక్రమంగా నిలువ ఉంచారనే సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు.


దొనకొండలో సిమెంట్‌రోడ్డుకు భూమిపూజ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యం

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దొనకొండలో పారిశ్రామిక అభివృద్ధి జరగాలనే లక్ష్యంతో ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ఇటీవల సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కలిసి ముందడుగు వేస్తామని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ వివరించారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోలేపల్లి, దొనకొండలోని అరబస్తాన్, ఒబ్బాపురం, దొండపాడు గ్రామాల్లో చేపట్టనున్న సిమెంట్‌రోడ్లకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కరోడ్డు గుంత పూడ్చకుండా అభివృద్ధిని గాలికొదిలేసి రాష్ట్రాన్ని అప్పుల్లో కూరుకుపోయేలా దోచుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలో ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజల నుంచి ఆదరాభిమానాలు పొందుతుందన్నారు. దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, సంక్రాంతికి ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించేలా చర్యలు జరుగుతున్నాయన్నారు. దర్శి అభివృద్ధికి నావంతు నిరంతరం కృషి చేస్తూ నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసేలా ప్రధానంగా దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు, విమానాశ్రయం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, టీడీపీ నాయకులు కందుల నారపురెడ్డి, కామేపల్లి చెంచయ్య, పోతిపోగు చెన్నయ్య, యరగొర్ల బసవయ్య, కొమ్మతోటి సుబ్బారావు, పెమ్మసాని లక్ష్మీనారా యణ, కుందుర్తి లక్ష్మణ్, దుగ్గెంపూడి చెంచయ్య, షేక్ తోహీద్, పత్తి వెంకటేశ్వర్లు, చొప్పరపు మైకెల్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లక్ష్మిని కలిసిన టీఎన్‌ఎస్‌ఎఫ్ ప్రతినిధులు

పల్లెపండుగ కార్యక్రమాన్ని ఆదివారం దొనకొండకు విచ్చేసిన టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కలిశారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ మార్కాపురం, కనిగిరి డివిజన్ల అధ్యక్షుడు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి మండ్ల శ్రీనివాసులు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీకి క్యాలెండర్ అందించారు. ఉపాధ్యాయులకు సంబంధించి అనేక విషయాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులైన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నారాయణ స్వామికి మహానైవేద్యం తెస్తున్న భక్తులు

నారాయణస్వామికి ఆదివారం పూజలు

పామూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామికి ఆదివారం పూజలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహా నైవేద్యంను సమర్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ చిన ఆదినారాయణ, ఈవో గిరిరాజు నరసింహబాబు, పాలకొట్లు వెంకటేశ్వరరెడ్డి, పందిటి హరీష్, భక్తులు, ఆలయ సిబ్బంది. పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్లతో సమావేశం

పీసీపల్లి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):పీసీపల్లి తహసీల్దార్ సీహెచ్.ఉష అధ్యక్షతన సోమవారం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రమేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగే సమావేశానికి మండలంలోని అన్ని రేషన్‌షాపుల డీలర్లతో పాటు ఎండీయూ ఆపరేటర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.



ఆలయాన్ని దర్శించాలని ఆహ్వానం

సీఎస్‌పురం(పామూరు)అక్టోబరు27(ఆంధ్రజ్యోతి) :సీఎస్‌పురం మండలంలోని భైరవకోన, నారాయణస్వామి ఆలయాలను దర్శించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్ ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును ఆదివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేసి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చావా నారాయణ చారి, పి నరేంద్రలు ఉన్నారు.


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న మాధవప్రసాద్

కనిగిరికి ట్రాఫిక్ ఎస్ఐ నియామకం


ఎమ్మెల్యే ఉగ్రకు మొక్కను అందజేస్తున్ననూతన ట్రాఫిక్ ఎస్ఐ

కనిగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి డివిజన్ కేంద్రంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేకంగా ఎస్ఐని నియమించారు. ఈ మేరకు ట్రాఫిక్ ఎస్ఐగా ప్రసాద్‌రెడ్డి విధుల్లో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనిగిరిలో ప్రధానంగా నెలకొన్న ట్రాఫిక్ ఇబ్బందులను వివరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను కట్టుదిట్టం చేయటంతో పాటు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

రాజగారిబాట ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

పామూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని విరాట్‌నగర్ కాలనీలోని శ్రీకాళహస్తి రాజ గారి బాటను కొందరు ఆక్రమించారని ఆరోపిస్తూ మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నొస్సం నాగేంద్రాచారి, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందకు వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వర్లు అనే వ్యక్తి బాట మొత్తం తనదని, విరాట్‌నగర్ వాసులు ఈ బాటపై నడిచే హక్కు లేదని హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నాడని అందులో పేర్కొన్నారు. ఇలాంటి దురాక్రమణలను తొలగించి విరాట్‌నగర్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దర్శి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ దర్శి ఈఈ పి. శ్రీనివాసులు సూచించారు. కేంద్రప్రభుత్వం సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసుకునే ప్రతి కుటుంబానికి రూ.30వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. బ్యాంకులు 90శాతం రుణాలను మంజూరు చేస్తున్నాయన్నారు. ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేసుకోవటం వలన విద్యుత్ బిల్లు భారం తగ్గిపోతుందన్నారు. అదనంగా విద్యుత్ తయారు చేసుకుంటే విద్యుత్‌శాఖకు విక్రయించి లాభాలు పొందవచ్చని వివరించారు. పంట పొలాలకు అక్రమంగా విద్యుత్‌తీగలు వేయటం వలన ప్రజలకు తగిలి మృత్యువాత పడుతున్నారని తెలిపారు. పందుల నుంచి పంటల రక్షణ కోసం కొందరు రైతులు విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు





ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

ఉద్యోగ అవకాశములు

■ పార్ట్ టైం మరియు ఫుల్ టైం ఉద్యోగ అవకాశములు కలవు. వర్క్ ఫ్రం హోం. ఉద్యోగ అవకాశములు కలవు. ఆసక్తికలవారు సంప్రదించండి. సెల్: **8919154522**

AJO-200080

జ్యోతిష్యాలయం

■ ఆదిశక్తి రేణుక యల్లమ్మ తల్లి జ్యోతిష్యము చెప్పబడును. ప్రేమ, పెళ్ళి, సంతానం, ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, ఏ సమస్యలైన పరిష్కారం చెప్పబడును. సంప్ర॥ G.కృష్ణంరాజు, R.T.C.బస్టాండు దగ్గర, ఒంగోలు, సెల్: **9640409458**

AJO-200166

కావలెను

■ అద్దంకి పట్టణం నందు ప్రముఖ ఇంటర్‌నేషనల్ కొరియర్ నందు పని చేయుటకు పురుషుడు కావలెను. జీతం: రూ.10,000/- + ఇన్సెంటివ్. సమయం: 9Am to 7Pm. సెల్: **9392963399.**

AJO-ADK

WANTED

■ మోక్షజ్ఞ కన్సల్టెన్సీ, ఒంగోలు సిటీలోని ప్రముఖ హాస్పిటల్‌లో డాక్టర్స్ : UG & PG, రేడియాలజీ, జనరల్ మెడిసిన్, సెక్యూరిటీ, స్టాఫ్ నర్స్, GNM, B.Sc, మార్కెటింగ్ మేనేజర్స్, టెలికాలర్స్, హౌస్ కీపర్స్ కావలెను. సంప్ర॥ **8019343834.**

AJG-203521

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లిపై భక్తితో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని పూజించారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు వాహనదారులు వాహనపూజలు చేయించారు. ఈకార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

పుణ్యక్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ బస్సు

కనిగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక సేవలు అందిస్తుందని డీఎం షయానాబేగం ఆదివారం తెలిపారు. కనిగిరి డిపో నుంచి నవంబరు 13న రాత్రి 8గంటలకు బయలు దేరే బస్సు అరుణాచలం, కంచి, గోల్డెన్ టెంపుల్, తిరుత్తణి, శ్రీకాళహస్తివంటి పుణ్యక్షేత్రాలను దర్శించుకుని 17వ తేదీ సూర్యోదయానికి కనిగిరి చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర రూ.2,200లని, పూర్తి వివరాలకు 9652260174ను సంప్రదించాలని కోరారు.

పేదలకు భరోసా సీఎం సహాయనిధి

రూ. 5.95 లక్షల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కనిగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం పేదలకు సీఎం సహాయనిధి కింద రూ. 5.95 లక్షల విలువగల చెక్కులను ఆరుగురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ నేడు వైద్యం అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. ఇలాంటి పరిస్థితిల్లో పేదలకు ఆపద సమయాల్లో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకునే పరిస్థితి నుంచి సీఎం సహాయనిధి ద్వారా సీఎం చంద్రబాబునాయుడు ఆదుకుంటున్నారన్నారు. నియోజక వర్గంలో వైద్యం కోసం ఏ కుటుంబం ఇబ్బంది పడకూడదనే సంకల్పంతో త్వరితగతిన వారికి సీఎం సహాయనిధి నుంచి ఆదుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, ఐవీ నారాయణ, సీపీఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

టీడీపీ శాశ్వత సభ్యత్వానికి ముందుకు రావాలి

పామూరు : టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో నాయకులందరూ ఆయా ప్రాంతాల్లో సభ్యత్వాలను నమోదు చేయించాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కోరారు. పామూరు పట్టణంలోని పడమర బైపాస్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ దాబాను ఎమ్మెల్యే ఉగ్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ ముఖ్య నాయకులతో మాట్లాడుతూ దేశంలోనే మరే ఇతర రాజకీయ పార్టీ చేయని రీతిలో కార్యకర్తల సంక్షేమానికి కట్టుబడిన ఏకైక పార్టీ టీడీపీ యేనన్నారు. కొత్త, పాత సభ్యత్వాల పునరుద్ధరణకు వాట్సాప్, ఆన్‌లైన్ సౌకర్యం ఉందని సూచించారు. సభ్యత్వాలు తీసుకొన్న అందరికీ రూ. 5 లక్షల వరకు ప్రమాదబీమా, కుటుంబ సభ్యులకు విద్య, ఉద్యోగ ఆరోగ్య సదుపాయాలు అందుతాయన్నారు. సాధారణ కార్యకర్తలు రూ.100 సభ్యత్వాలు తీసుకోవాలని, నాయకులు శాశ్వత సభ్యత్వం కోసం లక్ష రూపాయలు ఆన్‌లైన్‌లో చెల్లించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు, మాజీ ఎంపీటీసీలు ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, పందిటి హరీష్, మెంటా నరసింహారావు, ఎన్. సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



పామూరు మండలం కంభాలదిన్నెలో టీడీపీ సభ్యత్వాలను నమోదును పరిశీలిస్తున్న అడుసుమల్లి

టీడీపీ సభ్యత్వాల నమోదు

పామూరు : మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి ఆదివారం ప్రారంభించారు. గ్రామ అధ్యక్షులు మన్నం రమణయ్య, పచ్చవ పేరయ్య, గోళ్ల భాస్కరరావు, ఏలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

పీసీపల్లి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య అన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని గుంటుపల్లి, శంకరాపురం గ్రామాలను ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ వాడే వ్యక్తులు తమకు తెలియని కొత్త నెంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు, వాట్సప్ కాల్, వీడియోకాల్‌లకు స్పందించవద్దన్నారు. కొంతమంది సైబర్ కేటుగాళ్లు మీ బ్యాంకు అకౌంట్ ఈకేవైసీ చేయాలని, ఆధార్ లింకు చేయాలని, మొబైల్‌నెంబర్ అప్‌డేట్ చేయాలంటూ ఫోన్లు చేస్తారన్నారు. వారు అడిగిన వాటన్నింటికీ మనం బదులివ్వగానే మన బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును తస్కరిస్తారని ఆయన అన్నారు.ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లైతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, జూదం, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కోటయ్య

బైక్‌ను ఢీకొన్న ఆటో

భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

దొనకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంలో వెళ్తున్న భార్యాభర్తలు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని వద్దిపాడు గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. వెంక టాపురం ఎస్సీ కాలనీకి చెందిన శ్రీరామ్ కిరణ్‌బాబు, రాహేలమ్మ దంపతులు ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్తున్నారు. వద్దిపాడు నుంచి సంగాపురం వైపు వెళ్తున్న ఆటో వారిని ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కిరణ్‌బాబు కుడికాలు విరిగిపోగా రాహేలమ్మ తలకు తీవ్ర గాయమైంది. సమాచారం మేరకు 108 సిబ్బంది ఈఎంటీ వెలుగొండయ్య, పైలెట్ జానీబాషాలు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రూ. 10 లక్షల విలువైన బంగారం చోరీ

కురిచేడు,అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక ఉంటున్న చల్లా వీర్రాజు అనే వ్యక్తి ఇంట్లో శనివారం దొంగతనం జరిగింది. సుమారు రూ.10 లక్షల విలువైన బంగారం అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. వీర్రాజుకు ఐదుగురు కుమార్తెలు. వారంతా పనులకు దూర ప్రాంతాలకు వెళ్తూ తండ్రి వద్ద బంగారం, నగదు ఉంచడం పరిపాటి. ఈ క్రమంలో 15 రోజుల క్రితం ఒక కుమార్తె తన బంగారాన్ని తండ్రి బీరువాలో దాచుకుని వెళ్లింది. శనివారం రాత్రి ఆమె వచ్చి బీరువాలో చూస్తే బంగారం కనబడలేదు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. త్రిపురాంతకం సీఐ అసన్, కురిచేడు ఎస్ఐ శివలు వీర్రాజు ఇంటిని పరిశీలించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం బీరువాకు చెందిన రెండు తాళాలు వీర్రాజు దగ్గరే ఉన్నాయి. బీరువాను పగులగొట్టిన ఆనవాళ్ళు ఏమి లేవు. బంగారం దాచిన పెట్టెలు అలానే ఉన్నాయి. ఇంటి తాళాలకు కానీ, బీరువా తాళాలకు కాని ఎటువంటి నష్టం జరుగలేదు. దొంగలు అపహరిస్తే నగలు దాచిన పెట్టెలతో సహా తీసుకెళ్లారు. కానీ తీరిగ్గా పెట్టెలను తీసి బంగారం దొంగిలించి వాటిని మరలా అక్కడే భద్రంగా పెట్టే సాహసం చేయరు. ఈ చోరీపై ఇంట్లో వారినందరినీ కూర్చొని మాట్లాడుకొని నిర్ణయం తీసుకోమని చెప్పాం. వారు బయట పడక పోతే మా పద్ధతిలో విచారించి దొంగలను పట్టుకుంటాం. గతంలో సైతం అదే ఇంట్లో మూడు సవర్ల బంగారం అపహరణకు గురైనట్లు సమాచారం.

దర్శిలో తీవ్రమైన కోతుల బెడద

- ప్రజలను గాయపరుస్తున్న వైనం

దర్శి అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో కోతుల బెడద అధికమైంది. పట్టణ వీధుల్లో గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిని కరిచి గాయపరుస్తున్నాయి. గృహాల్లోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. ఉదయం సమయంలో కూరగాయలు, పాలు తెచ్చుకునేందుకు బయటకు వెళ్లిన వ్యక్తుల నుంచి కవర్లు లాక్కొని పోతున్నాయి. గృహాల్లోకి చొరబడినప్పుడు అటకాయించిన మహిళలను కరిచి గాయపర్చుతున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నగర పంచాయతీ అధికారులు కోతుల బెడద నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రహదారిపై దర్జాగా తిరుగుతున్న వానరాలు (ఇన్‌సెట్లో) ఓ వృద్ధురాలిని కరవడంతో అయిన గాయం

అధైర్య పడొద్దు...అండగా ఉంటాం

టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ధూళ్ళ వెంకటేశ్వర్లు భార్య చౌడమ్మ ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత సాగర్ దంపతులు ఆదివారం సాయంత్రం వెంకటేశ్వర్లును పరామర్శించారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం ఉమా మహేశ్వర అగ్రహారంలో రావులపల్లి నాగమల్లిక, అదే గ్రామంలో షేక్ అబ్దుల్ కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, వేముల సర్పంచ్ గజ్జల సుబ్బారెడ్డి, నాగినేని నాగేశ్వరరావు, డీ ఏడుకొండలు, కాటూరి గురవయ్య, దేవినేని కోటేశ్వరరావులతో పాటు సాగినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న లక్ష్మి



నరసయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న స్వర్ణకారులు

నరసయ్య మృతికి సంతాపం

పామూరు, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : పామూరు స్వర్ణకార సంఘం సభ్యుడు రామనబోయిన లక్ష్మీనరసయ్య (41) మృతదేహానికి పామూరు స్వర్ణకారులసంఘం సభ్యులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పామూరు పట్టణానికి చెందిన లక్ష్మీనరసయ్య, గత వారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనికి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లక్ష్మీనరసయ్య మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం తిరుపతి నుంచి శనివారం రాత్రి పామూరుకు తెచ్చారు. ఆదివారం దహన క్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఒక కుమార్తె ఒక కుమారుడు ఉన్నారు. ఇంకా మృత దేహానికి నివాళులర్పించిన వారిలో పట్టణ స్వర్ణకారసంఘం అధ్యక్షులు ముండ్లమూరి సత్యం, ఓగూరి నరసింహారావు, ఏడుకొండలు, రమణ, రోశయ్య, ప్రభాకర్, ఎస్. మల్లికార్జునరెడ్డి, గురుబ్రహ్మం, సభ్యులు పాల్గొన్నారు.

టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

ప్రకటన : ఆర్.ఓ.సి నెం : 03/2024 — తేదీ.27-10-2024

ప్రకాశం జిల్లా, ముండ్లమూరు మండలం, ఈదర గ్రామ పంచాయతీ నందలి ఈదర, కొమ్మవరం చెరువుల నందు **2024-2025, 2025-2026 మరియు 2026-2027 సంవత్సరములకు అనగా మూడు సంవత్సరముల కాలమునకు** తేది.30-06-2027 వరకు చేపలు వేసి పెంచి పట్టుకొను హక్కులు పొందుటకుగాను **టెండర్ కం బహిరంగ వేలం తేది : 06-11-2024**న ఈదర గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం జరుపబడును.

షరతులు :

1. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అదే రోజు రూ.1000/- చెల్లించి ఉదయం 9 గంటల నుంచి 11 గంటల లోపు టెండరు ఫారం పొందవలెను.
2. పూర్తి చేసిన టెండరు షెడ్యూల్ ఫారం అదే రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును.
3. బహిరంగ వేలం దరావత్తు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల లోపు మాత్రమే స్వీకరించబడును. మధ్యాహ్నం 2 గంటల నుండి బహిరంగ వేలం జరుపబడును.
4. సీల్డ్ టెండరుకు షెడ్యూల్ ఫారంతో పాటు ఈదర చెరువునకు రూ.4,25,000/-లు, మరియు కొమ్మవరం చెరువునకు రూ.3,85,000/-లు ఏదైనా బ్యాంక్ నుండి పంచాయితీ కార్యదర్శి, గ్రామ పంచాయితీ ఈదర పేరున డి.డి. తీసి జతపరచవలెను.
5. బహిరంగవేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద ఈదర చెరువునకు రూ.4,25,000/-లు, కొమ్మవరం చెరువునక రూ.3,85,000/-లు ముందుగా నగదు రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెను..
6. టెండర్ కం బహిరంగవేలంలో పాల్గొనేవారు ఈదర చెరువునకు రూ.6,00,000/-లు, కొమ్మవరం చెరువునకు రూ.5,00,000/-లు సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించవలెను.
7. గ్రామ పంచాయతీకి బకాయిలు ఉన్న వారు వేలంలో పాల్గొనుటకు అనర్హులు.
8. ప్రభుత్వ మద్దతు ధర ఈదర చెరువునకు రూ.17,00,000/-లు, మరియు కొమ్మవరం చెరువునకు రూ.15,50,000/-లు రాని ఎడల టెండర్ కం బహిరంగ వేలం పాటను వాయిదా వేయుటకు మరియు రద్దు చేయుటకు గ్రామ పంచాయితీకి పూర్తి అధికారం కలదు.
9. టెండరులో కాని బహిరంగ వేలంలో కాని ఏది హెచ్చు మొత్తం అయినదో దానిని మాత్రమే స్వీకరించబడును.
10. ఈదర చెరువు సర్వే నెంబరు 361/2లో 42 ఎకరాల విస్తీర్ణం, కొమ్మవరం చెరువు సర్వే నెంబరు 78లో 80 ఎకరాల 81 సెంట్లు విస్తీర్ణం కలదు.
11. టెండరు షరతులు మిగతా వివరములు గ్రామ పంచాయితీ కార్యాలయం పనిచేయు వేళలలో వచ్చి తెలుసుకొనవలెను.
12. చెరువులకు గాని, అలుగులకు గాని ఎటువంటి నష్టం కలిగించరాదు.

శ్రీమతి వంగల పద్మావతి, సర్పంచ్
గ్రామ పంచాయతీ ఈదర,
ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా
సెల్ : **9959110355**

జె.శ్రీనివాసరావు,
పంచాయతీ కార్యదర్శి, ఈదర,
ముండ్లమూరు మండలం, ప్రకాశం జిల్లా,
సెల్ : **9030656023**



ఆట పాటలతో.. ఆనందమయ జీవితం గడపాల్సిన చిన్నారులు పెళ్లిపీటలు ఎక్కుతున్నారు. బరువులు, బాధ్యతలు, భయాలు తెలియని ప్రాయం కుటుంబ బాధ్యతల్లో విలవిల్లాడుతోంది. బాదర బందీ లేని ప్రాయం కుటుంబ చట్రంలో పడి నలిగిపోతోంది. చీకూచింత లేకుండా, హాయిగా చదువుకుని బంగారు భవిష్యత్తును ఎంచుకోవాల్సిన చిన్నారులు మూడుముళ్ల బందీఖానాలో మగ్గిపోతున్నారు. ఆధునిక కాలంలోనూ బాల్యవివాహాల సామాజిక దురాచారం ముక్కుపచ్చలారని చిన్నారులను బలిచేస్తోంది. పెళ్లంటే ఏమిటో కూడా తెలియకుండానే చిన్నారుల జీవితాలు శిథిలమైపోతున్నాయి. విద్యా కేంద్రమైన గుంటూరులాంటి జిల్లాలో కూడా బాల్య వివాహాలు భారీగా నమోదవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడికక్కడ అధికారులు అడ్డుకుంటున్న బాల్య వివాహాలు పదుల సంఖ్యలో ఉండగా ఇక వారికి తెలియకుండా జరుగుతున్నవి ఎన్నో ఎవరికీ అంతుచిక్కడంలేదు.

బాల్యం.. బందిఖానా



- మూడు ముళ్ల'బంధ'నంలో బాలికలు
- సంరక్షణ భయంతోనే పెళ్లిబాటలో తల్లిదండ్రులు
- గడిచిన ఐదేళ్లలో ఆందోళనకర స్థాయిలో పెరుగుదల
- పట్టణ ప్రాంతాల్లోనూ నమోదవుతున్న బాల్య వివాహాలు
- అత్యధిక బాల్య వివాహాలు జరిగే జిల్లాల్లో నాలుగో స్థానంలో ఉమ్మడి గుంటూరు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలు.. కేరింతలు.. గిల్లికజ్జాలు.. ఇలా ఎన్నో మధురానుభూతుల్లో సాగాల్సిన బాల్యం వివాహ బంధంలో బందీగా మారిపోతోంది. ఎప్పుడో 150 ఏళ్ల క్రితం 1872లోనే బాల్య వివాహాలను రద్దు చేస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చట్టం చేసినా అది నేటి ఆధునిక సమాజాన్ని కూడా వీడలేదు. బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. కొవిడ్ తర్వాత బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఏదో ఒక వివాదం జరిగి, ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప బాల్య వివాహాల విషయం అధికారుల వరకూ రావడం లేదన్నది వాస్తవం. ఏది ఏమైనప్పటికీ గడిచిన నాలుగేళ్లలో బాల్య వివాహాల దురాచారం విపరీతంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల విషయం ఎలా ఉన్నా, పట్టణ ప్రాంతాల్లో ఈ మహమ్మారి జడలు విప్పి కోరలు చాచి చిన్నారుల జీవితాలను వివాహ బంధనాల్లోకి లాగేస్తోంది. ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలోని మహిళల్లో ప్రస్తుతం 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో 29.3 శాతం మంది బాల్య వివాహాలు చేసుకుంటున్నారని తేలింది. వీరిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు 32.9 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలు 21.7 శాతం ఉన్నారు. వీరిలో 12.6 శాతం మహిళలు 15 నుంచి 19 ఏళ్లలోపే గర్భం దాల్చారు. తగిన వయసు, శారీరక ఎదుగుదల లేకుండానే వీరు గర్భిణులుగా మారడంతో వీరి ప్రాణాలు ప్రమాదంలో పడిపోయాయి. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ కృషి చేస్తున్నప్పటికీ అది ఏమాత్రం సరిపోవడం లేదన్నది గణాంకాల ద్వారా వెలికి తెలుస్తున్న వాస్తవం. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టమని నిపుణులు చెబుతున్నారు.

బాల్య వివాహాలు 35.4 శాతం

బాల్య వివాహాల రాష్ట్ర సగటు 29.3 శాతం. అయితే రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో అంతకు మించి బాల్య వివాహాలు జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం 2019- 20లో 35.4 శాతం బాల్య వివాహాలు జరిగాయి. ఇది రాష్ట్ర సగటు కంటే 6 శాతం అధికం.

అడ్డుకుంటున్నా ఆగని బాల్య వివాహాలు

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బాల్య వివాహాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటుంది. అయితే అధికారులకు సమాచారం అంది లేదంటే తెలిసి అడ్డుకున్న కేసుల సంఖ్య ఏటికేడాది పెరుగుతున్నాయి. ఇక వారికి తెలియకుండా జరుగుతున్న పెళ్లిళ్లు ఎన్నో అంతుబట్టడంలేదు. దీనిని బట్టి అధికారులు అడ్డుకుంటున్నా బాల్య వివాహాలు ఆగడంలేదని తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2018లో 31 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకోగా అది 2019 నాటికి 23కు తగ్గింది. అయితే కొవిడ్ ప్రభావం మొదలైన 2020లో 34 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకోగా, 2021లో ఆ సంఖ్య 37కు చేరింది. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 12 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 2022 జిల్లాల పునర్విభజన తర్వాత ఒక్క గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకూ 48 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకోగా 2022లో 32, 2023లో 16, ఈ ఏడాది తొలి 8 నెలల్లో 16 కేసులు నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలో 21 బాల్య వివాహాలు ఆపగా, 2022లో 12, 2023లో 9, బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకూ 29 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య పదుల రెట్లు ఎక్కువగా ఉండవచ్చని సమాచారం.

భయమే కారణం

గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగడానికి కారణం అవిద్య, అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల సమస్య వేరేలా ఉంది. సినిమా, టీవీల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయట పడేందుకు తక్కువ వయసులో పెళ్లిళ్లకు తల్లిదండ్రులు పూనుకుంటున్నారు. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం ఆడపిల్లలకు శాపంగా మారింది.

వివిధ స్థాయిల్లో కమిటీలు..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో 3 నుంచి 5 మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో సంబంధిత తహసీల్దార్ పనిచేస్తారు. గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక ఉపాధ్యాయురాలు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ, యువజన సమాఖ్య సభ్యుడు, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరంతా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ఆయా ప్రాంతాల్లో తెలియచేస్తూ తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అడ్డుకుంటారు. అయితే ఈ కమిటీలు నామమాత్రంగా మారిన కారణంగా బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి.



- సీసీఆర్ కార్డుల ప్రామాణికంగా రైతులకు రుణాలు
- నిబంధనల విషయంలో సడలింపు ఇచ్చే దిశగా కసరత్తు
- క్షేత్రస్థాయిలో కౌలురైతుల సమస్యల పరిష్కారం.. లబ్ధిపై దృష్టి

కౌలుకు మంచి రోజులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కౌలు రైతులు.. కష్టాలు కలిసి ఉంటాయి. నష్టం, కష్టమైనా సాగును మాత్రం వీరు వీడరు. కౌలు రైతులు ప్రధానంగా పెట్టుబడి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. అదే విధంగా ప్రభుత్వ పథ కాలకు నోచుకోక నష్టపోతుంటారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మంచి రోజులు తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరకొర రుణాలతో విసిగి వేసారిన కౌలు రైతులు కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో సీసీఆర్ కార్డుల జారీతో పాటు రుణాల మంజూరుపై జిల్లాల వారీగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డులకు అందించిన రుణాలకు హస్తిమశకాంతం తేడా ఉండడంతో ఈ పరిస్థితి మారాలని తాజాగా జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆదేశాలిచ్చింది. ఇప్పటికే ఖరీఫ్ రుణాల విషయంలో లక్ష్యాన్ని చేరుకున్నామని బ్యాంకులు ఊదరగొడుతున్నప్పటికీ వాటిలో కౌలు రైతుల వాటా తీసికట్టుగా ఉండడంపై సమీక్ష జరిపింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కౌలు రైతులకు రుణాల విషయంలో మరింత మందికి న్యాయం జరిగేలా అడుగులు పడనున్నాయి. ఏటా బ్యాంకర్లు ప్రకటించే వార్షిక పద్దులో 5 శాతం మొత్తాన్ని కౌలు రైతులకు రుణాలుగా

(మిగతా 8వ పేజీలో..)

గుంటూరు సెక్షన్‌లో...

పెరిగిన రైళ్ల వేగం

- కేవలం 3.38 గంటల్లోనే 257 కి.మీ ప్రయాణం
- గంటన్నర ముందుగానే గమ్యస్థానానికి చేరుతున్న రైళ్లు
- గతంలో ఐదు నుంచి ఆరు గంటల సమయం
- సమయ పట్టిక సవరించాల్సిన పరిస్థితి ఉత్పన్నం



గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నంద్యాల సెక్షన్‌లో రైళ్ల ప్రయాణ వేగం గణనీయంగా పెరిగింది. దిగువమెట్ట వద్ద ఘాట్ సెక్షన్ మినహా అంతా రెండు వరసల మార్గం నిర్మాణం పూర్తికావడంతో ఈ రూట్‌లో రైళ్ల క్రాసింగ్‌ల సమస్య తప్పింది. అంతేకాకుండా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణిస్తుండటంతో ముందుగానే గమ్యస్థానానికి చేరుకొని షెడ్యూల్ ప్రకారం బయలుదేరే సమయం కోసం లూప్‌లైన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి. అయినప్పటికీ రైల్వే శాఖ టైంటేబుల్‌ని సవరించడం లేదు. ప్రధాన రైల్వేస్టేషన్లలో ఎక్కువ సమయం లూప్‌లైన్‌లో పెట్టడం వలన గూడ్స్ ట్రాఫిక్‌కి

(మిగతా 8వ పేజీలో..)

'పాల'కూట విషం

- దర్శిప్రాంతంలో విచ్చలవిడిగా కల్తీపాల తయారీ
- యూరియా, సల్ఫర్, ప్రమాదకరమైన రసాయనాల వినియోగం
- లీటరు పాల నుంచి 10 లీటర్లు
- ఇటు డెయిరీలు, అటు జనాలకు విక్రయం
- ప్రజల ప్రాణాలతో అక్రమార్కుల చెలగాటం
- అరకొరదాడులకే అధికారుల పరిమితం

దర్శి ప్రాంతంలో కల్తీ పాల తయారీ విచ్చలవిడిగా జరుగుతోంది. కుటీర పరిశ్రమలా సాగుతోంది. అడ్డగోలుగా సంపాదించాలన్న అత్యాశతో కొందరు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అత్యంత ప్రమాదకరమైన యూరియా, సల్ఫర్, ఇతరత్రా పలు రసాయనాలతో కల్తీపాలు తయారు చేస్తున్నారు. వాటిని సాధారణ పాలలో కలుపుతున్నారు. అసలుకు, కల్తీకి తేడా తెలుసుకోలేని విధంగా కనికట్టు చేస్తున్నారు. కొందరు ప్రైవేటు డెయిరీలకు పోస్తుండగా, మరికొందరు నేరుగా ప్రజలకు విక్రయించి వారిని అనారోగ్యం'పాలు' చేస్తున్నారు. ఆహార భద్రత అధికారులు ఫిర్యాదులు అందినప్పుడు నామమాత్రపు దాడులు చేస్తున్నారే తప్ప నివారణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు.


దర్శిలో కల్తీ పాలను పారబోస్తున్న ఆహార భద్రతా శాఖాధికారులు (ఫైల్)

దర్శి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతకు నిదర్శనంగా చెప్పుకునే పాలు విషపూరితమవుతున్నాయి. కొందరు రకరకాల పద్ధతుల్లో కల్తీ పాలను తయారు చేస్తున్నారు. వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని అనేక చోట్ల ఈ వ్యవహారం సాగుతున్నప్పటికీ దర్శి నియోజకవర్గంలో అత్యధిక గ్రామాల్లో ఎక్కువ మంది దీన్ని వ్యాపారంగా మార్చుకొని విషం చిమ్ముతున్నారు. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో కల్తీ పాల తయారీ ముమ్మరంగా జరుగుతోంది. దర్శి పట్టణంలో అనేక పాల విక్రయ కేంద్రాలు ఉన్నాయి. ప్రజలు నిత్యం వందలాది లీటర్ల పాలు కొనుగోలు చేస్తున్నారు. ఇదేఅదనుగా అక్రమార్కులు కల్తీ పాలను తయారుచేసి పాల విక్రయ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. పాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు సేకరించిన పాలు నాణ్యమైనవా, కాదా అన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. నాణ్యతను తెలుసుకునేందుకు వారి వద్ద అవసరమైన పరికరాలు లేవు. దీంతో వచ్చిన పాలు వచ్చినట్లు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. నకిలీ పాల తయారీపై నిఘా లేకపోవడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది.

నిత్యం వందల లీటర్ల కల్తీపాలు తయారీ

దర్శిలో కొంతకాలం క్రితం 600 లీటర్ల కల్తీ పాలను ఆహార భద్రతశాఖ అధికారులు పట్టుకున్నారు. అంతకుముందు లంకోజనపల్లిలో పాల విక్రయ కేంద్రం నిర్వాహకుడి వద్ద నకిలీ పాలు గుర్తించారు. అధికారులు దాడులు చేసిన ప్రతిసారీ కల్తీ పాలు పట్టుబడుతున్నాయంటే ఇక్కడ ఏస్థాయిలో అవి తయారవుతున్నాయో అర్థమవుతుంది. కొంతమంది అక్రమార్కులు నిత్యం వందలాది లీటర్ల కల్తీ పాలను తయారు చేసి కొన్ని పాల శీతల కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. లాభాపేక్షే ధ్యేయంగా పనిచేస్తున్న ఆ పాలశీతల కేంద్రాల నిర్వాహకులు వచ్చిన పాలను తనిఖీ చేయకుండా కొనుగోలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి పాల శీతల కేంద్రంలో లాక్టోమీటరు ద్వారా పాలను తనిఖీ చేసి స్వచ్ఛమైనవిగా నిర్ధారించుకున్న తరువాతే కొనుగోలు చేయాలి. అలాచేస్తే పాల రాబడి తగ్గి ఆదాయం పడిపోతుందని ఉద్దేశపూర్వకంగానే కల్తీ పాలను కొనుగోలు చేస్తున్నారు.



కల్తీపాల తయారీ ఇలా

గతంలో పాలలో నీళ్లు కలిపి కల్తీ చేసేవారు. ఆతర్వాత అధికపాల ఉత్పత్తి కోసం పశువులకు ఇంజక్షన్‌లు ఇవ్వడం ప్రారంభించారు. ఇప్పుడు ఏకంగా ప్రాణాలను హరించే పదార్థాలతో కల్తీ చేస్తున్నారు. కల్తీ పాలు తెల్లగా ఉండేందుకు పాలపొడి, లేదా పచ్చికొబ్బరిని ఉపయోగిస్తున్నారు. జిగురు వచ్చేందుకు సన్‌ఫ్లవర్, పామాయిల్‌ను మిక్స్ చేస్తున్నారు. నురుగు కోసం యూరియా, సల్ఫర్, ఇతరత్రా పలు రసాయనాలను కలుపుతున్నారు. ఇలా రూ. 100 ఖర్చుతో పది లీటర్ల కల్తీ పాలు తయారు చేస్తున్నారు.

రెండేళ్లలో 20 కేసులు నమోదు

ఒక్క దర్శి నియోజకవర్గంలోనే రెండేళ్లలో 20 కేసులు నకిలీ పాల తయారీకి సంబంధించి నమోదయ్యాయి. దర్శి-కురిచేడు రోడ్డులోని ఓ పాల శీతల కేంద్రం నకిలీ పాలు కొనుగోలు చేసిన కేసులో అధికారులు రూ.50 వేల జరిమానా విధించారు. కల్తీ పాలను పరీక్షించే ప్రభుత్వ కార్యాలయం ఇప్పటికీ హైదరాబాద్‌లోనే ఉంది. ఇక్కడి అధికారులు తనిఖీలు చేసి పంపిన శాంపిల్స్‌ను పరీక్షించి నివేదికలు పంపడానికి నెలల తరబడి జాప్యం జరుగుతోంది. దీంతో కల్తీ పాల తయారీదారులకు భయం లేకుండా పోయింది. ఒకవేళ పట్టుకుని నేరం రుజువయినప్పటికీ జరిమానాలు మాత్రమే వేస్తున్నారు. ఫలితంగా, నకిలీ పాల తయారీదారులు పుట్టగొడుగుల్లా పెరుగుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్న కల్తీ పాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పల్నాడు మార్గంలో పెరిగిన రైళ్ల వేగం

(7వ పేజీ తరువాయి)

ఆటంకం కలిగే పరిస్థితి ఉత్పన్నమైంది.

పరిస్థితులు మారాయి..

గతంలో గుంటూరు - నంద్యాల రైలుమార్గం సింగిల్ లేన్‌గా ఉండేది. దాంతో రైళ్ల క్రాసింగ్‌ల కోసం చాలా సమయం లూప్‌లైన్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఉండేది. ఏరోజు సమయానికి ప్రయాణించేవి కావు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లోగడ నంద్యాలకు చేరుకోవడానికి కనీసం ఐదు గంటలకు పైగా సమయం పట్టేది. ఇప్పుడు 3 గంటల 40 నిమిషాల వ్యవధిలోనే హాల్టింగ్‌లతో చేరుకుంటున్నాయి. తాజాగా నంబరు 22831 హౌరా - యశ్వంత్‌పూర్ శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24వ తేదీ ఉదయం 10.54కి గుంటూరు నుంచి బయలుదేరింది. ఈ రైలు నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో హాల్టింగ్ అయి నంద్యాలకు మధ్యాహ్నం 2.32కే చేరుకుంది. అది మొదలుకొని అక్కడి నుంచి బయలుదేరాల్సిన సమయం సాయంత్రం నాలుగు గంటల వరకు లూప్‌లైన్‌లో ఉన్నది. దాదాపుగా గంటన్నర పాటు నంద్యాల స్టేషన్‌లో ఈ రైలుని నిలపాల్సి వచ్చింది.

కొత్త టైంటేబుల్‌లోనైనా...

ఇదేవిధంగా రాత్రి వేళ హుబ్లీ - నరసపూర్ అమరావతి ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లు కూడా నిర్ణీత సమయం కంటే ముందుగానే గుంటూరుకు చేరుకుంటున్నాయి. ఆ సమయంలో గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఖాళీ లేక పేరేచర్ల, నల్లపాడులో ఆపుకుంటూ తీసుకొస్తున్నారు. అలానే బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు సిగ్నల్ పాయింట్ వద్ద కూడా అర గంట పాటు నిలిపేస్తున్నారు. మొత్తంగా రైళ్ల సగటు వేగం పెరిగింది. అమరావతి ఎక్స్‌ప్రెస్ సమయాన్ని తగ్గించినప్పటికీ మిగిలిన రైళ్ల సమయపట్టికని అలానే కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో రైల్వేబోర్డు విడుదల చేయబోయే కొత్త టైంటేబుల్‌లోనైనా గుంటూరు - నంద్యాల మధ్యన రాకపోకలు సాగిస్తున్న రైళ్ల ప్రయాణ సమయాన్ని తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఉత్సాహంగా సభ్యత్వ నమోదు

కారంచేడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు జాగర్లమూడి ప్రహ్లాద ఆధ్వర్యంలో కారంచేడులో సభ్యత్వ నమోదు కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. ఆదివారం టీడీపీ కార్యాలయంలో పలువురు కార్యకర్తలు సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రహ్లాద మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అధినేత చంద్రబాబు సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి కార్యకర్తా విధిగా పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోతిని సుబ్బారావు, యార్లగడ్డ నాగేశ్వరరావు, దగ్గుపాటి చౌదరి, జాగర్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న పొగాకు నారు

- మూట ధర రూ.4వేలపైనే
- గతం కన్నా రెట్టింపు
- దక్షిణాదిలో ముమ్మరంగా నాట్లు



ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులు ఈ ఏడాది సాగు ఆరంభంలోనే బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా నారు ధర దడపుట్టిస్తోంది. మూట రూ.4 వేలకుపైనే పలుకుతోంది. సాధారణంగా ఈ సమయంలో పొగాకు నారు బాగానే అందుబాటులో ఉంటుంది. మూట గరిష్ఠంగా రూ.1,500కు లభిస్తుంది. కాస్త డిమాండ్ ఉంటే రూ.2వేల వరకూ పలుకుతుంది. అయితే ఈ ఏడాది మూట నారు రూ.3వేల నుంచి ప్రారంభమై ప్రస్తుతం రూ.4వేలకు చేరింది. గడిచిన రెండు సీజన్లలో పొగాకుకు భారీ డిమాండ్ ఏర్పడి మంచి ధరలు లభించాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో సాగుకు రైతులు సిద్ధమయ్యారు. సాధారణంగా సెప్టెంబరు ఆఖరు నుంచి తేలిక నేలలు, ఎర్రనేలలు ఉండే ఎస్ఎల్ఎస్ రీజియన్‌లోని వేలం కేంద్రాల పరిధిలో, అక్టోబరులో ఎస్‌బీఎస్ రీజియన్‌లోని ఎగువ ప్రాంతంలో నాట్లు వేస్తారు. ఈఏడాది సెప్టెంబరులో బెట్టవాతావరణంతో నాట్లు కాస్త ఆలస్యమయ్యాయి. ఈనెల రెండో వారం నుంచి దాదాపు పదిరోజులపాటు తెరపిలేకుండా వర్షాలు కురవడంతో మరికొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం వర్షాలు వెలిసి పొలాలకు ఆరడంతో ముమ్మరంగా రైతులు పొగాకు నాట్లు వేస్తున్నారు.

ఇప్పటికే 20వేల ఎకరాల్లో నాట్లు

పొదిలి, కనిగిరి, కొండపి, కందుకూరు వేలం కేంద్రాల పరిధిలోని అనేక గ్రామాలతోపాటు ఒంగోలు-1, వెల్లంపల్లి కేంద్రాల పరిధిలోని ఎగువ ప్రాంతాల్లో రైతులు మొక్కలు నాటుతున్నారు. ఇప్పటికే దాదాపు 20వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. రానున్న వారం రోజుల్లో మరింత ముమ్మరం కానున్నాయి. అలా ఒక్కసారిగా నారుకు డిమాండ్ ఏర్పడింది. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లోని నారుమడులు దెబ్బతిన్నాయి. జరుగుమల్లి, కొండపి, పొన్నలూరు మండలాల్లో పాలేరు, ముసి నదుల సమీప గ్రామాల్లోని ఇసుక, తేలిక నేలల్లో నారుమడులు అధికంగా ఉంటాయి. అలాగే పొదిలి, కందుకూరు ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో బోర్ల కింద వేస్తారు. అలా స్థానికంగానే నారు దొరుకుతుంది. డిమాండ్ ఎక్కువ ఉన్నప్పుడు రాజమండ్రి ప్రాంతం నుంచి రైతులు తెస్తుంటారు. అయితే ఇటీవల వర్షాలతో చాలా చోట్ల నారుమడులు దెబ్బతిన్నాయి. వర్షం వెలిశాక మళ్లీ మడులు పెట్టినా నెల తర్వాతనే అవి నాట్లు వేసే దశకు వస్తాయి. దీంతో ప్రస్తుతం నారుకు డిమాండ్ ఏర్పడటంతో ఒక్కసారిగా ధరలు రెట్టింపు పలుకుతున్నాయి.

పెరిగిన కూలి ఖర్చులు

సాధారణంగా ఎకరాకు ఒకటిన్నర మూట నారు (9వేల మొక్కలు) అవసరం. అయితే ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉండటంతో ఒక్కో మూటలో ఐదువేల మొక్కలు మించి ఉండటం లేదు. దీంతో ఎకరాకు రెండు మూటలు రైతులు కొనాల్సి వస్తోంది. కొన్నిచోట్ల నారు నాణ్యత దెబ్బతినడంతో గ్రేడ్ చేసి బాగా లేనివి తీసేసి వేయాల్సి వస్తోంది. దీని వలన మరింత అవసరమవుతోంది. అలా ఒక వైపు నారు ధర అధికంగా పెట్టి, మరోవైపు మూటన్నర బదులు రెండు మూటలకుపైగా కొనాల్సి వచ్చి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఇదేసమయంలో నాట్ల కూలి కూడా గణనీయంగా పెరిగినట్లు రైతులు చెప్తున్నారు. గతంలో ఎకరా నాట్లు వేసేందుకు ఐదు వేల రూపాయాలు సరిపోతే ప్రస్తుతం రూ.12వేల నుంచి రూ.15వేల వరకూ ఖర్చవుతున్నదని రైతులు చెప్తున్నారు. మున్ముందు నారు ధర మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

కార్డుదారులకు తీపికబురు

- రేషన్ షాపుల ద్వారా మరిన్ని సరుకులు
- ఇక నుంచి పూర్తి స్థాయిలో కందిపప్పు
- వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిన జొన్నలూ పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెరిగిన నిత్యావసరాల ధరలతో తల్లడిల్లుతున్న పేదలకు ఊరటనిచ్చే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తీసుకుంది. రేషన్ షాపుల ద్వారా బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు, జొన్నలు కూడా ఇవ్వనుంది. వచ్చేనెల కోటా నుంచే అమలు చేయనుంది. దీనివలన జిల్లాలోని 6.70 లక్షల మంది కార్డుదారులకు లబ్ధి చేకూరనుంది. గత టీడీపీ హయాం(2014-19)లో రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు పౌష్టికాహారాన్నిచ్చే జొన్నలు, రాగులు పంపిణీ చేశారు. ఆమేరకు బియ్యాన్ని మినహాయించారు. అలా ఐదేళ్లు కొనసాగించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. కొద్ది నెలల అనంతరం రాగులు, జొన్నల పంపిణీని నిలిపివేసింది. కొద్దికాలం తర్వాత చక్కరకు కూడా స్వస్తి చెప్పింది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది ముందు నుంచి కందిపప్పును కూడా ఆపేసింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో అధిక దరలకు వాటిని కొనలేక పేదలు అల్లాడిపోయారు.

గోడౌన్‌లకు చేరిన అన్ని సరుకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌరసరఫరాల శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం బియ్యం, పంచదారకే పరిమితం కాకుండా ముందుగా కందిపప్పు పంపిణీకి శ్రీకారం చుట్టింది. వచ్చే నెల నుంచి దీన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడంతోపాటు జొన్నలు కూడా ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే బియ్యం, కందిపప్పు, జొన్నలు, పంచదార జిల్లాలోని గోడౌన్లకు చేరాయి. రేషన్‌షాపుల ద్వారా నవంబరు 1వతేదీ నుంచి ఆయా సరుకుల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు.

కౌలుకు మంచి రోజులు

(7వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉన్నా బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఈ క్రమంలో దీనిని సరిదిద్ది కౌలు రైతులకు న్యాయం చేయడంపై పాలకులు దృష్టి సారించారు. వార్షిక పద్దులో 5 శాతం రుణాలు అంటే బాపట్ల జిల్లాలో దాదాపు రూ.200 కోట్లు కౌలు రైతుల వాటాగా ఉండాలి. అలాంటిది ఖరీఫ్ ముగిసే నాటికి అంతా కలిపి ఇచ్చిన రుణాలు రూ.25 కోట్లుగానే ఉండడం గమనార్హం. గుంటూరు జిల్లాలో రూ.95 కోట్లు అందించాల్సి ఉండగా ఇప్పటికీ రూ.9 కోట్లు మాత్రమే రుణాలుగా అందించారు. ఇక పల్నాడు జిల్లాలో ప్రకటించిన వార్షిక పద్దులో కౌలు రైతుల వాటా దాదాపు రూ.140 కోట్లుగా ఉండగా ఇప్పటికీ అందించింది రూ.16 కోట్లకు మించకపోవడం వారిపై నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనబడుతోంది. సీసీఆర్ కార్డు ప్రామాణికంగానే కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడంలేదు. సీసీఆర్ కార్డు గడువు 11 నెలలు మాత్రమే కాగా అది కౌలు రైతుకు చేతికొచ్చేటప్పటికే మూడు, నాలుగు నెలలు గడిచిపోతున్నాయని దానివల్ల వారు రుణాలు తీసుకోలేకపోతున్నారనే అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కౌలు రైతుకు సీసీఆర్‌కార్డు ఇచ్చినా భూమి యజమాని ముందుగానే రుణం తీసేసుకుంటున్నారని దీని వల్ల సాంకేతికంగా ఒకే సర్వే నంబరు మీద రెండుసార్లు రుణం ఇవ్వడం కుదరలేదనేది కూడా బ్యాంకర్ల వాదన. ఒకే సర్వే నంబరుపై ఇద్దరికీ సీసీఆర్ కార్డులను రెవెన్యూ విభాగం మంజూరు చేస్తుందని, ఈ విషయంలో వ్యవసాయశాఖకు, రెవెన్యూ విభాగానికి సమన్వయం కొరవడడంతో అంతిమంగా ఆ ప్రభావం వారు అందుకునే రుణాలపై పడుతుందని తెలిపారు. ఒకే సర్వే నంబరు మీద రెండు కార్డులు జారీ చేసినవి ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే దాదాపు 5,000 వరకు ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

సీసీఆర్ కార్డులు పెద్ద సంఖ్యలోనే...

గత ప్రభుత్వంతో పోలిస్తే సీసీఆర్ కార్డుల జారీ విషయంలో కూటమి పాలకులు మెరుగైన ఫలితాలను రాబట్టగలిగారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాలో 1,06,300 కార్డులను అందించాలని యంత్రాంగానికి వ్యవసాయశాఖ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే 95,000 వరకు కార్డులను కౌలు రైతులకు అందించారు. గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడు జిల్లాలో 66,000 కార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇందులో ఇప్పటికే 90 శాతం చేరుకున్నారు. గడిచిన ఐదేళ్లతో పోలిస్తే సీసీఆర్‌సీ కార్డుల జారీ విషయంలో 30 శాతం పెరుగుదల నమోదైంది.

అన్నింటిని పరిష్కరిస్తాం.. రుణాలివ్వాల్సిందే

కౌలు రైతులకు రుణాలు తీసికట్టుగా ఉండడానికి గల కారణాలపై యంత్రాంగం దృష్టి పెట్టింది. ముందుగా సీసీఆర్ కార్డుల జారీలో దొర్లిన సాంకేతిక తప్పిదాలను సవరించడంతో పాటు రుణాల విషయంలో యజమానికి అవగాహన కల్పించి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపైనే ప్రభుత్వం పెట్టింది. ఇందుకోసం అవసరమైతే గ్రామాల వారీగా కౌలు రైతులు, యజమానులతో సమావేశాలు పెట్టి వారికి ఉన్న అపోహలు నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా పెట్టింది. రుణాల విషయంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి కనీసం రబీ సీజన్‌లో అయినా కౌలు రైతులకు మంచిరోజులు తేవడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. కౌలు చట్టానికి సవరణలు చేసైనా రైతులకు మేలు చేయాలన్న కృతనిశ్చయంతో కూటమి పాలకులు ఉన్నారు.

మాగోడు పట్టించుకోండి

- నిలువ నీడ లేక... దీన స్థితిలో వీవర్స్‌కాలనీ వాసులు
- ప్రభుత్వ పథకాల కోసం నిరీక్షణ


కాలనీ బురద మయం

తోటవారిపాలెం(చీరాలటౌన్), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం తోటవారి పాలెం పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీ స్ట్రయిట్ కట్ కాలువ కట్టపై సుమారు 300 కుటుంబాలు మేమున్నామని గుర్తించాలని వేడుకుంటున్నారు. ఇక్కడ ఉన్నవారిలో అధికశాతం వృద్ధులు, చేనేత కార్మికులు, నిరు పేదలు ఉన్నారు. వీరికి నివాస స్థలాలు లేక కట్టపైనే సుమారు 20 ఏళ్లుగా చిల్లచెట్లు, విష సర్పాల నడుమ జీవిస్తున్నారు. అంతేకాకుండా కట్టపై అధిక సంఖ్యలో గతంలో ఇసుక అక్రమ రవాణా జరగడంతో పలు చోట్ల కట్ట పూర్తిగా కరిగిపోయింది. ఈక్రమంలో సముద్రం పోటెత్తినప్పుడు, వర్షాలకు కాలువ నిండి నీళ్లు ఇళ్లల్లోకి చేరుతున్నాయి. అంతేకాకుండా ఇక్కడ నివసించే చిన్నారులు కాలువ అంచున అవగాహన లోపంతో ఆటలాడుతున్నారు. గతంలో ఇదే ప్రదేశంలో గేదె కోసం కాలువలోకి దిగిన వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈక్రమంలో కాలువ వద్ద రక్షణ చర్యలు చేపట్టకుంటే ఏక్షణంలోనైనా ప్రమాదాలు జరగవచ్చు. ఇక్కడ ఉన్నవారిలో రోజువారీ కూలీలు, చేనేత కార్మికులు ఉన్నారు. ఇటీవల వరుసగా కురిసిన వానలతో మగ్గం సాగక పూట గడవక అవస్థలు పడుతున్నారు. అధిక సంఖ్యలో ప్రజలకు ప్రభుత్వ ప్రభుత్వ పథకాలు అందని ద్రాక్షాలా ఉన్నాయి. ఈక్రమంలో ఒంటరి వృద్ధులు, దివ్యాంగులు అనారోగాలబారిన పడిన వారు ఆవేదన చెందుతున్నారు. బతుకు నరకప్రాయంగా ఉందని రోదిస్తున్నారు. మేమున్నామని గుర్తించాలని వేడుకుంటున్నారు.


నీటి కుంట వద్ద ఆడుతున్న చిన్నారులు

ఎవరూ లేరు ఆదుకోండయ్యా



నా అనేవారు ఎవరూ లేరు. ఒంటరి దానినయ్యాను. వృద్ధాప్యం వేధిస్తోంది. వేళ్ల ముద్రలు పడక రేషన్ కార్డు అందలేదు. దీంతో నేటికీ కనీసం పించన్ కూడా రాదు. పస్తులుంటున్నాను. ఆదరణ కల్పించి ఆదుకోండి.

- చిన్నంశెట్టి కోటేశ్వరమ్మ, స్థానికురాలు

మగ్గం సాగడం లేదు



ఒకవైపు నిలువ నీడలేదు. మరోవైపు వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా మగ్గం సాగడం లేదు. దీంతో కుటుంబం భారంగా మారింది. ప్రభుత్వం కనీస నివేశన స్థలాలు కల్పించాలి. కాలనీలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి.

- గంజి శివపార్వతి, స్థానికురాలు

విష సర్పాలతో భయాందోళన



చిన్న పిల్లలతో బిక్కు బిక్కుమంటున్నాం. రాత్రయితే కారు చీకటి. దోమల మోత. రోగాలతో విలవిల్లాడుతున్నాం. జీవితంలో వెలుగు లేదు. మాగోడు పట్టించుకున్న నాథుడే లేరు.

- గున్నం మార్తమ్మ, స్థానికురాలు

కట్ట కరిగిపోయింది.. ప్రమాదం పొంచి ఉంది



గతంలో చాలా ఎత్తులో ఇక్కడ స్ట్రయిట్‌కట్ కట్ట ఉంది. ఇసుక అక్రమ రవాణాతో నేల సమాంతరంగా మారింది. ఏ క్షణమైనా ప్రమాదం జరగవచ్చు. స్థానికులకు అంతిమ సంస్కారాలకు తిప్పలు పడుతున్నారు. బహిర్భూమికి పాములతో సహవాసం. వీరి వేదన దారుణమైనది. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలి.

- ఆకురాతి సుకీర్తన, మహిళా మండలి సభ్యురాలు

రేపు వెలిగొండకు ముగ్గురు మంత్రులు

- నిమ్మల నేతృత్వంలో ప్రాజెక్టును సందర్శించనున్న డాక్టర్ స్వామి, గొట్టిపాటి
- జిల్లాలో సాగునీటి రంగంపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్మాణంలో ఉన్న కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు వద్దకు మంగళవారం ముగ్గురు మంత్రులు రానున్నారు. జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు నేతృత్వంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులైన డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్ ప్రాజెక్టును సందర్శించనున్నారు. మంగళవారం ఉదయం దోర్నాల చేరుకొనే మంత్రులు తొలుత టన్నెళ్లు, వెలిగొండ కాలువలు, ఇతరత్రా పనులను పరిశీలిస్తారు. అనంతరం వెలిగొండ ప్రాజెక్టుతోపాటు గుండ్లకమ్మ, జిల్లాలోని ఇతర సాగునీటి వనరుల పరిస్థితి, అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై వెలిగొండ ప్రాజెక్టు సైట్ సమీపంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, సాగునీటి శాఖలోని అన్ని విభాగాల కీలక అధికారులు, ఇతర శాఖ జిల్లా అధికారులు హాజరుకానున్నారు. జిల్లాలో అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం గురించి వైసీపీ ఐదేళ్ల పాలనలో పెద్దగా పట్టించుకున్న పరిస్థితి లేదు. కృష్ణానది నుంచి రెండేళ్ల క్రితమే వెలిగొండకు నీరు తీసుకొనే అవకాశం ఉన్నా నిర్వాసితుల తరలింపు, ప్రాజెక్టులకు సంబంధించిన పలు పనుల పూర్తి విషయంలో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో నీటిని తీసుకోలేకపోయారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేతగా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన సందర్భంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వెలిగొండకు నీరిస్తామని ప్రకటించారు. ఎన్నికల్లో పశ్చిమప్రాంతంలోనూ టీడీపీకి మంచి ఫలితాలే వచ్చాయి.

వెలిగొండపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వెలిగొండపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాధాన్యత ప్రాజెక్టుగా ప్రకటించింది. తదనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టింది. జిల్లాలోని ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతప్రజాప్రతినిధులు పలు సార్లు వెలిగొండ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం అమరావతిలో సమావేశమైన ఉమ్మడి జిల్లా టీడీపీ ముఖ్యనేతలు ఈ అంశంపై ప్రధానంగా చర్చించారు. మంత్రి నిమ్మలతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో మంగళవారం ముగ్గురు మంత్రులు వెలిగొండకు వస్తున్నారు. దీంతో ప్రాజెక్టు పనులు, నిర్వాసితుల పునరావాస చర్యలలో కదలిక వచ్చే అవకాశం ఉంది.

30న ఒంగోలులో కూటమి పార్టీల భేటీ

- హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఆనం
- 4న యథావిధిగా సమీక్షా సమావేశం

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అధికార కూటమిలోని మూడు పార్టీల జిల్లాస్థాయి నేతల సంయుక్త సమావేశం ఈనెల 30న ఒంగోలులో ఏర్పాటు చేశారు. స్థానిక భాగ్యనగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇది జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త సమావేశాలను కొనసాగించాలని ఆ పార్టీల అధిష్ఠానాలు నిర్ణయించాయి. రాష్ట్రస్థాయిలో అలాంటి సమావేశాలు జరుగుతుండగా జిల్లా స్థాయిల్లో కూడా నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలు, ఇతరత్రా అంశాలలో క్షేత్రస్థాయిలో కలిసి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని నిశ్చయించుకున్నాయి. ఇన్‌చార్జి మంత్రుల నియామకాలు చేపట్టిన అనంతరం వారి ఆధ్వర్యంలో ఈ సమావేశాలను ఇప్పటికే పలు జిల్లాల్లో నిర్వహించారు. అందులో భాగంగా ఈనెల 30న ఒంగోలులో సమావేశం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి టీడీపీకి చెందిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు, కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీల నుంచి ఆ పార్టీల జిల్లా అధ్యక్షులు, ఇద్దరు ముగ్గురు ముఖ్యనేతలు పాల్గొంటారని సమాచారం. సమావేశం ఏర్పాటుపై మంత్రి డాక్టర్ స్వామితో ఆదివారం సాయంత్రం ఇన్‌చార్జి మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడినట్లు సమాచారం. ఇదిలా ఉండగా జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై జిల్లాస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం వచ్చేనెల 4న యథావిధిగా జరగనుంది.

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

దర్శి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ దర్శి ఈఈ పి. శ్రీనివాసులు సూచించారు. కేంద్రప్రభుత్వం సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసుకునే ప్రతి కుటుంబానికి రూ.30వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. బ్యాంకులు 90శాతం రుణాలను మంజూరు చేస్తున్నాయన్నారు. ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేసుకోవటం వలన విద్యుత్ బిల్లు భారం తగ్గిపోతుందన్నారు. అదనంగా విద్యుత్ తయారు చేసుకుంటే విద్యుత్‌శాఖకు విక్రయించి లాభాలు పొందవచ్చని వివరించారు. పంట పొలాలకు అక్రమంగా విద్యుత్‌తీగలు వేయటం వలన ప్రజలకు తగిలి మృత్యువాత పడుతున్నారని తెలిపారు. పందుల నుంచి పంటల రక్షణ కోసం కొందరు రైతులు విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

గుండ్లకమ్మ నది సర్వే ప్రారంభం

- ప్రక్షాళనకు ప్రజా సంఘాల పట్టు
- నిధుల కోసం ప్రభుత్వం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్న నేతలు

అద్దంకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి ఎదురు చూస్తున్న గుండ్లకమ్మ నది సర్వే ఎట్టకేలకు ప్రారంభమైంది. ప్రజా సంఘాల ఆందోళనలు, కోర్టు ఉత్తర్వులతో గుండ్లకమ్మ నది సర్వే మూడు రోజుల క్రితం ప్రారంభమైంది. గుండ్లకమ్మ నది ఆక్రమణలకు గురికావడం, కలుషితం కావడంతో ప్రక్షాళనకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. అయితే ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించారు. ఇటీవల కోర్టు లో జరిగిన లోక్ అదాలత్‌లో సర్వే చేసేందుకు అధికారులు అంగీకరించారు. దీంతో శుక్రవారం నుంచి మండల సర్వేయర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. డీపాపులేటెడ్ విలేజ్‌గా ఉన్న నరసింహాపురం సరిహద్దు నుంచి దిగువకు సర్వే ప్రారంభించారు. గుండ్లకమ్మ నది రెండు వైపులా హద్దులను గుర్తిస్తూ సర్వే చేస్తున్నారు. అద్దంకి మండల పరిధిలో ఉన్న గుండ్లకమ్మ నది మొత్తం సర్వే చేయనున్నారు. సర్వే పూర్తయిన తరువాత హద్దుల వద్ద సుమారు 6 అడుగుల ఎత్తు రాళ్లను పాతేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు ప్రజా సంఘాల నాయకులు ప్రయత్నాలు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. గుండ్లకమ్మ నది హద్దులను గుర్తించి మొత్తం శుభ్రం చేసి అందులోని వ్యర్థాలను రెండు వైపులా కట్టలుగా నెట్టనున్నారు.





అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నది సర్వే అనంతరం పాతిన ఎర్ర జెండా

ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులను బట్టి అద్దంకి పట్టణ ప్రాంతంలో ఘాట్‌ల ఏర్పాటు, గ్రీనరీ పెంపకం చేపట్టే అవకాశం ఉంది. ఘాట్‌ల ఏర్పాటు చేసి కార్తీక మాసంలో ప్రత్యేకంగా నదీ స్నానాలు చేసేందుకు కూడా అవకాశం ఏర్పడుతుంది. అద్దంకి మండల పరిధిలో సర్వే పూర్తయిన తరువాత మిగిలిన మండలాల పరిధిలో కూడా ఇదే విధంగా సర్వే చేయించాలనే ఆలోచనతో ప్రజాసంఘాల నేతలు ఉన్నారు. ఎట్టకేలకు గుండ్లకమ్మ నది సర్వే ప్రారంభం కావడంతో పాటు అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో గుండ్లకమ్మ నది అభివృద్ధి, ఘాట్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరుకు కూడా పెద్దగా ఇబ్బంది ఉండదనే అభిప్రాయంతో ప్రజా సంఘాల నేతలు ఉన్నారు. అన్నీ సక్రమంగా సాగితే గుండ్లకమ్మ నది పర్యాటకంగా కూడా అదే అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

మంత్రి ద్వారా నిధుల మంజూరుకు ప్రయత్నిస్తాం



గుండ్లకమ్మ నది సర్వే ప్రారంభమైంది. అద్దంకి మండల పరిధిలో సర్వే పూర్తయిన తరువాత మిగిలిన మండలాలలో కూడా సర్వే చేయించేందుకు ఆయా మండలాల అధికారులను కలుస్తాం. సర్వే తరువాత శాశ్వతంగా ఉండేందుకు ఎత్తుగా ఉండే రాళ్లను హద్దులలో పాతించడం జరుగుతుంది. గుండ్లకమ్మ నదిని శుభ్రం చేయించడం, అద్దంకి పట్టణం సమీపంలో ఘాట్‌ల ఏర్పాటు, గ్రీనరీ ఇతర పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల కోసం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలుస్తాం. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

- మన్నం త్రిమూర్తులు, అధ్యక్షుడు
అద్దంకి అభివృద్ధి కమిటీ



కాలువ కట్టపై రోడ్డు అభివృద్ధికి తోలిన గ్రావెల్

కాలువకట్టకు మరమ్మతులు

తాత్కాలికంగా తీరిన వాహనచోదకుల కష్టాలు

అద్దంకి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు తాత్కాలిక పరిష్కార మార్గంగా ఉన్న కాలువకట్ట అభివృద్ధిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టి సారించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కాలువ కట్ట అభివృద్ధికి కనీసం తట్ట మట్టి కూడా వేయలేదు. దీంతో ఆయా కాలనీల నుంచి ప్రజలు నామ్ రోడ్డు, రేణింగవరం రోడ్డు లకు వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువ కట్ట అభివృద్ధిపై స్థానికులు ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకుపోయారు. మినీ బైపాస్‌గా అభివృద్ధి చేసేందుకు గతంలో తయారు చేసిన ఫైల్‌ను బయటకు తీయించి రీఎస్టిమేషన్‌లు వేయించారు. అయితే నిధులు మంజూరై పనులు చేపట్టేందుకు సమయం పట్టే అవకాశం ఉండడంతో తాత్కాలికంగా గ్రావెల్ తోలించారు. రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు సుమారు రూ.10లక్షలతో గ్రావెల్ తోలించారు. దీంతో వాహనచోదకులకు, ఆయా కాలనీల ప్రజలకు తాత్కాలికంగా కష్టాలు తప్పాయి.



ప్రత్యేక అలంకరణలో వీర్ల గంగమ్మ

వీర్ల గంగమ్మ దేవాలయానికి పోటెత్తిన భక్తులు

మొక్కులు చెల్లించుకున్న పలువురు

బల్లికురవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి గాంచిన వీర్ల గంగమ్మ దేవాలయానికి ఆదివారం పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. భక్తుల కొంగు బంగారంగా పేరొందిన గంగమ్మ తల్లికి మొక్కుబడులు చెల్లించుకునేందుకు బంధు మిత్రులతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాలయ పూజారి చల్లగుండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గంగమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా దాతలు అందించిన వెండి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రానైట్ క్వారీల కార్మికులు, క్వారీ యజమానులు గంగమ్మను దర్శించుకున్నారు. బల్లికురవ, మల్లాయాలెం, కొండాయపాలెం, సోమవరప్పాడు, నక్కబొక్కలపాడు తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయానికి తరలి వచ్చారు.

సీఎం సహాయ నిధి.. పేదలకు పెన్నిధి

చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కొండయ్య



సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని జాండ్రపేటలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పేరాలకు చెందిన చెంచు ప్రసాద్‌కు రూ.1.06 లక్షలు, పందిళ్లపల్లికి చెందిన శివకుమారికి రూ.1.88 లక్షలు రావూరిపేటకు చెందిన మీరాకుమారికి రూ.1.48 లక్షలు, పుల్లరిపాలెంకు చెందిన రామచంద్రరావుకు రూ.62 వేలు, సాల్మన్ సెంటర్ పంచాయతీకి చెందిన జయకృష్ణకు రూ.1.06లక్షలు చెక్కులను ఎమ్మెల్యే కొండయ్య అందజేశారు. చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సీఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

సభ్యత్వంతో ఎంతో ఉపయోగం

టీడీపీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఆదివారం జాండ్రపేటలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు, నీటి సంఘాలు, సొసైటీలు తదితరాల్లో పోటీల్లో నిలిచే వారు క్రియాశీలక సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. ప్రమాద బీమాకు రూ.5లక్షలు, సహజ మరణానికి మట్టి ఖర్చులకు ఇతరత్రా ప్రయోజనాలను వివరించారు. సభ్యత్వాల చేర్పుల్లో పార్టీల శ్రేణులు క్రియాశీలకంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొప్పెరపాడు విద్యార్థులకు అభినందనలు

జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం



చెకుముకి టెస్ట్‌లో గెలిచిన కొప్పెరపాడు విద్యార్థులు

బల్లికురవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొప్పెరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఆదివారం చీరాలలో 25 పాఠశాలలకు చెందిన మండల స్థాయి విజేతలకు జిల్లా స్థాయి పోటీలు జరగ్గా కొప్పెరపాడు పాఠశాలకు చెందిన కె.నాగసాయి, చరణ్‌తేజ, కే కోటేశ్వరరావు, షేక్ మస్తాన్ అనే విద్యార్థులు చెకుముకి పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో వైజాగ్‌లో జరిగే చెకుముకి టాలెంట్ టెస్ట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బాపట్ల జిల్లా తరపున కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఏచూరికి నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

అద్దంకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పీడిత వర్గాల ప్రజల కోసం తుది శ్వాస వరకు పోరాడిన నేత సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య అన్నారు. ఏ చూరి సం స్మరణ సభ ఆదివారం సుందరయ్య భవన్‌లో జరిగింది. ఏచూరి చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు, రఘుచంద్, మన్నం త్రిమూర్తులు, బాబురావు, చెన్నుపాటి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి వర్సిటీ కబడ్డీ జట్టుకు మణిరెడ్డి



మణిరెడ్డి

చినగంజాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ కబడ్డీ క్రీడాకారుడు సోపర్ల మణిరెడ్డి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం విశ్వవిద్యాలయం కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, కబడ్డీ కోచ్ ఎం.గిరిబాబు ఆదివారం తెలిపారు. ఒంగోలు ఆంధ్రకేసరి వర్సిటీలో ఈనెల 25వ తేదీన జరిగిన అంతర్ కళాశాలల కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 30 నుంచి నవంబరు 3వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరిగే అంతర్ వర్సిటీల టోర్నమెంట్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం యూనివర్సిటీ కబడ్డీ జట్టులో పాల్గొంటారని తెలిపారు. మణిరెడ్డిని చినగంజాం బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గిరిబాబు, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు, క్లబ్ కార్యదర్శి భోగిరెడ్డి నాగాంజనేయులు, క్లబ్ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు సతీష్, భోగిరెడ్డి శివరెడ్డి, దేశం సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

30న మున్సిపల్ సమావేశం

అద్దంకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

450 మందికి వైద్య సేవలు

వలపర్లలో శిబిరానికి విశేష స్పందన

మార్టూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సూచనలు మేరకు మండలంలోని వలపర్ల గ్రామంలో ఆదివారం టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. సుమారు 450 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కంభంపాటి హనుమంతరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కాటూరి హాస్పిటల్ వైద్య బృందం డాక్టరు ఫణికుమార్, డాక్టరు సుస్మిత, డాక్టరు వనిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ వీరయ్య, ఎంపీటీసీ సభ్యుడు వంకాయల సుబ్బారావు, కోనంకి మణి, శంకర్, రామారావు, రమేష్ పాల్గొన్నారు.

నేడు, రేపు కరెంట్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయనుండడంతో సోమ, మంగళ వారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని, బల్లికురవ పరిధిలో ఉన్న కొత్తపాలెంలో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పక్కకు వాలిన ట్రాక్టర్

- కూలీలకు స్వల్ప గాయాలు
- తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలి పనులకు వచ్చిన వారికి ఆదివారం ప్రమాదం తప్పింది. చీరాల మండల పరిధిలోని బోయినవారి పాలెంకు కర్లపాలెంకు చెందిన సుమారు 15 మంది కూలి పనులకు ట్రాక్టర్‌లో వచ్చారు. డ్రైవర్ ట్రాక్టర్‌లో యూరియా బ్యాగులు కూడా వేయడంతో లోడు పెరిగింది. అంతేకాకుండా రోడ్డులో గుంతల వద్దకు వచ్చాక ట్రాక్టర్ ఒకవైపునకు వాలిపోయింది. దీంతో కూలీలంతా భయాందోళనతో కిందపడగా వారిలో నలుగురికి రక్త గాయాలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చినగంజాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొనసపూడి గ్రామ సమీపంలోని బ్రాంచి కెనాల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల మేరకు.. కొమ్మమూరు కాలువ బ్రాంచి కెనాల్ ద్వారా 60 ఎకరాలకు ప్రవహించే పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చి నీటిపై తేలియాడుతున్నట్లు తెలిపారు. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు. సుమారు 40-45 సంవత్సరాల వయస్సు ఉండవచ్చునని, శరీరం మీద తెలుపు రంగు ఫుల్ హాండ్ చొక్కా ఉన్నట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 9121102149, 9121102147, 9121102140సెల్ నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. గ్రామ వీఆర్వో నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చీరాల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జర భద్రం

గోతిలో పడితే అంతే



గుండ్లకమ్మ బ్రిడ్జిపై గోతులపై నుంచే వెళ్తున్న వాహనాలు



బ్రిడ్జిపై ఉన్న గోతులు

అద్దంకి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మీరు ద్విచక్ర వాహనంపై అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నదిపై ఉన్న బ్రిడ్జిపై గుండా ప్రయాణిస్తున్నారా... అయితే జర.. భద్రం.. ఎందుకంటే 5 దశాబ్దాల కిందట నిర్మించిన బ్రిడ్జి రెండు దశాబ్దాల క్రితం రెండు ఖానాల మధ్య కుంగింది. అప్పట్లో తాత్కాలిక మరమతులు చేసి కాలం వెళ్లదీసుకువస్తున్నారు. ఇది చాలదన్నట్లు బ్రిడ్జిపై గోతులు ఏర్పడుతున్నాయి. మరమ్మతులు చేసినా కొద్దిరోజులకే మళ్లీ దెబ్బ తింటున్నాయి. వర్షం కురిసనప్పుడు అయితే గోతులలో నీరు నిలిచి గోతులు కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి అయితే భయం భయంగా ప్రయాణించాల్సిందే. బ్రిడ్జికి రెండు వైపులా భారీ వాహనాలు ప్రయాణించరాదని హెచ్చరిక బోర్డులు పెట్టినా నిరోధించే వారు లేరు. బ్రిడ్జిపై గోతులు విషయాన్ని ఇటీవల మంత్రి రవికుమార్ దృష్టికి పలువురు తీసుకెళ్లారు. బ్రిడ్జిపై ఒక లేయర్ సీసీ రోడ్డు వేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు చెప్పారు. అధికారులు ఎప్పుడు పనిచేస్తారో మరి వేచి చూడాలి. గొట్టిపాటి మంత్రి హోదాలో ఉండడంతో ప్రస్తుతం కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓడల తయారీ క్లస్టర్లకు తీరప్రాంతం పరిశీలన




తీరప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర సభ్యుడు

చినగంజాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం తీరప్రాంతాన్ని కేంద్ర సభ్యుడు టి.సుబ్బారావు ఆదివారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో ఏర్పాటు చేయనున్న ఓడల తయారీ క్లస్టర్లకు కేంద్రం మద్దతు తెలపడంతో కేంద్ర సభ్యుడు పెదగంజాం ప్రాంతంలో పర్యటించారు. ఏటిమోగ గ్రామం వద్ద ఆయన రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలించారు. పెదగంజాం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లలో పట్టా భూమి ఎంత, ప్రభుత్వ భూమి ఎంత, మౌలిక వసతులు ఎలా ఉన్నాయి, మడ అడవులు రిజర్వు ఫారెస్ట్ వారు వేసి పెంచారా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మడ అడవులు వాటి అంతట అవే పెరిగాయని, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు వేసి పెంచలేదని స్థానిక మత్స్యకారులు తెలిపారు. అనంతరం పెదగంజాం, రాజుబంగారుపాలెం గ్రామాల మధ్య రొంపేరు కాలువపై నిర్మించిన ఎన్టీఆర్ వారధి వద్దకు వచ్చారు. అక్కడ నుంచి బోటులో ఆయన అధికారులతో కలిసి రొంపేరు కాలువలో ప్రయాణించి తీరప్రాంతాన్ని పరిశీలించారు. రొంపేరు కాలువ సముద్రంలో కలిసే ప్రాంతానికి (పొగురు) బోటులో వెళ్లి ఎంత విస్తర్ణంలో కలుస్తుంది అనే విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎస్ఐ ఎస్.రమేష్, సర్వేయర్ సుబ్బారావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నాయకులు జి.వెంకటేశ్వర్లు, దండ ప్రోలు తిరుపతిరావు, వాటుపల్లి ఏడుకొండలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

మార్టూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళుతున్న గోరంట్ల బ్రహ్మం అనే వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన ఆదివారం ఉదయం మార్టూరు పోలీస్ స్టేషన్ ఎదురుగా జరిగింది. తలకు గాయమవడంతో అతనిని బంధువులు చిలకలూరిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మార్టూరు గ్రామానికి చెందిన బ్రహ్మం ద్విచక్రవాహనంపై మార్టూరు నుంచి కోనంకి వైపు వెళుతుండగా విజయవాడ నుంచి ఒంగోలుకు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. కారులో ఉన్న వ్యక్తి భాగ్యనగర్ 4 వలైనుకు చెందిన మద్దెల శ్రీనివాస్‌గా హైవే మొబైల్ పోలీసులు గుర్తించారు.





కళా..సాగు భళా !

పొలంలో దిగి గోంగూరను పరిశీలిస్తున్న ఆమె వ్యవసాయ శాస్త్రవేత్త అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. ఆమె ఎవరంటారా... ఓ మహిళా రైతు. పేరు కళావతి. ఊరు కావలి మండలం కొత్తపల్లి. డిగ్రీ పూర్తి చేసిన ఆమె ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు. ఎకరా పొలం కౌలుకు తీసుకుని, వరి, కాయగూరలు, ఆకుకూరలు పండిస్తూ రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

వివరాలు 8లో



సోమశిల

నిండుకుండలా..

- పుష్కలంగా నీటితో జలాశయాలు కళకళ
- సోమశిలలో 65, కండలేరులో 42 టీఎంసీలు
- ఇంకా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- మొదటిపంట 8.50 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం
- రెండో పంటకూ ఢోకా ఉండదని అంచనా
- రైతుల మోముల్లో ఆనందం

ఎన్నడూ లేనంతగా ప్రస్తుతం ధాన్యానికి మంచి ధర వచ్చింది. గతంలో పుట్టి రూ.15 వేలు పలకగా, నేడు రూ.22 వేలకు తక్కువ పలకడం లేదు. కానీ ఏం లాభం.. జిల్లాలోని రైతులకు మాత్రం గడిచిన రెండు సీజన్లలోనూ ఈ ధర అందలేదు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా గత రబీ సీజన్‌లో సగం ఆయకట్టు కూడా సాగు కాలేదు. ఇక రెండో పంట సంగతి సరేసరి. దీంతో ఈ ఏడాది కూడా మా పరిస్థితి ఇంతేనా..? అంటూ దిగాలుగా ఉన్న రైతాంగానికి కూటమి ప్రభుత్వ చర్యలతో మంచి రోజులువచ్చాయి. రానున్న రబీ సీజన్ ప్రారంభానికి ముందే సోమశిల, కండలేరు జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ రెండు జలాశయాల సామర్థ్యం 146 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 107 టీఎంసీలు వీటిల్లో నిల్వ ఉంది. మొదటి పంట ఉమ్మడి నెల్లూరుతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 8.50 లక్షల ఎకరాలకు నీరందించేందుకు వీలు కలిగింది. ఇంకా ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో వచ్చే ఏడాది రెండో పంటకు కూడా రైతులకు చింత ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

-నెల్లూరు, ఆంధ్రజ్యోతి

గత జూలై 31న నాటికి సోమశిల, కండలేరులలో నీటి నిల్వలు అడుగంటాయి. సోమశిలలో 9 టీఎంసీలు, కండలేరులో 6 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నాయి. దీంతో తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవన్న ఆందోళన వ్యక్తమైంది. అయితే కృష్ణా పరివాహకంలో వర్షాలు కురవడం, శ్రీశైలం జలాశ యంలో 860 అడుగుల మట్టం దాటడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తీసుకొచ్చి, ఆ దామాషా నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు వినియోగించాలని భావించింది. ఆ క్రమంలోనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు నీటి విడుదల ప్రారంభించింది. తొలుత ఐదు వేల క్యూసెక్కులను విడుదల చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత క్రమేణా పెంచుకుంటూ వచ్చింది. ఆ తర్వాత కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో పూర్తి సామర్థ్యం నీటిని విడుదల చేయడం ప్రారంభించింది. ఒక దశలో కృష్ణా జలాల రాక రోజుకు 20 వేల క్యూసెక్కులకు చేరింది. అదే సమయంలో పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురవడం కూడా జిల్లాకు కలిసొచ్చింది. ఆ వర్షపు నీరు వాగులు, వంకల ద్వారా పెన్నాకు చేరి సోమశిలలో ఆగింది. ఆదివారం సాయంత్రానికి సోమశిలలో నీటి నిల్వ దాదాపు 65 టీఎంసీలకు చేరింది. అదే సమయంలో 21180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమశిల పూర్తి నిల్వ సామర్థ్యం 78 టీఎంసీలు. అంటే మరో పది టీఎంసీల వరకూ నిల్వ చేసుకునేందుకు అవకాశముంది. ప్రస్తుతమున్న ఇన్‌ఫ్లో మరికొన్ని రోజులు వచ్చే అవకాశాలున్నట్లు ఇరిగేషన్ అధికారులు భావిస్తున్నారు. దీంతో జిల్లాలో వర్షాకాలం ముందే సోమశిల పూర్తిగా నిండిపోనుంది. కాగా కృష్ణా జలాలు వస్తుండడంతో కండలేరుకు కూడా నీటిని విడుదల మొదలు పెట్టారు. తొలుత 2 వేల క్యూసెక్కులు విడుదల చేసిన అధికారులు ఆ తర్వాత దానిని ఆరు వేలకు, ఇప్పుడు రెగ్యులర్‌గా పది వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి కండలేరు నిల్వ 42 టీఎంసీలకు పెరిగింది. కండలేరు పూర్తి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా

(మిగతా 8లో)



కండలేరు డ్యాం

త్వరలో విమానాశ్రయం పనులు

- నెల్లూరు నగరంలోని రైస్ మిల్లులను తరలిస్తాం
- వైసీపీ ధర్నాలు విడ్డూరం
- మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 27: నెల్లూరుకి విమానాశ్రయం ఎంతో అవసరమని, త్వరలో విమానాశ్రయ ం పనులు ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఆదివారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్‌తో సమీక్ష నిర్వహించారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ ఎంతోకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న రెండు ముఖ్యమైన అంశాలను చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నెల్లూరుకి విమానమార్గం ఎంతో అవసరం ఉందన్నారు. ఎందుకంటే కృష్ణపట్నం పోర్టు, ఇంకా ఇతర పోర్టులు జిల్లాలో ఉన్నాయని తెలిపారు. వాటిలో కార్గో అనేది చాలా ముఖ్యమన్నారు. 2014-19 మధ్య టీడీపీ



సమీక్ష సమావేశంలో మంత్రులు నారాయణ, ఆనం, ఎమ్మెల్యేలు, కలెక్టర్

ప్రభుత్వంలో విమానాశ్రయాన్ని మంజూరు చేశామన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నెల్లూరులో కాదు మరో దగ్గర విమానాశ్రయం అని పనులను ఆపేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు నెల్లూరుకు వచ్చినప్పుడు దగదర్తిలోనే విమానాశ్రయం పెడతామని చెప్పారన్నారు. ఈ విషయమై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిశామన్నారు. స్థలం సిద్ధం చేసుకోవాలని, తాను కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తానని ఆయన చెప్పారన్నారు. ఇందుకోసం వచ్చే వారం ఓ బృందాన్ని పంపిస్తారన్నారు. వీలైనంత త్వరలోనే విమానాశ్రయం పనులు ప్రారంభిస్తామని నారాయణ వివరించారు.

రైలుమిల్లులను తరలిస్తాం.

రైసుమిల్లులు ఎక్కువగా కార్పొరేషన్ ప్రాంతంలో ఉన్నాయని చెప్పారు. అవి ఉన్న ప్రాంతంలో పొల్యూషన్ ఉండాల్సిన దానికన్నా, నాలుగురెట్లు ఎక్కువగా ఉందన్నారు. ఎన్జీటీ నిబంధనల ప్రకారం రైసు మిల్లులను ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉందన్నారు. రైసు మిల్లుల యజమానులకు ఎలాంటి నష్టం లేకుండా, వారితో చర్చించి కృష్ణపట్నం పోర్టు, కిసాన్‌సెజ్ తదితర ప్రాంతాలకు వాటిని తరలిస్తామని నారాయణ తెలిపారు.

ధర్నాలు చేయడం విడ్డూరం

కూటమి ప్రభుత్వంలో ఇసుక ధరలు తగ్గుతుంటే వైసీపీ వాళ్లు ధర్నాలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరం చుట్టూ ఉన్న రైసుమిల్లులను ఇతర ప్రాంతాలకు తరలించాలని భావిస్తున్నామన్నారు. ఒకప్పుడు నగరశివారులో ఉన్న ఈ మిల్లులు నగరం విస్తరించటంతో నడిబొడ్డుకు చేరాయన్నారు. రైసుమిల్లుల అసోసియేషన్ వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కందుకూరులో బెల్ట్ తీశారు !

8లో..

- గ్రామ గ్రామాన గొలుసు దుకాణాలు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు



రాళ్లపాడులో పూడికతీత

కందుకూరు నియోజకవర్గంలోని రాళ్లపాడు ప్రాజెక్టుకు సంబంధించి పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. కుడి, ఎడమ కాలువల్లో ఎంతో కాలంగా పేరుకుపోయిన పూడికను యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు.

8లో..

బోటు నిర్వాహకుల చేతివాటం

- ట్రాక్టర్‌కు రూ. 600 నుంచి రూ.1000 వరకు వసూలు
- ఆవేదనలో ఇసుక లోడింగ్ కూలీలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- అపహాస్యమవుతున్న ఉచిత ఇసుక పాలసీ

సంగం, అక్టోబరు 27: పెన్నానదిలో డీసిల్టేషింగ్ అనుమతులు పొందిన బోట్ల నిర్వాహకులు తీసిన ఇసుకను డంపింగ్ కేంద్రానికి తరలించకుండా, నేరుగా ట్రాక్టర్లకు విక్రయించి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అంతేకాక పెన్నానదిలో ఉచిత ఇసుక లోడింగ్ చేసే కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తతంగం గత నాలుగు రోజులుగా జరుగుతున్నా ఇటు రెవెన్యూ అధికారులుగానీ, అటు మైనింగ్ అధికారులుగానీ పత్తాలేకపోవడం గమనార్హం.

సంగం పెన్నానదిలో డీసిల్టేషన్‌తో ఇసుక తీసేందుకు మత్స్య సహకార సంఘాల బోట్లకు అనుమతించారు. ఇందుకుగాను టన్ను ఇసుకకు ప్రభుత్వం రూ. 150 చెల్లిస్తుంది. తీసిన ఇసుకను ప్రభుత్వం గుర్తించిన డంపింగ్ యార్డ్‌లకు తరలించాలి. అక్కడ నుంచి ఇసుకను బుకింగ్ చేసుకున్న టిప్పర్లు, లారీలకు టన్ను రూ. 350లకు విక్రయిస్తారు.



ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద నగదు తీసుకుంటున్న బోటు ఏజెంటు

బోట్లతో ఇసుక తీయడం, డంపింగ్ యార్డ్‌కు తరలించడాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. అయితే మైనింగ్ అధికారుల మాయాజాలం వల్ల ట్రాక్టర్లకు బుకింగ్ లభ్యం కాకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. నదుల్లోకి వెళ్లి కేవలం ఎడ్లబండ్లకు మాత్రమే అనుమతి ఉంది. ట్రాక్టర్లకు అనుమతి లేదు. దీంతో ఇసుక కష్టాలు ఏర్పడ్డా యి. డిమాండ్‌ను బట్టి ట్రాక్టర్ ఇసుక వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగానే రూ.3000 లు పలు కుతోంది. దీన్ని గమనించి న ప్రభుత్వం ఉచిత ఇసు క అందరికీ అందుబా టులోకి తెచ్చేందుకు అనుమతించింది.

ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వడంతో..

టాక్టర్లకు బుకింగ్ దొరకకపోవడంతో ఇసుక కొరత ఏర్పడింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. దీంతో వారం కిందట స్థానిక అవసరాలకు నదులు, వాగులు, వంకల్లో ట్రాక్టర్లతో ఇసుక తీసుకోవచ్చునని ప్రభుత్వం తెలిపింది. దీంతో ట్రాక్టర్లు నేరుగా పెన్నానదిలో కూలీలతో లోడు చేసుకుని తెచ్చుకునే అవకాశం కలిగింది. దీని వల్ల ఇసుక రేట్లు తగ్గడంతోపాటు ఉచిత ఇసుక పాలసీ నెరవేరినట్లయింది.

నేరుగా విక్రయాలు

నదుల్లో ఇసుకను తీసుకెళ్లేందుకు ట్రాక్టర్లకు అనుమతివ్వడంతో బోటు నిర్వాహకులు ఇసుకను డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా నేరుగా ట్రాక్టర్లకు విక్రయిస్తున్నారు. చిన్న ట్రాక్టర్‌కైతే రూ.500లు, పెద్ద ట్రాక్టర్‌కైతే రూ.1000 తీసుకుని లోడ్ చేస్తున్నారు. ఇందువల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడడంతోపాటు కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బోటు నిర్వాహకులు నేరుగా ట్రాక్టర్లకు ఇసుక విక్రయించకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్‌లో హత్యకు గురైన ముక్తియార్(ఫైల్)

- వరుస హత్యలతో వణుకుతున్న నెల్లూరు నగరం
- కత్తులతో యువత హల్‌చల్

పేట్రేగుతున్న హింస

- హద్దు మీరుతున్న రౌడీషీటర్ల అరాచకాలు
- పోలీసులను ఖాతరు చేయని నేరస్థులు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు నగరం కొంత కాలంగా రక్తసిక్తమయింది. వరుస హత్యలు, దొంగతనాలు, వేధింపులు, దాడులు, దోపిడీలు జరుగుతుండడంతో నగర ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతున్నది. ఈ సంఘటనల్లో రౌడీషీటర్ల ప్రమేయం అధికంగా ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది యువకులు కత్తులు జేబుల్లో పెట్టుకొని తిరగడం అలవాటుగా మారింది. వీరికి పోలీసులంటే లెక్కేలేకుండా పోయింది. అంతేకాక ఏదైనా నేర సంఘటన జరిగితే అందులో రాజకీయ నేతలు జోక్యం చేసుకోవడంతో నేరగాళ్లకు కలిసొస్తున్నది.

కత్తులతో హల్‌చల్

తాజాగా నెల్లూరు నగరంలో ఎక్కువమంది యువత కత్తులు చేత పట్టుకొని తిరిగే స్థాయికి వచ్చారు. రౌడీ షీటర్లు, పాత నేరగాళ్లు ఆయుధాలను తీసుకెళ్లడం చూస్తుంటాం. అయితే విద్యార్థులు, యువత సైతం కత్తుల్ని ఉంచుకోవడం తిరగడం ఇటీవల కనిపిస్తోంది. పాత నేరస్థులు ఇగోలకు వెళ్లి వారినివారే దారుణంగా హత్య చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి.

బర్త్‌డే వేడుకల్లో కొత్త సంస్కృతి

పుట్టినరోజు వేడుకలంటే ఓ ఫంక్షన్ హాల్ బుక్ చేసుకొని , బంధువులు, స్నేహితుల మధ్య ప్రశాంతంగా చేసుకోవడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం ఇలాంటి వేడుకలంటే ఆయా సెంటర్లలో ప్రత్యేక స్టేజీలు ఏర్పాటు చేసి, వీధులకు బ్లాక్ చేయడం, లైటింగ్, పెద్ద ఎత్తున ఫెక్సీలు, భారీ కేకును పెద్ద పెద్ద కత్తులతో కట్ చేయడం అలవాటుగా మారింది. అంతేకాక ఈ వేడుకలకు వచ్చేవారిలో అత్యధికులు నగరంలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులే ఉంటున్నారు. ఇలా వేడుకలు ఏమిటని నగర వాసులు ప్రశ్నిస్తే వారిపై దాడికి యత్నిస్తున్నారు. అర్ధరాత్రి వరకు జరిగే ఈ వేడుకలను ఆయాస్టేషన్ల పరిధిలోని బీట్‌కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నం చేస్తుంటే... మేము అధికార పార్టీకి సంబంధించిన వాళ్లం...నీస్థాయి ఏంటి... ? నిన్ను ఈ స్టేషన్‌లోనే లేకుండా చేస్తాం...మీ ఇన్‌స్పెక్టర్‌కి మేము ఎంత చెబితే అంత...అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో ఆ కానిస్టేబుళ్లు చేసేది లేక కేకు తిని వెళ్లిపోతున్నారు.



కూరగాయల మార్కెట్‌లో హత్యకు గురైన వాకా అశోక్(ఫైల్)

ఈ ఘటనలు పరిశీలిస్తే..

- అందరూ చూస్తుండగానే ఆటో మెకానిక్ దారుణ హత్యకు గురైన ఘటన అయ్యప్పగుడి వద్ద ఈనెల 24న రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు, నెల్లూరు రూరల్ ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ ముక్తియార్ (38) అలియాస్ మోటు, ముజహిద్ దంపతులు. వారికి నయాబ్ రసూల్, పర్వీన్‌లు సంతానం. కుమారుడు విజయవాడలో డిప్లమో, కుమార్తె నగరంలో ఏడో తరగతి చదువుతోంది. ముక్తియార్ అయ్యప్పగుడి వద్ద పఠాన్‌బాబుకి చెందిన ఆటో మెకానిక్‌షెడ్‌లో పని చేస్తున్నాడు. ఖాళీ సమయంలో ఆటో నడుపుతుండేవాడు. ఇటీవల యజమాని అతడ్ని పని నుంచి తొలగించాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆటోను సైతం కుదువ పెట్టాడు. మూడు రోజులుగా ఫూటుగా మద్యం సేవించి తనను తిరిగి పనిలోకి తీసుకోవాలని యజమానిని అడగసాగాడు. ఈ క్రమంలో ఈనెల 24న సాయంత్రం ముక్తియార్ షెడ్ వద్దకు వెళ్లి యజమానితో గొడవ పడ్డారు. మాటామాటా పెరిగి కోపోద్రిక్తుడైన బాబు ఇనుప రాడ్డుతో తలపై మోదడంతో ముక్తియార్ అక్కడిక్కడే మృతి చెందాడు.
- నగరంలోని మద్రాస్ బస్టాండు ప్రాంతంలో ఈనెల 14న అర్ధరాత్రి రౌడీషీటర్ వాకా అశోక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి హతమార్చారు. పోలీసుల సమాచారం మేరకు, అశోక్ టిఫిన్ చేస్తుండగా ఇద్దరు యువకులు అతడి వద్దకు వచ్చి 'ఏరా... ఇంకా మారవా' అంటూ ప్రశ్నించారు. దీంతో అతను మీకెందుకురా.. అని ప్రశ్నించగా, ఓ యువకుడు తన వద్ద ఉన్న కత్తితో బలంగా అశోక్‌ను పొడిచారు. అక్కడున్న వారు వారించడంతో ఇద్దరు యువకులు పరారయ్యారు. ఈ ఘటనలో అశోక్ మృతి చెందాడు.
- నగరంలోని రాంజీనగర్ మూడో వీధిలో అనూసింగ్ నివాసం ఉంటున్నాడు. ఆయన స్నేహితులతో కలిసి ఈనెల 8న రాత్రి ట్రంకురోడ్డు నుంచి రాధామాధవ్ థియేటర్ల సందు వైపు వెళుతుండగా ఓ బాలుడు వేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొన్నాడు. అంత వేగంగా వెళ్లడం ఎందుకు.. అని ఆ బాలుడిని వారు ప్రశ్నించారు. దీంతో ఆ బాలుడు కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేసి

(మిగతా 8వ పేజీలో)



ఆకుపై దుర్గమ్మ



బుల్లి ప్రెజర్‌కుక్కర్



పొగతో గణపతి

శంకరుడి దృష్టి సూక్ష్మ శిల్ప సృష్టి

ప్రతి వస్తువుపై కళాఖండాలు

- 'గంధవళ్ల' వృత్తి ఉపాధ్యాయుడు ప్రవృత్తి ప్రకృతి ఆరాధన
- ఎన్నో పురస్కారాలు.. ప్రశంసలు

ఆయన వృత్తి ఉపాధ్యాయుడు. ప్రవృత్తి వివిధ కళారూపాలు సృష్టించడం. నెల్లూరు నగరంలోని సుంకు చెంగన్న మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంధవళ్ల ఉమాశంకర్ ఊహ తెలిసిన నాటి నుంచే కాగితాలతో గ్రీటింగ్‌లు, అట్టముక్కలతో చిన్నచిన్న నమూనాలు తీర్చి దిద్దేవారు. వెదురు బద్దలతో పెళ్లిళ్లకు బహుమతులు తయారు చేసేవారు. బంకమట్టితో బొమ్మలు తయారు చేసేవారు. అలా మొదలైన ఆయన కళాత్మక దృష్టి ఎన్నో వినూత్న ప్రయోగాలు చేసేందుకు



సాధించిన రికార్డులు

- ఇండియన్ బుక్ రికార్డు
- ఆర్‌హెచ్‌ఆర్ వరల్డ్ రికార్డు
- తమిళనాడు స్టేట్ రికార్డు
- బెస్ట్ ఆర్టిస్టు, బెస్ట్ టీచర్ అవార్డు
- లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు
- యూనిక్ వరల్డ్ రికార్డు
- వండర్ రికార్డు
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్
- స్టేట్ బుక్ ఆఫ్ రికార్డు
- ఎవరెస్ట్ బుక్ ఆఫ్ రికార్డ్
- మిరాకిల్ వరల్డ్ రికార్డు

విద్యార్థిగా చదువుల్లో రాణించడమేకాక ఆటపాటలు, నాటకాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. ఎన్నో కొత్త విషయాలు, అధునాతన ఆలోచనల తో తనలోని కళను రంగరించి, వినూత్న ప్రయోగాలు చేసేవారు. ఇలా జిల్లా, రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నారు. ఆకులతో ప్రముఖుల చిత్రాలు, ప్రముఖ దినోత్సవాలకు విద్యార్థులకు బోధనకు ఉపయోగించే అక్షరాలు, తదితరాలను తయారు చేశారు. వాటిని సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించి అందరి మన్ననలు పొందేవారు. విద్యార్థులకు ఆకులతో చిత్రాల తయారీలో శిక్షణ ఇచ్చారు. బోన్సాయ్ మొక్కలు కూడా పెంచేవారు. తన ఇంటిని కూడా బోన్సాయ్ మొక్కలతో నందనవనంగా తీర్చిదిద్దారు. తనవంతుగా సైన్స్‌ఫెయిర్‌కు అనుకూలమైన నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. తన వాక్‌చాతుర్యంతో విద్యార్థులకు చక్కని బోధనను అందిస్తూ వారి అభిమాన గురువుగా రాణిస్తున్నారు.

- నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)



చంద్రబాబుకు జ్ఞాపిక అందజేస్తూ సెల్ఫీ (ఫైల్)

ఎన్నో రూపాలకు ప్రాణం

గంధవళ్ల ఉమాశంకర్ తన నైపుణ్యంతో ఎన్నో కళారూపాలకు ప్రాణం పోశారు. పొగ చిత్రాలు, సీసాలోపల చిత్రాలు, పెన్సిల్ మొనలపై అద్భుత చిత్రాలు, చాక్‌పీసులపై కళాఖండాలు ఆయన ప్రతిభకు తార్కాణాలు. పెన్సిల్‌ను దీపపు స్తంభంగా రూపొందించి వెలిగించారు. అలాగే చాక్‌పీస్‌తో అద్భుత దీపస్తంభం తయారు చేశారు. నెల్లూరు. నగరానికి విచ్చేసిన వివిధ రంగాల ప్రముఖులకు తన కళాఖండాలను బహుమతిగా అందజేసి ఆశీస్సులు, ప్రశంసలు పొందారు. ఆయన కళాతృష్ణ, కళారూపాలు ఎందరో కళాకారులకు స్ఫూర్తినిచ్చి ప్రోత్సహిస్తున్నాయి. ఇలా ప్రతిభను కనబరచడం వెనుక తన సతీమణి ప్రసన్న సహాయ సహకారం ఎంతో ఉందని చెబుతారు ఉమాశంకర్.

కళా.. సాగు భళా!

రైతులంటేనే నేడు చిన్నచూపు... అలాంటిది ఓ మహిళా రైతు అంటే పరిస్థితి ఇంకా దారుణం. కానీ ఏళ్ల తరబడి వ్యవసాయం చేస్తున్న రైతులతో పోటీగా రసాయనిక ఎరువులకు దూరంగా వ్యవసాయం సాగిస్తోంది ఆమె. అంతేనా.. సాగు చేసేది ఎకరా పొలమే. అదికూడా కౌలుకు తీసుకుని.. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు కావలి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి కళావతి.



తన చేలో పూసిన పూలు కోస్తున్న కళావతి

- ప్రకృతి వ్యవసాయంలో కళావతి నైపుణ్యం
- ఎకరం భూమిలో ఎన్నో పంటలు
- ప్రధానంగా వరిసాగు
- గట్లపై కూరగాయలు, ఆకుకూరల పెంపకం
- ఖర్చులు తగ్గించి, ఆదాయం పొందుతూ సేద్యం
- ఆదర్శ మహిళా రైతుగా ప్రశంసలు

పంటలో సాగులో పెట్టుబడులు తగ్గించడం... ప్రకృతి ప్రసాదించిన వనరులతో ఎరువులను తయారు చేసుకుని ఆరోగ్యకరమైన పంటను, మంచి దిగుబడులు సాధిం చడం.. ప్రకృతి వ్యవసాయం ప్రధాన ఉద్దేశం. ఈ క్రమంలో దుక్కు లు దగ్గర నుంచి పంటల ఎంపిక, సాగు నుంచి పంట చేతికందే వరకు ప్రకృతి అందిస్తున్న వాటిని ఎరువులుగా వాడుతూ దిగుబడులు పెంచుతూ ముందుకు సాగుతు న్నారు మహిళా రైతు



పంటకు అవసరమైన ఎరువులు తయారు చేస్తూ..

బుసిరెడ్డి కళావతి. డిగ్రీ చదువు కున్న ఆమెకు సాధారణ వ్యవసాయంలో అనుభ వం ఉన్నా ప్రకృతి వ్యవసాయ విధానంలో మాత్రం ఎనిమిదేళ్ల అనుభం ఉంది. ఆ అనుభవంతోనే ఎకరా పొలం కౌలుకు తీసుకుని ఏ గ్రేడ్ వరి రకమైన కెఎన్ ఎం-1638ను పండిం చారు. అంతేకాక ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచి ఆదాయం పొందుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అధికారుల సూచనలు పాటిస్తూ..

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ అధికారులు, సిబ్బంది ద్వారా అవగాహన పెంచుకుంది ఆమె. వారి సూచనలు పాటిస్తూ రసాయనిక ఎరువులకు బదులుగా బీజామృతం, జీవామృతం, నిమాస్త్రం వంటి వాటిని వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆమె అనుసరిస్తున్న పద్ధతుల ను చుట్టుపక్కల రైతులు వచ్చి తెలుసుకుని వారు కూడా అవలంబిస్తున్నారు. అంతే కాక గట్లపై ఆకుకూరలు, దోస, బీర అలసంద, బెండ, మొక్కజొన్న, బంతిపూలతోపా టు పశువులకు అవసరమైన మేతను సాగుచేస్తున్నారు కళావతి.

వచ్చిన ఆదాయం రూ.80,692

కళావతి కౌలుకు తీసుకున్న ఎకరా పొలంలో ప్రకృతి వ్యవ సాయ పద్ధతిలో సాగు చేసిన పంటల ద్వారా ఖర్చులు పోను రూ.80,692ల మేర ఆదాయం లభించింది. పెట్టుబడి విష యానికి వస్తే విత్తనాలు, దుక్కి, కూలీల ఖర్చుతోపాటు కౌలు ఖర్చులు సుమారుగా రూ.19840లు. పొలం గట్లపై వేసిన ఆకుకూరలు, దోస, బీర, అలసంద, పశువుల మేతకు సంబంధిం చిన విత్తనాలకు పెట్టుబడి రూ.2500లు. అలాగే గోంగూర, బంతి, బెండ, అలసంద, మొక్కజొన్న సాగుకు అవసర మైన విత్తనాల ఖర్చు రూ.1360లు. మొత్తం మీద రూ.23700లు ఖర్చులు. ఆయా పంటల ద్వారా వచ్చిన ఆదాయం రూ.1,04,392లు. ఖర్చులు పోగా వచ్చిన ఆదాయం నికరంగా రూ.80692లు. ఇది ఒక పంటకాలంలో కళావతి సాధించిన ప్రగతి.

- నెల్లూరు వ్యవసాయం, (ఆంధ్రజ్యోతి)

ఖర్చులు తగ్గించుకుంటేనే ఆదాయం

పంటల సాగులో అదనపు ఖర్చులు తగ్గించడమే ప్రకృతి వ్యవసాయ ప్రధాన ఉద్దేశం. ప్రకృతిలో లభించే వాటిని వినియోగించుకోవడం వల్ల రసాయనిక ఎరువులను దూరం పెట్టవచ్చు. దిగుబడులు ఆశించినంత వస్తాయి. కళావతి సాగు చేసిన పంటలను నెలలో రెండు సార్లు తప్పనిసరిగా పరిశీలించి, అవసరమైన సలహాలు ఇచ్చాం.



- మాలకొండయ్య, డీపీఎం, ఏపీసీఎన్‌ఎఫ్

ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించా..

ఎకరా కౌలుకు తీసుకుని ఏగ్రేడ్ వరి సాగుచేశా. విత్తనశుద్ధి, దుక్కి, దున్నడం దగ్గర నుంచి పంట కోత దశకు వచ్చే వరకు కేవలం ఆవు మూత్రం, పేడ ద్వారా తయారుచేసుకున్న ఎరువులనే పంటకు వినియోగించా. వరినారు శుద్ధికి బీజామృతం, ప్రధాన పొలంలో నాటిన పైరుకు ఘనజీవామృతం, నిమాస్త్రం వంటివి పంటకు అందించడంతో ఖర్చులు బాగా తగ్గాయి. అంతేకాక అధిక దిగుబడిని సాధించా. పంటల సాగులో ఏపీ కమ్యునిటిబేస్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్‌ఎఫ్) డీపీఎం మాలకొండయ్య, ఏడీపీఎం మునిరత్నం, డీపీపీ కరిమున్నీసా సూచనలతోపాటు మా అత్త రాజమ్మ ఎంతో సహాయం చేశారు.



- బుసిరెడ్డి కళావతి

పేట్రేగుతున్న హింస

(7వ పేజీ తరువాయి)

వారితో వచ్చి లీలామహల్ సెంటర్ వద్ద నుంచి వెళుతున్న అనూసింగ్, స్నేహితులపై రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనను చూసిన ప్రజలు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు.

- సీసీఎస్ పోలీసుస్టేషన్ సమీపంలో రౌడీషీటర్ ప్రణయ్‌పై సెప్టెంబరు 29న అర్ధరాత్రి పలువురు యు వకులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. నెల్లూరు బోడి గాడితోటకు చెందిన ఆర్ అర్మగం భార్య రైల్లో యా చిస్తూ జీవిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన ఆకాష్ భార్య కూడా యాచన చేసేది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ వివాదంలో ఆ ర్ముగంపై ఆకాష్ చేయి చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 29న అర్ధరాత్రి ఆర్ముగం తన స్నేహితుడ యిన తడికల బజారుకు చెందిన రౌడీషీటర్ ప్రణ య్‌తో సీసీఎస్ పోలీసుస్టేషన్ సమీపంలో మాట్లాడు తుండగా, ఆటోలో ఆకాష్‌తో పలువురు అక్కడకు చేరుకొని రాళ్లతో దాడి చేశారు. ఈ క్రమంలో ప్రణయ్‌పై కత్తితో దాడి చేశారు.
- అలాగే నగరంలోని మద్రాస్ బస్టాండు సెంటరు సమీపంలో ఇటీవల మామని అల్లుడు కత్తితో దారుణంగా పొడిచి హత్య చేశాడు.
- గత ఏడాది రామలింగాపురం సెంటర్‌లో జరిగిన రౌడీ షీటర్ హత్యను ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు. ఇలా చెప్పుకుంటూపోతే ఇటీ వల జరుగుతున్న వరుస హత్యలు, దోపిడీలు, దొంగ తనాలు నెల్లూరు నగర ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారు లు ఈ హింసాత్మక సంఘటనలపై దృష్టి సారించి, శాంతిభద్రతలు కాపాడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

నగరంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(క్రైం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఆదివారం రాత్రి పోలీసు అధికారులు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని, లైసెన్సులు లేని వాహనదారులపై జరిమానాలు విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. రికార్డులు సరిగా లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. రికార్డులు సరిగా లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళానికి చెందిన కృష్ణ (47) కొంత కాలంగా చెముడుగుంట సమీపంలో రహదారికి కూతవేటు దూరంలో ఉన్న రైస్ మిల్లులో కాపురం ఉంటూ పనిచేసుకొని తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే పని నిమిత్తం బుజబుజనెల్లూరుకు వెళ్లి తిరిగి ఆటోలో వచ్చి దిగి తాను పనిచేస్తున్న రైస్ మిల్లుకు వెళ్లేందుకు రహదారి దాటుతుండగా గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి మృతుడి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు పక్కన పడి ఉన్న కృష్ణ మృతదేహం

శరవేగంగా పూడికతీత

- రాళ్లపాడు కుడి, ఎడమ కాలువల్లో పనులు

లింగసముద్రం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు రిజర్వాయరు కుడి, ఎడమ కాలువల్లో పూడికతీత పనులు శరవేగంగా సాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రాజెక్టు కింద వరిసాగు లేక, కాలువలు పూడిక, పిచ్చిచెట్లతో నిండిపోయాయి. నాలుగేళ్ల తర్వాత రాళ్లపాడు ఆయకట్టు రైతులు ఈ ఏడాది వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కుడి, ఎడమ కాలువల్లో పూడితతీతకు ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఎడమ కాలువ పూడికతీత పూర్తవగా, కుడికాలువ పూడితతీత పనులు 40 శాతం మేర పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. మూడునాలుగు రోజుల్లో పనులు పూర్తిచేసి వరి నారుమళ్ల కోసం నీటిని విడుదల చేస్తామన్నారు.



రాళ్లపాడు కుడికాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

నిండుకుండలా జలాశయాలు

(7వ పేజీ తరువాయి)

ఇక్కడ మరో 20 టీఎంసీలు నిల్వ చేసుకునేందుకు అవకాశముంది. ఈ ప్రాజెక్టు కూడా జిల్లాలో వర్షాలు కురిసే సమయానికి నిండు కుండలా మారిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే ఆగస్టు ఒకటి నుంచి ఇప్పటి వరకూ 92 టీఎంసీలకు పైగా నీరు సోమశిల, కండలేరు జలాశయాల్లోకి చేరడం గమనార్హం.

రైతుల్లో ఆనందం

సీజన్‌కు ప్రారంభంలోనే సోమశిల, కండలేరు జలాశయాలు నిండిపోవడంతో ఉమ్మడి నెల్లూరు జిల్లా రైతాంగం మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత రెండు సీజన్లలో సరిగా సాగు చేసుకోలేక రైతాంగం నానా అవస్థలు పడింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గతేడాది రెండో పంట సమయంలో నీటి దుర్వినియో గం జరిగిన మూలంగా గత రబీ సీజన్‌లో పూర్తి ఆయకట్టులో సాగు జరగలేదు. కేవలం మూడు లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందించగలిగారు. ఇక ఈ ఏడాది రెండో పంట అయితే అసలు సాగు జరగలేదు. ధాన్యానికి మంచి ధర ఉన్న సమయం లో ఇటువంటి పరిస్థితులు తలెత్తడం రైతాంగాన్ని కుంగదీసింది. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందు చూపుతో రబీ సీజన్ లో పూర్తి ఆయకట్టు సాగు జరగనుంది. ప్రస్తుతం రెండు జలాశయాల్లో 107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెడ్ స్టోరేజీ పది టీఎంసీలు, తాగునీటి అవసరాలు పోను 90 టీఎంసీలను సాగు కు ఉపయోగించుకోవచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మరో 50 వేల ఎకరాలకు ఈ దఫా సాగునీరు ఇచ్చేందుకు వీలు కలుగుతుంది. అలాగే ఇంకా సోమశిలకు ఇన్‌ఫ్లో కొనసాగుతుండడం, జిల్లాలో నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు కురిసే అవకాశాలున్న నేపథ్యంలో వచ్చే ఏడాది రెండో పంటకు కూడా ఢోకా ఉండదని ఇరిగేషన్ ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

సోమశిలకు 22,368 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 22,368 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 64.350 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50 క్యూసెక్కులు, కండలేరు డ్యాంకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

కందుకూరులో బెల్ట్ తీశారు!

- గ్రామగ్రామాన బెల్ట్ షాపులు
- అధిక ధరకు మద్యం విక్రయం
- దుకాణాల్లోనే రూ.10 అదనం
- పట్టించుకోని ఎక్సైజ్

కందుకూరు, అక్టోబరు 27: నూతన మద్యం పాలసీతో మద్యం ప్రియులకు సరసమైన ధరలకే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తేవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి మద్యం షాపుల యజమానులు తూట్లు పొడుస్తున్నారు. షాపులకన్నా బెల్టే ముద్దు అన్న చందంగా గ్రామగ్రామాన బెల్ట్ దుకాణాలను ఏర్పాటుచేసి సరుకును అక్కడకు తరలించి అమ్ముకోవడానికే మక్కువ చూపుతున్నారు. ఎమ్మార్పీకన్నా అదనంగా అమ్మాలన్న మద్యం షాపుల యజమానుల ఆలోచనలకు ఎక్సైజ్ అధికారులు సహకరించడం లేదు. దీంతో వారు అధిక ధరల విక్రయాలకు బెల్ట్ దుకాణాలను రాజమార్గంగా ఎంచుకుంటున్నారు.

గ్రామ గ్రామాన దుకాణాలు

నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చి పదిరోజులు కూడా కాకపోయినా గ్రామగ్రామాన బెల్ట్ దుకాణాలు వెలిశాయి. బెల్ట్ దుకాణాలలో క్వార్టర్ బాటిల్‌ను ఎమ్మార్పీకన్నా ఇరవై, ముప్పై రూపాయలు అదనంగా వసూలు చేస్తూ దర్జాగా విక్రయాలు చేస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారు లు చోద్యం చూస్తున్నారు. ఒక మండల పరిధిలో వచ్చిన మద్యం దుకాణాన్ని ఆ మండలంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చునన్న నిబంధన ఉండటంతో తొలుత షాపులు దక్కించుకున్నవారు పలుచోట్ల పోటాపోటీగా దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో మద్యం వ్యాపారుల మధ్య పోటీ నెలకొంది. ఎమ్మార్పీకే మద్యం దొరుకుతుందని మందుబాబులు ఆశించగా మద్యం విక్రయాలను ఆదాయ వనరుగా మార్చుకోవాలన్న లక్ష్యంతో వ్యాపారులు సర్దుబాటు చేసుకుని ఒక గ్రామంలో ఒకే దుకాణం ఉండేలా చూసుకోవటంతోపాటు బెల్ట్‌గ్రామాలను పంచుకుని పోటాపోటీగా అధిక ధరలకు అమ్మకాలు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో రెండు,మూడు బెల్ట్ దుకాణాలు ఇప్పటికే ఏర్పాటు చేశారు. జనాభా అధికంగా ఉండే గ్రామాల్లో నాలుగైదు బెల్ట్‌షాపులు కూడా వెలవటం విశేషం. అధికార పార్టీ నాయకుల కనుసన్నలలోనే బెల్ట్‌షాపుల నిర్వాహకులు నిర్ధారణ జరగటంతో వారు ఇష్టారీతిగా అధిక ధరలకు అమ్మి సొమ్ముచేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



అధిక ధరలకు విక్రయం

మద్యం షాపుల నిర్వాహకులే బెల్ట్‌షాపుల వారికి ఎమ్మార్పీకి ఇవ్వకుండా వారివద్ద క్వార్టర్‌కు రూ. 10 అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో వారు ఆ మద్యాన్ని గ్రామాలకు తీసుకెళ్లి రూ. 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. మరోపక్క పట్టణంలోని కొన్ని మద్యం దుకాణాల వద్ద యథేచ్ఛగా అనధికార సిటింగ్‌లు ఏర్పాటుచేసి వాటర్, గ్లాసు పేరుతో వసూళ్లకు తెరలేపటం విశేషం. ఎక్సైజ్ అధికారులు తగినచర్యలు తీసుకుని ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పాకశాలలకు శంకుస్థాపన

బిట్రగుంట, అక్టోబరు 27, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జేపీగూడూరు పంచాయతీలోని సోమేశ్వరపురం కామాక్షితాయి సోమేశ్వరసామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పాకశాల శంకుస్థాపనకు భూమిపూజ చేశారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ చార్యులు శాస్త్రోక్తంగా ఈ పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో రాధాకృష్ణ మాట్లాడారు. దేవాదాయ శాఖ నిధులు రూ.10లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి, యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, పుట్టా సుబ్బారావు, కోటారెడ్డి, మాల్యాద్రి, అర్చకులు సూర్యప్రకాష్ ఉన్నారు.

భగవద్గీత ప్రచారం

వింజమూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో వెలగాలి అనే ఉద్దేశ్యంతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం

ప్రకృతి వ్యాలీ వ్యవస్థాపకుడు దాట్లరాయి జగపతిరాజు సమూహం ఆధ్వర్యంలో ఇంటింటా ధర్మ ప్రచార కార్యక్రమం ఆదివారం జరిగింది. వింజమూరులోని ఎర్రబెల్లిపాలెం గ్రామం, బొమ్మ రాజుచెరువు గ్రామం, ... గ్రామంలోని ఇంటింటికి తిరిగి శాకాహారంపై ప్రచారం చేశారు.

రూ.లక్షలు వెచ్చించి.. మూలకు చేర్చి..

- వైద్యుడు లేక నిరుపయోగంగా ఫిజియోథెరపీ పరికరాలు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫిజియోథెరపీ వైద్యుడి పోస్టు గతేడాదిగా ఖాళీగా ఉండడంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారాయి. గతంలో ఇక్కడ పనిచేస్తున్న వైద్యుడిని అధికారులు ఇతర ప్రాంతానికి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఇక్కడ వైద్యుని నియామకం జరగలేదు. జిల్లా కేంద్రానికి వంద కిలోమీటర్లు దూరంలో ఉన్న ఉదయగిరి ప్రాంతంలో ఫిజియోథెరపీ సేవలు ఎంతగానో అవసరం. ప్రస్తుతం వైద్యుడు లేకపోవడంతో పలువురు రోగులు స్థానికంగా, ఇతర ప్రాంతాల్లో ఉండే ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. వ్యయప్రయాసాలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో పలు విభాగాలకు సంబంధించి వైద్యుల నియామకం చేపట్టకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను నియమించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న ఫిజియోథెరపీ పరికరాలు

ఆత్మరక్షణకు కరాటే ఆయుధం: ఎమ్మెల్యే దగుమాటి

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తనను తాను రక్షించుకోవటానికి కరాటే ఒక ఆయుధంగా పనిచేస్తుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక పట్టాభిరామ కల్యాణ మండపంలో కరాటే చాంపియన్‌షిప్ పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబు నాయుడు, గుంటుపల్లి, రాజకుమార్ చౌదరి, తటవర్తి రమేష్, తిరువీది ప్రసాద్ పాల్గొన్నారు.

అంకమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మండలంలోని చలంచర్ల పంచాయతీ పెద్దవరం గిరిజన కాలనీలో ఆదివారం జరిగిన అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బాధితురాలికి న్యాయం చేయాలి



వైద్యశాలలో బాధితురాలిని పరామర్శిస్తున్న దళిత నేతలు

ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనంతసాగరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని మోసం చేసి ఆత్మహత్యా యత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ సీమాంధ్ర అధ్యక్షుడు పందిరి సుబ్బయ్య, కులవివక్ష పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య కోరారు. ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆదివారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం జరగకపోతే పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు, హ్యూమన్‌రైట్స్ జిల్లా నాయకులు దిపోగు బాబు, వాదాల కోటేశ్వరి, పి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన

ఉదయగిరి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొడేపల్లి, కృష్ణంపల్లి రెవెన్యూ పరిధిలో ఆక్రమణకు గురైన సీజేఎఫ్ఎస్, గండిపాళెం జలాశయం ముంపు భూములను తహసీల్దారు సుభద్ర ఆదేశాల మేరకు వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, సచివాలయ సర్వేయరు రామకృష్ణలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూములను చదును చేసిన వారితో చర్చించారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు యత్నించినా, చదును చేసి పంటలు సాగు చేసేందుకు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెచ్‌ఎంల సంఘం డివిజన్ సమావేశం

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డివిజన్ సమావేశం ఆదివారం పట్టణ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు. సమావేశంలో కేంద్రం విద్యార్థులకు ప్రవేశపెట్టిన అపార్ ఐడీ నంబరు క్రియేషన్‌లో ఎదురయ్యే ఇబ్బందులపై చర్చించారు. అలాగే నవంబరులో జరిగే జిల్లా అసోసియేషన్ సమావేశం గురించి చర్చించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి సీహెచ్.చలపతి, జిల్లా కౌన్సిలర్ ఆర్.మురళీధర్, డివిజన్ అధ్యక్షుడు చాగంటి మురళీ, కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా పరీక్షల కార్యదర్శి శ్రీరామకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

అనంతసాగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి, ఉద్యోగాల కోసం సోమవారం అనంతసాగరంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరుగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో యువత పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దారు సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 11న ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి జాబ్‌మేళ జరుగుతుందని, 10వ తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, ఏదైన డిగ్రీ, పీజీ చేసిన నిరుద్యోగులకు ప్రయివేట్ సెక్టార్‌లో ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు : డీఎం

ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట, ద్రాక్షారామం దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 8 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని, ఒక్కొక్కరికి రానుపోను టికెట్ ధర రూ. 2700గా నిర్ణయించామన్నారు. అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతామని తెలిపారు. ఒక్కొక్కరికి రానుపోను టికెట్ ధర రూ.1400గా నిర్ణయించామన్నారు. వాటికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆత్మకూరు డిపో మేనేజర్ లేదా అసిస్టెంట్ మేనేజర్లను 9959225645, 7382924753 నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

- కందుకూరు: కార్తీకమాసంలో కందుకూరు డిపో నుంచి అరుణాచలం గిరిప్రదక్షిణకు, పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతిశనివారం రాత్రి ఇక్కడి నుంచి బస్సు బయలుదేరుతుందని, అలాగే కార్తీక పౌర్ణమి సందర్భంగా పంచారామ క్షేత్రాలైన అన్నవరం, కుండలేశ్వరం యాత్రకు నవంబరు 14న ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శబరిమల యాత్రకోసం కిలోమీటరుకు రూ.57 చొప్పున అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామని పూర్తి వివరాల కోసం సెల్:73828 89870, 83285 86114 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విశ్వోదయ సంస్థల వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) మానవతావాదని ప్రముఖ వైద్యులు అల్లం శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం సంస్థ సేవా సమితి కార్యాలయంలో 60 మంది పేద వృద్ధులకు ఆయన నగదు, బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడారు. డీఆర్ విద్యాప్రదాత అని ఆయన సమాజానికి చేసిన సేవలు మరువలేనివి అన్నారు. డీఆర్ మార్గంలోనే ఆయన తనయులు వినయకుమార్ రెడ్డి, విద్యాధర్‌రెడ్డిలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, సేవాసమితి సభ్యులు రామకృష్ణ, సతీష్‌సింగ్, రంగనాయకులు, బాష పాల్గొన్నారు.



వృద్ధురాలికి నగదు అందజేస్తున్న అల్లం శ్రీనివాసులు

మందకృష్ణ మాదిగ పర్యటనను జయప్రదం చేయండి

- ఎమ్మెస్పీ జాతీయ నేత గొల్లపల్లి

కావలి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నవంబరు 3న చేపట్టనున్న జిల్లా పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ కోరారు. ఆదివారం అరుంధతివాడలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు అక్కిలగుంట ఏసు అధ్యక్షతన సంఘం సభ్యులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్, వెంకటేశ్వర్లు, వేగూర వెంకటేశ్వర్లు, గేరా జానకి, పెంచులయ్య పాల్గొన్నారు.

ఆత్మీయసభను జయప్రదం చేయండి

- కందుకూరు: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ నవంబరు 3న ఒంగోలులో నిర్వహిస్తున్న ఆత్మీయసభను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మీయ సభకు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలంతా పెద్దసంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు

- బిట్రగుంట: ఎస్సీ వర్గీకరణ వద్దు అందరు ఐక్యమత్యంగా ఉండటం ముద్దని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. బోగోలు మండలం చెన్నారాయినపాలెం పంచాయతీ మాలపల్లెలో ఆదివారం సాయంత్రం వర్గీకరణకు వ్యతిరేకంగా స్థానికులను చైతన్య పరుస్తూ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు నాలుగో తేదీన వర్గీకరణ వెతిరేకిస్తూ అల్లూరులో మాలల మహాగర్జన చేపడుతునట్లు తెలిపారు.

నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఆర్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఇరిగేషన్ ఈఈ



ఆత్మకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు జనవనరుల శాఖకు సంబంధించి జరిగిన నష్టాలను పరిశీలించి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనిధులతో తూముల మరమ్మతులు చేపడతామన్నారు.

? ఎన్ని కోట్ల రూపాయలకు ప్రతిపాదనలు పంపారు.

! ఆత్మకూరు డివిజన్ పరిధిలోలో 25 పనులకు గాను రూ. 3 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. అదే క్రమంలో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు చెరువులు, తూముల అభివృద్ధికి రూ. 4.85 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. ఈ నిధులతో 53 పనులు చేట్టనున్నాం.

? ఏయే మండలాలకు ఎన్ని నిధులు కేటాయించారు.

! ఆత్మకూరు మండలంలో 21 పనులకు గాను రూ. 2 కోట్లు, ఏఎస్‌పేటలో 8 పనులకు కోటి రూపాయలు, చేజర్లలో 4 పనులకు రూ. 60లక్షలు, అనంతసాగరంలో 14 పనులకు రూ. 73లక్షలు, మర్రిపాడులో 6 పనులకు రూ. 50లక్షల నిధులు కేటాయించాం. ఇప్పటికే ఆత్మకూరు సప్లయ్ ఛానల్‌కు ఏటికాలువ పూడికతీత పనులు పూర్తిచేశాం.

? ఎన్ని నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

! ఆత్మకూరు మండలంలో 8, చేజర్లలో 10, మర్రిపాడులో 18, ఏఎస్‌పేటలో 14, అనంతసాగరం మండలంలో 10 నీటి సంఘాలు ఉన్నాయి. ఈ నీటి సంఘాలకు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాం.

న్యూస్ బాక్స్

మండప నిర్మాణానికి విరాళం

కందుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ ఆలయంలో అనివేటి మండప నిర్మాణానికి మంచిరాజు వెంకట మురళీమోహన్, చంగాళ అపర్ణ దంపతులు ఆదివారం రూ.25,116లను అందజేశారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీసభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి ఈ మొత్తాన్ని అందజేశారు. అలాగే కోయగుంట్ల బాలఅంకయ్య, రమణమ్మ దంపతులు రూ.5116లను ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీసభ్యులు వారికి అభినందనలు తెలిపారు.

అర్చకుడికి చేయూత

కావలి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): యూరాలజీ సమస్యతో బాధపడుతూ సర్జరీ చేయించుకున్న సాయి దేవస్థానం అర్చకులు నాగేంద్రస్వామికి ఆదివారం కావలి బ్రాహ్మణ మహాసంఘం సభ్యులు రూ.22,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు టీవీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, రమేష్, రవికుమార్, రాజేంద్రకుమార్, తెలికేపల్లి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం

కావలి టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బుడమగుంట గిరిజనులకు ఆదివారం డాక్టర్ కర్నాటి రోహిత్, డాక్టర్ నాగభార్గవి దంపతులు పాప అనురాధ 2వ పుట్టిన రోజు పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ కుటుంబానికి సంబంధించిన కార్యాలన్నీ పేద గిరిజనుల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా మలుచుకున్నామని తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

గుడ్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలో ఆదివారం యూటీఎఫ్ మండలశాఖ స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జివి చలపతి శర్మ పాల్గొన్నారు. సంఘం వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి, మక్కెన కోటయ్యలు చేసిన పోరాటలను నెమరు వేసుకున్నారు. అనంతరం సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షుడిగా మనోహరం, ప్రధాన కార్యదర్శిగా మక్కెన రమేష్‌బాబు, సహాయకార్యదర్శులుగా మాల్యాద్రి, ఎస్. ప్రసన్నకుమారి, కోశాధికారిగా ఆర్ సుధాకర్‌లు ఉన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాల్యాద్రి, యు. జ్యోతికుమారి, వెంకటేశ్వర్లు, మధుసూదన్, ఎం.తిరుపతి స్వామి, పొన్నగంటి వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో సోమవారం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ వి.సాంబశివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

అనంతసాగరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరులో ఆదివారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సీ కాలనీకి చెందిన ఆత్మకూరు వెంకటేశ్వర్లు, చీకుర్తి పెంచల ప్రసాద్ కుటుంబాలకు గత కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. ఈక్రమంలో ఇరువురికి మాట మాట పెరిగి గొడవకు దిగారు. ఈక్రమంలో వెంకటేశ్వర్లు కర్రతో పెంచలయ్య, అతని భార్య పుష్పలతపై కర్రతో దాడి చేయగా ఇద్దరూ గాయపడ్డారు. వారిని బంధువులు ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. అయితే ఇందులో దాడికి పాల్పడిన వెంకటేశ్వర్లు వైసీపీ చెందిన వాడు కాగా, గాయపడిన వారు టీడీపీ అనుచరులు కావడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతసాగరం పోలీసులు తెలిపారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

ఉలవపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేసేందుకు అర్హులని సెలైన్లు, ఇంజక్షన్లు వేయరాదని కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని ఆర్ఎంపీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రోగులకు స్టెరాయిడ్స్ ఇచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే చట్టరీత్యా శిక్షార్హులని హెచ్చరించారు. తనిఖీలలో తన దృష్టికి వచ్చిన అంశాలను జిల్లా ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా నివేదిక అందజేస్తామన్నారు.